VISALANDHRA VIJAYAWADA PHONE No. 376

701634

విశాలాంధ్ర

6 పేజీలు 7 నయాపైసలు రిజిష్టర్డు నెం H-203

విజయవాడ] 28-1-1964 • మంగళవారం [సంపుటి 13 సంచిక 300

‘విశాలాంధ్ర’
చందా వివరాలు

	ఏజంటుద్వారా	పోస్టుద్వారా
సంవత్సరం	28.00	30.00
ఆరు మాసాలు	14 00	15 00
మూడు మాసాలు	7 00	7 75
ఒక మాసం	2 40	2 60

ఫ్రాన్స్ - చైనా దౌత్య సంబంధాలు

పారిస్ జనవరి 27

ఫ్రాన్స్, చైనా పరస్పరం దౌత్య సంబంధాలు ఏర్పరచుకోడానికి నిర్ణయించినట్లు పారిస్‌లో నేడు అధికార ప్రకటన వెలువడింది. ఉభయ ప్రభుత్వాల ఉమ్మడి అంగీకారంపై ఈ నిర్ణయం జరిగినట్లు ఈ ప్రకటన తెలుపుతూంది. మూడుమాసాల లోగా రాయబారులను నియమించుకోడానికి ఉభయ దేశాలు అంగీకరించాయి.

జనవరి 31 లోగా ప్రభుత్వం తగు సమాధానం ఇవ్వకపోతే ఫిబ్రవరి 3 నుండి సత్యాగ్రహ ప్రారంభం: శ్రీ వై. వి. కృష్ణరావు ప్రకటన

◆

ఆయా తాలూకా, జిల్లాఅధికారులకు కార్యాచరణ కమిటీలు వెంటనే నోటీసులు అందజేయాలని విజ్ఞప్తి

హైద్రాబాద్, జనవరి 27

జనవరి 31 వ తేదీలోగా రాష్ట్ర ప్రభుత్వం తగు సమాధానం యివ్వని పక్షంలో అధిక శిస్తు చట్టం రద్దుకు, బంజర్ల సత్వర పంపకానికి ఫిబ్రవరి 3 వతేదీ నుండి ప్రభుత్వ రెవెన్యూ అఫీసుల వద్ద సత్యాగ్రహం ప్రారంభించబడుతుందని అఖిల పక్ష కార్యాచరణ సమితి కన్వీనరు శ్రీ వై. వి. కృష్ణరావుగారు నేడు ప్రకటించారు.

వివిధ జిల్లాల్లోని కార్యాచరణ సమితులు ఏ యే కేంద్రాలలో సత్యాగ్రహం ప్రారంభించాలో నిర్ణయించి, ఆయా తాలూకా, జిల్లా అధికారులకు వెంటనే సత్యాగ్రహం నోటీసులు అందజేయాలని ఆయన తెలియజేశారు.

శ్రీ వై. వి. కృష్ణారావుగారి ప్రకటన ఈ విధంగా వుంది :

“జనవరి 31 తేదీలోపల, రాష్ట్ర కార్యాచరణ సమితి ముఖ్యమంత్రికి పంపిన లేఖలో తెలియజేసినట్లు, అదనపుశిస్తు చట్టం రద్దుకు బంజర్ల సత్వరపంపకానికి ప్రభుత్వం ప్రకటన చేయనియెడల ఫిబ్రవరి 3 వ తేదీనుండి ప్రభుత్వ రెవెన్యూ ఆఫీసుల ముందు శాంతియుత సత్యాగ్రహ ప్రారంభం జరుగుతుంది.

అందువల్ల వివిధ జిల్లాలలోని కార్యాచరణ సమితులు వెంటనే సమావేశమై ఫిబ్రవరి 3 వ తేదీన ఏయే కేంద్రాలలో సత్యాగ్రహం ప్రారంభించాలో నిర్ణయించాలనీ, ఆ నిర్ణయం మేరకు ఆయా తాలూకా లేక జిల్లా అధికారులకు నోటీసులు పంపవలెనని [illegible]

రామన్నపేట తా॥లో ముమ్మరంగా సత్యాగ్రహ ప్రచారం

రామన్నపేట, జనవరి 25

నల్లగొండ జిల్లా రామన్నపేట తాలూకాలో మోత్కూరు, రామన్నపేట బ్లాకుల్లో సత్యాగ్రహ ప్రచార దళాలయాత్ర జనవరి 7 వ తేదీన ప్రారంభ మయింది.

ఈ రెండు బ్లాకులలోను మూడు దళాలుగా విస్తృతంగా సత్యాగ్రహ ప్రచారం సాగుతున్నది. జనవరి 7 న కూరెళ్ళ దళము, 9 న రామన్నపేట దళం, 15 న మోత్కూరు దళం ప్రచారానికి బయలుదేరినవి. ప్రతిదళంలో 16 మంది చొప్పున సైకిళ్ళతో ప్రచారం సాగించారు. మోత్కూరు దళం 21 న మధ్యాహ్నంవరకు యాత్ర సాగించింది. 66 పంచాయతీ బోర్డుల గ్రామాల్లో పల్లెలు, పంచాయితీ బోర్డులతో కలిసిన మొత్తం 100 గ్రామాలలో ఊరేగింపులు, సభలు జరిపారు. 18 ముఖ్య గ్రామాలలో రాత్రి సభలు జరిగినవి. ఈ రాత్రి సభలలో 25 వేలమంది ప్రజలు పాల్గొన్నారు. ఊరేగింపులలో పగలు జరిగిన సభలలో 40 వేలమంది ప్రజలు పాల్గొన్నారు. ఈవిధంగా 65 వేల మందిప్రజల్లో ప్రచారం జరిగింది.

ఈ సందర్భంలో దళాలకు ప్రజలు విరాళాలుగా రు 400 వాగ్దానం వచ్చింది. రు 350 వసూళ్ళు వచ్చాయి.

ఈ దళాలవెంటవుంటూ శ్రీ యుతులు కె. రామచంద్రారెడ్డి ఎం. ఎల్. ఏ., డి. సత్తిరెడ్డి, సంజీవరెడ్డి, రాజవరము నర్సయ్య, యాదగిరి, మద్దాల హనుమంతు, విశ్వనాథం, ఈశయ్య, కొప్పుల నర్సిరెడ్డి, మెరె వీరయ్య, వెంకట నర్సింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉపన్యాసాలు చేశారు.

ఫిబ్రవరి 2 వ తేదీన రేపల్లె తాలూకాలో సైకిల్ దళ ప్రచారం

రేపల్లె, జనవరి 25

ఫిబ్రవరి 2 వ తేదీ ఉదయం 8 గంటలకు రేపల్లె, పేటేరు, ఓలేరు, పెసర్లంక, పెదలంక చింతమోటు, కడికలపూడి కిష్కింధపాలెం, తిప్పలకట్ట, జువ్వలపాలెం, ఆముదాలలంకలలో సత్యాగ్రహ ప్రచారదళం సైకిళ్ళపై యాత్ర జరుపుతుంది.

ఆ మధ్యాహ్నం 2 గంటలకు. అనంతవరం, పెనుమూడి, ఉద్దపరం, వల్లూరు, మైనేనివారిపాలెం, మోర్తోట, బొబ్బర్లంక, విశ్వేశ్వరం, లింగుపాలెం, నల్లూరుపాలెం, ఉప్పూడి, గుడికాయలలంక, ఇసుకపల్లి చూచిన తర్వాత భేతపూడిలో రాత్రికి బహిరంగసభ జరుగుతుంది.

అందులో ఉపన్యాసకులు. శ్రీ కొంటాల సత్యనారాయణ, ఎం. ఎల్. ఏ., శ్రీ యావూరు సుబ్బారావు ఎం. ఎల్. ఏ., శ్రీ మండే విద్యయ్య ఎం. ఎల్. ఏ. గార్లు.

నాగారం బ్లాకులో ఊరేగింపులు, బహిరంగ సభలు

నల్లగొండజిల్లా నాగారం బ్లాకు, గానుగబండ గ్రామంలో జనవరి 20 న 50 మందితో ఊరేగింపు జరిగింది. రాత్రి 8 గంటలకు బహిరంగ సభ కూడా జరిగింది. సభలో జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ భీమిరెడ్డి నర్సింహారెడ్డి, బ్లాకు కమ్యూనిస్టు కమిటీ సభ్యులు శ్రీ డి. భగవాన్ రెడ్డిగార్లు ఉపన్యసించారు. స్థానిక బుర్రకథ దళంచే “రుద్రమదేవి” బుర్రకథ చెప్పబడింది.

యల్కపల్లిలో జనవరి 21 వ తేదీ రాత్రి 7 గంటలకు 200మందితో ఊరేగింపు జరిగింది. అనంతరం జరిగిన బహిరంగసభకు స్థానిక కమ్యూనిస్టు నాయకులు శ్రీకట్ట రాజారెడ్డి అధ్యక్షత వహించారు. జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ భీమిరెడ్డి నరసింహారెడ్డి బ్లాకు కమ్యూనిస్టు కమిటీ సభ్యుడు శ్రీ డి. భగవాన్‌రెడ్డి ఉపన్యసించారు. ఉపన్యాసాల అనంతరం కందగుట్ల దళం చేత బుర్రకథ చెప్పబడింది.

ప్రొద్దుటూరు తాలూకానుండి 52 మంది సత్యాగ్రహులు

ప్రొద్దుటూరు, జనవరి 26

కడపజిల్లా ప్రొద్దుటూరు తాలూకా, పట్టణ కమ్యూనిస్టు జనరల్‌బాడీల సంయుక్త సమావేశంలో పార్లమెంటు సభ్యులు శ్రీ ఈశ్వర రెడ్డి, ప్రదేశ్ వ్యాప్తంగా సాగుతున్న సత్యాగ్రహ సన్నాహాలనుగూర్చి, జిల్లా కార్యవర్గ నిర్ణయాలనుగూర్చి నివేదించారు. పట్టణ, తాలూకా కార్యకర్తలు ఇచ్చిన నివేదిక ప్రకారం 52 మంది సత్యాగ్రహులు నమోదు అయినట్లు తెలియజేయబడింది. పట్టణమునకు కూడిన సత్యాగ్రహ నిర్వహణకమిటీకూడ ఎన్నుకోబడింది. 27 నుండి 30 వ తేదీ వరకు తాలూకా అంతటా సైకిళ్ళమీద ప్రచారం సాగించడానికి నిర్ణయాలు తీసుకున్నారు.

మరుసటి పుదయం పట్టణంలోని ఒక చేనేత ముఖ్యుడు రైతు, కూలీ ప్రజల పోరాటం యెడల సౌహార్ద్ర సూచకంగా రు 100/-లు సత్యాగ్రహనిధికి సమర్పించారు. (వి.వి.)

భువనగిరి తాలూకా నుండి 500 మంది సత్యాగ్రహులు

మొదటి జట్టుకు శాసనసభా ప్రతిపక్ష ఉపనాయకురాలు శ్రీమతి ఆరుట్ల కమలాదేవి నాయకత్వంవహించాలని నిర్ణయం

భువనగిరి, జనవరి 26

అదనపు శిస్తు చట్టానికి వ్యతిరేకంగానూ, బంజర్ల సక్రమ పంపకానికి ఫిబ్రవరి 3 నుండి ప్రారంభం కానున్న సత్యాగ్రహంలో భువనగిరి తాలూకానుండి 500 మంది సత్యాగ్రహులను పంపాలని ఇక్కడ 24 వ తేదీన జరిగిన భువనగిరి తాలూకాలోని వివిధ బ్లాకు కమ్యూనిస్టు కమిటీల సంయుక్త సమావేశం తీర్మానించింది. మొదటిదళానికి శాసనసభ ప్రతిపక్ష ఉపనాయకురాలు శ్రీమతి ఆరుట్ల కమలాదేవిగారు నాయకత్వం వహించాలనికూడా సమావేశం తీర్మానించింది.

నల్లగొండజిల్లా, భువనగిరి తాలూకాలోని ఆలేరు, భువనగిరి, తుర్కపల్లి, భువనగిరి పట్టణ బ్లాకుకమిటీల సంయుక్త సమావేశం 24-1-64 తేదీ తాలూకాపార్టీ కార్యాలయంలో జరిగింది. సమావేశానికి ఆలేరుబ్లాకు నాయకులైన శ్రీ బండా నర్సింహ్మ అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానంపై 10 మంది పార్టీ ముఖ్యులు పాల్గొన్నారు. సమావేశంలో మొత్తం 50 మంది పాల్గొన్నారు. తాలూకాలో చేసిన సత్యాగ్రహ సన్నాహంగురించి శ్రీ ఆరుట్ల రామచంద్రారెడ్డి గారు నివేదిక ఇచ్చినారు. శ్రీయుతులు వరెం చిన్నారెడ్డి, ఆలేరు బ్లాకు కార్యదర్శి, బి. శివారెడ్డి, శ్రీమతి కమలాదేవి, కాయితిరెడ్డి వీరారెడ్డి, దాద నారాయణ, సిద్దారెడ్డి, ముత్యం ప్రకాశరావు భువనగిరి బ్లాక్ కార్యదర్శి, గుండా కేశవులు, శ్రీమతి కె. సుశీల, బండా నర్సింహ్మ మొదలగువారు సత్యాగ్రహ పోరాటాన్ని జయప్రదము గావించుటకు తీవ్రకృషి చేయాలని చెప్పారు. సమావేశానంతరం శ్రీ రావినారాయణరెడ్డిగారు రైతాంగం పైబడిన అదనపు శిస్తు భారాన్ని రద్దుగావించుటకు ప్రతిపార్టీ సభ్యుడు తన కర్తవ్యాన్ని నెరవేర్చవలెనని నొక్కి చెప్పారు.

తాలూకా సంయుక్త సమావేశంలో అఖిలపక్షకమిటీ ఇచ్చిన పిలుపు ప్రకారం ఫిబ్రవరి 3 న తాలూకా కేంద్రములో, శ్రీమతి ఆరుట్ల కమలాదేవి నాయకత్వాన మహిళా సత్యాగ్రహ దళంసత్యాగ్రహం జరపడానికి నిర్ణయించినది.

సత్యాగ్రహ సమరాన్ని నడపుటకు 7గురితో కూడిన కార్యాచరణ కమిటి ఎన్నుకోబడింది. కార్యాచరణకమిటికి శ్రీఆరుట్లరామచంద్రారెడ్డి, శ్రీ ముత్యం ప్రకాశరావు, పెండ్యాల వాసుదేవు, బి. శివారెడ్డి, చిత్త రామచంద్రా రెడ్డి, పి. రాజయ్య, కిషన్ సభ్యులుగా ఎన్నుకోబడినారు. శ్రీ ముత్యం ప్రకాశ్ కార్యాచరణ కమిటికి కార్యదర్శిగా యెన్నుకోబడినారు.

భువనగిరి కాతాలూకా నుండి మొత్తం 5 వందల మంది సత్యాగ్రహములో పాల్గొనేటట్లు చేయుటకు నిర్ణయాలు తీసికోబడినవి. ఇంతవరకు రేణుకుంట, బేగంపేట, మాశాపురం, పాముకుంట, కొలనుపాక, ఆలేరు, ఇక్కుర్తి, బహద్దూరుపేట, కాదారం మొదలగు గ్రామాల నుండి మొత్తం 120 మంది సత్యాగ్రహం చేయుచున్నట్లు ప్రమాణ పత్రాలు తాలూకా కార్యాలయానికి చేరినవి. 26 వ తేదీ నుండి 31 వరకు తాలూకాలోని తదితర గ్రామాలకు వెళ్ళి ప్రమాణ పత్రాలపై సంతకాలు తీసికొనుటకు నిర్ణయాలు తీసికోబడినవి.

మున్సిపల్ ఉద్యోగుల డి. ఎ. హెచ్చింపు సిఫారసు

బొంబాయి, జనవరి 25

బొంబాయి కార్పొరేషన్‌లో రు. 500ల వరకు జీతం చేసుకొంటున్న ఉద్యోగులకు నెలకు తలా అయిదు రూపాయల చొప్పున కరువుభత్యం పెంచాలని బొంబాయి కమిషనర్ కార్పొరేషన్ స్థాయీ సంఘానికి సూచించారు.

కార్పొరేషన్ బడ్జెట్ సమావేశసందర్భంలో కమీషనర్ ఈ విషయం చెప్పారు.

ఉద్యోగులకు జనవరి నుండి కరువు భత్యం హెచ్చించేందుకు వీలుగా స్థాయీ సంఘం సత్వరమే ఆమోదించగలరని ఆశిస్తున్నా”నని ఆయన అన్నారు.

చైనాను ఫ్రాన్సు గుర్తిస్తుందని అమెరికా ఆదుర్దా

వాషింగ్టన్, జనవరి 25

చైనా ప్రజారిపబ్లిక్కును రాయబారరీత్యా గుర్తించడానికై ఫ్రాన్సు తీసుకొన్న నిర్ణయం గురించి “ప్రపంచమంతటా ఎంతో సంచలనం” వుందనుకొంటున్నామని అమెరికా అధ్యక్షుడు జాన్సన్ నేడు ఇక్కడ అన్నారు.

పెకింగ్ ప్రభుత్వాన్ని గుర్తించడానికి చేసిన నిర్ణయం గురించి తన వుద్దేశమేమిటో డిగోల్ ప్రభుత్వానికి అమెరికా స్పష్టంగానే చెప్పిందని జాన్సన్ విలేకరుల గోష్టిలో అన్నారు.

నిరాయుధీకరణ సమస్యపై అమెరికా క్రొత్తగాచేసిన ప్రతిపాదనలు శాంతిపథంలో వేసిన ఒకముందడుగేనంటూ ఇతర దేశాలు “మావెంట రాగోరుతున్నాము.” అని జాన్సన్ (అమెరికా అధ్యక్షుడు) అన్నారు.

సత్యాగ్రహ పోరాటం విచ్ఛిన్నకరచర్యలటు

రిపబ్లిక్ దినోత్సవ విన్యాసాల సందర్భంలో శ్రీ సంజీవరెడ్డి ఆరోపణ

హైద్రాబాద్, జనవరి 26

విచ్ఛిన్నానికి దారితీసే ఏ చర్యనైనా ప్రభుత్వంతీవ్రంగా పరిగణిస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి నేడిక్కడ జరిగిన రిపబ్లిక్ దినోత్సవ విన్యాసాల సందర్భంగా హెచ్చరించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎట్టి విభేదాలనైనా ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధుల ద్వారా ప్రజాస్వామిక పద్ధతిలో పరిష్కరించు కోవలసి వున్నదని, చట్టధిక్కారం సమస్యల పరిష్కారానికి మార్గం కాజాలదని ఆయన అన్నారు. ఉద్రేకాలకు లోను కావలదని ముఖ్య మంత్రి రాష్ట్ర ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు.

ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చైనాదురాక్రమణ విషయం ప్రస్తావిస్తూ, ప్రమాదం ఇంకా తొలగిపోలేదనిఅందువల్లమనం అప్రమత్తులమై ఉండాలనిఉద్బోధించారు. నేడుమనకుప్రధానంగా కావలసింది ఐక్యత అని, ప్రజలు చిన్న చిన్న విభేదాలనుమరచి, దేశంలో ఐక్యతను పటిష్టం చేయడానికి కృషిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రధాని నెహ్రూ త్వరితంగా కోలుకొంటున్నందుకు శ్రీ సంజీవరెడ్డి తన సంతోషం వెలిబుచ్చారు. శ్రీ నెహ్రూ శీఘ్రంగానూ, సంపూర్తిగానూ కోలుకొని దీర్ఘకాలంపాటు దేశాన్ని నడిపించాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు.

నేడిక్కడ జరిగిన రిపబ్లిక్ దినోత్సవాలలో తెల్ల సైనిక విన్యాసం నేత్రోత్సవంగా వుంది. సైనికశాఖలకు చెందిన పదాతి, వైమానికదళాలు, యన్. సి. సి., అగ్నిమాపకదళాలు ఈ విన్యాసంలో పాల్గొన్నాయి, అసంఖ్యాకమైన ప్రజలు స్త్రీలు, పురుషులు, పిల్లలు అంతా చక్కటి దుస్తులతో అలంకరించుకొని - నేత్రపర్వమైన ఈ విన్యాసాలను తిలకించారు.

అంతకుముందు ముఖ్యమంత్రి సైనిక వందనం స్వీకరించి విన్యాసాలను తిలకించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గణనీయమైన సేవచేసినందుకు ఎనిమిదిమంది పోలీస్, అగ్నిమాపకదళ శాఖాధికారులకు రాష్ట్రపతి బహూకరించిన గౌరవ బిరుదులను అలంకరించారు.

కాశ్మీర్ సమస్యపై భద్రతా సంఘ సమావేశం

పాకిస్తాన్ ప్రతినిధివర్గానికి శ్రీ భుట్టో నాయకత్వం

కరాచి, జనవరి 27

భద్రతా సంఘంలో కాశ్మీర్ సమస్యపై చర్చ జరిగే సందర్భంలో పాకిస్తాన్ ప్రతినిధివర్గానికి నాయకత్వం వహించడానికి విదేశాంగ మంత్రి శ్రీ భుట్టో లండన్‌మీదుగా న్యూయార్కుకు నేడు విమానంలో బయలుదేరి వెళ్లారు.

పాకిస్తాన్ కోరికపై భద్రతాసంఘ సమావేశం గురువారంనాడు ప్రారంభం కావచ్చునని పాకిస్తాన్ రేడియో గత రాత్రి ప్రసారం చేసింది.

సత్యాగ్రహానికై చేనేత సంఘం ఆలోచన

చీరాల మహాసభలో పుత్సల సత్యనారాయణ వెల్లడి

చీరాల, జనవరి 26

నూలుధరలు విపరీతంగా పెరిగిపోయి బ్లాక్ మార్కెట్ మరీ జాస్తి అయినందున చేనేత సంఘంకూడా సత్యాగ్రహాన్ని తల పెట్టనున్నదని ప్రదేశ్ చేనేత సంఘ ఉపాధ్యక్షులు శ్రీ పుత్సల సత్యనారాయణగారు చీరాల బహిరంగ సభలో సూచనప్రాయంగా తెలియజేశారు.

చీరాల ప్రాంత కమ్యూనిస్టుపార్టీ సభ్యుల, సానుభూతిపరుల జనరల్‌బాడీ సమావేశం జనవరి 23 న చీరాల మున్సిపల్ ఓపెన్‌ఎయిర్ థియేటర్‌లో జరిగింది.

సమావేశమునకు శ్రీ అబోతుల నారాయణ అధ్యక్షతవహించారు. జిల్లా కమ్యూనిస్టుసమితి కార్యవర్గసభ్యులు, శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ, శ్రీ పుత్సల సత్యనారాయణగార్లు జాతీయ సమితి, రాష్ట్రసమితి తీర్మానాలను, నిర్ణయాలను వివరించారు.

సమావేశముకు దాదాపు 200 మంది పార్టీ సభ్యులు, సానుభూతిపరులు హాజరైనారు. శ్రీ పుత్సల సత్యనారాయణగారు అంతర్జాతీయ సిద్ధాంత విషయాలపై జాతీయసమితి వైఖరిని వివరించారు. జిల్లాసమితి సభ్యులు జి. వి. కృష్ణరావు అభివందనములతో ఈసమావేశము ముగిసింది.

చీరాల గడియారపు స్తంభంవద్ద ఏర్పాటు చేసిన ఈ బహిరంగసభకు శ్రీ కొండ్రు కొండయ్యగారు అధ్యక్షత వహించారు, జిల్లా పార్టీ నాయకులు శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ, రాష్ట్రచేనేతసంఘనాయకులు శ్రీ పుత్సలసత్యనారాయణ, స్థానిక శాసన సభ్యులు శ్రీ జాగర్లమూడి లక్ష్మీనారాయణ, శ్రీ తేళ్ళ భూషణం (మునిసిపల్ కౌన్సిలర్)గార్లు మాట్లాడారు.

సత్యాగ్రహ ఉద్యమాన్ని జయప్రదం చేయాలని శ్రీ శ్రీకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ బాధ్యత ప్రతి ఆంధ్రునిపై వున్నదని ప్రభుత్వం అనుసరించుచున్న ప్రజావ్యతిరేక విధానాలనుండి దానిని వెనుకకు మళ్ళించమని కోరారు.

శ్రీపుత్సలసత్యనారాయణగారు మాట్లాడుతూ చేనేత పరిశ్రమ నేడు ఎంత సంక్షోభంలో యున్నదో వివరించారు. నూలువ్యాపారంలో విపరీతమైన బ్లాక్‌మార్కెట్టు జరుగుతున్నా ప్రభుత్వం పట్టనట్లు వూరుకొన్నదన్నారు. బ్లాక్‌మార్కెట్టుదారులైన నూలుమిల్లుల యజమానులకు సహాయపడటంతప్ప ఈ ప్రభుత్వం చేనేత పారిశ్రామికులకు సహాయకారిగా లేదన్నారు. కావున ఆంధ్రరాష్ట్ర చేనేతసంఘం త్వరలో సత్యాగ్రహం తలపెట్టనున్నదన్నారు. గుంటూరుజిల్లాలో, చీరాల ప్రాంతములో యున్న చేనేత పారిశ్రామికులు సత్యాగ్రహానికి సిద్ధంగాయుండాలని విజ్ఞప్తి చేశారు. చేనేత పారిశ్రామికుల ఇబ్బందులను, తొలగించుకొనుటకు రాజకీయ భేదాభిప్రాయాలు అడ్డురాకూడదనీ, రాజకీయ భేదాభిప్రాయాలవల్ల చేనేత ఉద్యమమును ముందుకుసాగకుండ అడ్డుకొట్టటానికి కొంతమంది, పదవీ వ్యామోహపరులు ఆటంక పరుస్తారనీ, అటువంటి వారిపై ఒత్తిడి తెచ్చి చేనేత ఉద్యమాన్ని ముందుకు తీసుకొనివెళ్ళుటకై సత్యాగ్రహ పోరాటాన్నిజయప్రదం చేసి ఘన ఇబ్బందులను అధిగమించాలని వివరించారు.

శ్రీ జాగర్లమూడి లక్ష్మీనారాయణగారు శాసనసభలో కమ్యూనిస్టు ప్రజాతంత్ర ప్రతిపక్షం చేసిన కృషిని వివరించారు. అధిక పన్నులు వేసి ప్రజలను పీడించి వసూలుచేసిన డబ్బునుదుబారా చేస్తున్నదని ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రజల గోడు వినిపించుకొనేది కాదని సత్యాగ్రహం తప్ప గత్యంతరం లేదనీ, ప్రజలంతా సత్యాగ్రహానికి ఆయత్తం కావాలని విజ్ఞప్తి చేశారు.

కమ్యూనిస్టుపార్టీ నాయకులు వేదికపైకి రాగానే చీరాల ప్రాంతంలో యున్న అన్ని కమ్యూనిస్టు శాఖల తరపున పూలమాలలు వేసి సత్కరించినారు. (వి. వి.)

టాంగనీకాలో కార్మిక నాయకుల అరెస్టులు

నైరోబి, జనవరి 27

టాంగనీకా ప్రభుత్వం దేశంలో కార్మిక సంఘాల నాయకులను పట్టివేయ నారంభించింది. టాంగనీకా కార్మిక సమాఖ్య ‘అధ్యక్ష ఉపాధ్యక్షులూ, ఓడరేవు, తంతి, తపాలా, రైల్వే పనివారల నాయకులనూ ఉపాధ్యాయ సంఘనాయకులనూ గూడా ప్రభుత్వం నిన్ననే నిర్బంధించింది.

తూర్పు ఆఫ్రికాలోనికి బ్రిటిష్ సైనిక దళాల ప్రవేశం, యీ అరెస్టులూ ఒకేసారి జరిగాయి.

దారుస్సలాంలో తమ అధికారులపై తిరుగుబాటుచేసిన రైఫిల్‌దళానికి చెందిన సైనికులపై బ్రిటిష్ సైనికాధికారులు చర్యలు తీసుకొంటున్నారు.

25 వ తేదీ నాడు కొలిటో అనే స్థావరం నుండి వెళ్ళిపోయిన టాంగనీకా రైఫిల్ దళానికి చెందిన మొదటి పటాలాన్ని బ్రిటిష్ సైనికులు నిన్న నిర్బంధంలోకి తీసుకొన్నారు.

కెన్యాట్టా హెచ్చరిక

ప్రభుత్వం పట్ల అవిధేయతను, ఆస్తుల విధ్వంసనము తన ప్రభుత్వం చాలా తీవ్ర విషయాలుగా పరిగణిస్తుందనీ, తిరుగుబాటును అణిచివేస్తుందనీ, కీన్యా ప్రధాని జోమో కెన్యాటా ప్రకటించారు.

ఉగాండా ప్రభుత్వం పత్రికల వార్తలపై ఆంక్షలు ప్రయోగించింది.

గత వారం స్థానిక సైనికదళాలు తిరుగుబాటుచేసి హోం మంత్రి ఉపమంత్రిని నిర్బంధించిన సంఘటనను పురస్కరించుకొని బ్రిటిష్ సైనికదళాలు ఉగాండాలోనికి వచ్చి చేరాయి.

వీరు ఉగాండా రైఫిల్‌దళానికి చెందిన ఒక పటాలాన్ని నిరాయుధంచేశారు.

అపూర్వోత్సాహంతో 29 వ ప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ మహాసభ ప్రారంభం

ఆంధ్రదేశం నలుమూలలనుండి వచ్చిన ప్రతినిధులతో గుంటూరులో శ్రీ మోహిత్‌సేన్ అధ్యక్షతన

గుంటూరు, జనవరి 28

అపూర్వోత్సాహ, కోలాహలాల మధ్య వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 200 మంది ప్రతినిధులతోను, 300 మంది విద్యార్థి. విద్యార్థి శ్రేయోభిలాషులతోను, ఆంధ్రప్రదేశ్ 29వ విద్యార్థి ఫెడరేషన్ మహాసభలు ప్రఖ్యాత పాత్రికేయులు. శ్రీ మోహిత్ సేన్ అధ్యక్షతన నేడు గుంటూరులో ప్రారంభమయ్యాయి.

మహాసభ జరిగే వీధిని పెద్ద పెద్ద ఆర్చీలతోనూ, తోరణాలతోనూ, నినాదాలుగల అట్టలతోను అతిసుందరంగా తీర్చి దిద్దారు. ప్రముఖ విద్యావేత్త, విద్యార్థుల ఆప్తుడు శ్రీ వల్లభజోస్యుల సుబ్బారావుగారి పేరుతో మహాసభ ప్రధాన ద్వారాన్ని ఏర్పాటుచేశారు. అదేవిధంగా మహాకవి గురజాడ, మహాపండిత రాహుల్ సాంకృత్యాయన్, ప్రముఖ కళాకారుడు గరికపాటి రాజారావు, ప్రఖ్యాత ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య, విద్యార్థి స్మృత వీరులకు జోహార్లర్పిస్తూ వారి పేరులతో గల బానర్లను వీధి పొడుగునా అలంకరించారు.

అలానే విద్యార్థి సమస్యలను, డిటెన్షన్ విధానాన్ని రద్దుచేయటం, గుంటూరులో రాత్రి కళాశాలలు, పోస్టు గ్రాడ్యుయేట్ తరగతులను ప్రారంభించాలని, ఐక్య విద్యార్థి ఉద్యమం వర్ధిల్లాలని, విశ్వశాంతి, జాతీయ సోషలిజంను కాంక్షిస్తూ నినాదాలు గల అట్టలను ఆయా ప్రాంతాలలో అమర్చారు.

సాయంత్రం 4 గంటలకు అరండల్ పేటలోని రాయపాటి సీరయ్య పొగాకు కంపెనీలో మహాసభ ప్రారంభమయింది.

అంతకు ముందు మాజీ విద్యార్థి నాయకుడు శ్రీ వి.యస్.దస్ విద్యార్థి సంఘ పతాకాన్ని జై జై నినాదాల మధ్య ప్రతిష్ఠించారు.

మహాసభ జరిగే హాలులో విద్యార్థి అమర వీరుల ఛాయా చిత్రాలను, విద్యార్థి కోర్కెలను ప్రతిబింబించే అట్టలతోను అలంకరించారు.

ఆహ్వాన సంఘ అధ్యక్షుడు, శ్రీ జె. జోషి సదస్యులకు స్వాగతం పలికారు. (వారి ప్రసంగాలను ప్రత్యేకంగా ఇస్తున్నాం)

మహాసభకు ప్రఖ్యాత పాత్రికేయులు, జాతీయోద్యమ చరిత్ర పరిశోధకులు శ్రీ మోహిత్ సేన్ అధ్యక్షత వహించారు.

అనంతపూర్ ప్రతినిధి దేశభక్తి గేయ ఆలాపనతో మహాసభ అధ్యక్షుడు సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు.

విద్యార్థి మహాసభ విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కామరాజ్, కేంద్ర మంత్రి శ్రీ కె. ఎల్. రావు, శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, శ్రీ తెన్నేటి విశ్వనాథం, శ్రీ వై. వి. కృష్ణరావు, శ్రీమతి అరుణా ఆసఫాలి, శ్రీ రమేష్‌చంద్ర, ప్రపంచ విద్యార్థి ఫెడరేషన్, ప్రపంచ యువజన ముఖ్యుల నుండి వచ్చిన సందేశాలను విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ కొర్లి నాగేశ్వరరావు చదివి వినిపించారు.

ఆ తరువాత అధ్యక్షోపన్యాసం ప్రారంభమయింది. మహాసభ అధ్యక్షుని ప్రసంగం పూర్తయిన తరువాత అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ హిరేన్‌దాస్ గుప్త ప్రారంభోత్సవం చేశారు. ఆ తరువాత విశాలాంధ్ర సంపాదకవర్గ సభ్యులు శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు ప్రతినిధుల నుద్దేశిస్తూ ప్రధాన ప్రసంగం చేశారు.

మహాసభ దిగ్విజయంగా జరగాలని. విద్యార్థి లోకానికి మాత్రమే ఉత్తేజాన్నివ్వటం కాక, సమాజాని కంతటికీ జ్యోతిలాంటి వారయిన విద్యార్థులు యావత్ ప్రజా సమస్యలను కూడ ఆకళింపుచేసుకొని, వారికి చేదోడు వాదోడుగా ఉండాలని కాంక్షిస్తూ ప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు తరపున ఉపాధ్యక్షుడు శ్రీ మల్లయ్యలింగం, శాసనసభ్యులు శ్రీ పంగులూరి కోటేశ్వరరావు, ప్రదేశ్ యువజన సమాఖ్య తరపున ప్రధాన కార్యదర్శి శ్రీ జి. వి. నారాయణరావు తమ తమ సందేశాలను వినిపించటంతో నేటి మహాసభ కార్యక్రమం ముగిసింది.

(అధ్యక్షోపన్యాసం, ప్రారంభకుల ఉపన్యాసం 6 వ పేజీలో ఇచ్చాం.)

దక్షిణ రొడీషియాలోని శాలిస్‌బరీలో ఆఫ్రికా పట్నాలలో యిటీవల జరిగిన అల్లర్ల సందర్భంగా నేడు 28గురు ఆఫ్రికన్లను అరెస్టు చేశారు. వీరితో కలుపుకొని యింతవరకూ 45 మందిని డిటెయిన్ చేశారు.

కృతజ్ఞతలు

1964 రిపబ్లిక్ దినోత్సవమునాడు హైదరాబాద్ బసంత్ - టాకీస్‌లో ఏర్పాటు చేయబడిన బాబూమూవీస్ వారి “మూగ మనసులు” ప్రివ్యూకు విచ్చేసిన ఆహ్వానితులందరికీ మా కృతజ్ఞతలు. మా ఆహ్వానాన్ని పురస్కరించుకొని విచ్చేసిన గౌరవ శ్రీ సంజీవరెడ్డిగారికి; మంత్రులకు, నటీనటులకు, సాంకేతిక నిపుణులకు మా కృతజ్ఞతాపూర్వ వందనములు.

భవదీయులు,
బాబూమూవీస్,
శ్రీఫిలిమ్స్.

విశాలాంధ్ర

సాచివేత ప్రమాదకరం

కాశ్మీర్‌లో తిరిగి అసమ్మతి ప్రదర్శనలు జరిగాయనీ, దుండగులు పోలీసు స్టేషన్లపై దాడి చేసినందున కాల్పులు జరిగాయనీ, నలుగురు మరణించారనీ వార్తలు వచ్చాయి రిపబ్లిక్ అవతరణోత్సవాలు జరుపుకుంటున్న రోజునే ఈ ఘటనల వార్తలు రావడం విచారకరం.

కేంద్ర ప్రభుత్వ హోమ్ శాఖ కార్యదర్శి కథనం ప్రకారం కొలది మంది పాకిస్తాన్ అనుకూల దుండగులు పైనుదహరించిన అల్లరులను రెచ్చగొట్టారనితెలుస్తూంది. పునరుద్ధరించబడిన హజ్రత్‌బాల్ (ప్రవక్త శిరోజం) వాస్తవ మైనది కాదని, పాకిస్తాన్ ఏజెంటుగా పనిచేస్తున్న ద్రోహులు తెరవెనుక నుంచి సాగించిన అబద్ధప్రచారమే అసమ్మతి ప్రదర్శనలకు కారణమని తెలుస్తూంది. కాశ్మీర్‌లో మంత్రివర్గం శాంతి భద్రతలను కాపాడ లేక పోతూందని నిరూపించి, సదరీ రియాసత్ పరిపాలన ఏర్పరచే విధంగా భారతప్రభుత్వంపై ఒత్తిడి తేవాలనీ, భద్రతాకౌన్సిల్లో కాశ్మీరుపై చర్చ సమయానికి ఎన్నికయిన ప్రభుత్వానికి ఎలాంటి ప్రజాపలుకుబడిలేదని నిరూపించాలనేదే పాకిస్తాను ఎత్తుగడనికూడా హోంశాఖ కార్యదర్శి తెలిపారు.

పై కారణాలు వాస్తవమైనవే కావచ్చు. అలాగే పాకిస్తాన్ ఏజెంట్లుగా వ్యవహరించే దుండగులను శిక్షించడం కూడ తక్షణావసరమనడంలో సందేహంలేదు

కాని అంతటితో సంతృప్తి చెందడానికి వీల్లేదు ఏమంటే కొలది సంవత్సరాలుగా కాశ్మీర్ పరిపాలనలో అవినీతి, లంచగొండితనం, బంధుప్రీతి పాదుకొని పోయాయని నిరంతరం అభిజ్ఞులద్వారా తెలుస్తూంది అందుచేత పరిపాలన యెడల ప్రజానీకంలో ఏర్పడిన అసంతృప్తిని తొలగించాలంటే పరిపాలనా యంత్రాంగాన్ని పరిశుద్ధం చేసేందుకు తక్షణ చర్యలు తీసికోవడం కూడా అవసరం.

ఈ సందర్భంలో కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి గులాం మహమ్మద్ ద్వంద ప్రవర్తనను జాగ్రత్తగా పరిశీలించక తప్పదు. కామరాజు పథకం క్రింద బక్షీ యిచ్చిన రాజీనామాను ప్రధాని నెహ్రూ అంగీకరించినందున పదవి విడనాడక ఆయనకు గత్యంతరం లేకపోయింది బక్షీహయాంలో స్వార్థప్రయోజనాలను నెరవేర్చుకున్న వర్గాలు ఆయన పైదొలగడాన్ని వ్యతిరేకించాయి. అంతే కాదు కొత్త శాసనసభాపక్షనాయకుని ఎన్నిక సందర్భంలో బక్షితోసహా ఈ వర్గాలు తమకు అనుకూలుణ్ణి ముఖ్యమంత్రిగా తెచ్చేందుకు తాపత్రయపడ్డాయి. నిజాయితీపరుడు, ప్రజాపలుకుబడి కలిగిన ప్రముఖ నాయకుడయిన జి. ఎం. సాదిక్‌ను వ్యతిరేకించాయి. అగ్రనాయకుల అభీష్టాన్ని తృణీకరించి, నానారభస చేసి. కేవలం తమ ముఠావాడయిన షంసుద్దీన్‌ను ముఖ్యమంత్రిగా గద్దె ఎక్కించారు ఈ సంగతులన్నీ కాశ్మీరు ప్రజానీకాన్ని కలతపరచాయి పరిపాలనలోని అవినీతి యెడల ప్రజల అసంతృప్తి బ్రద్దలయింది.

క్రిందటిసారి హజ్రత్ బాల్ అదృశ్యమైనపుడు బయలుదేరిన అసమ్మతి ప్రదర్శనలో ప్రజానీకం బక్షీముఠాకుచెందిన సినిమాహాలును, ఆస్తిపాస్తులను దగ్ధం చేశారంటే స్వార్థపరులపైవారికున్న అసంతృప్తి ముఖ్యకారణమని ఎంచవలసి ఉంటుంది. పాకిస్తాన్ ఏజెంట్లు బన దుండగులు రెచ్చగొట్టినప్పటికీ ఎక్కువ మంది ప్రజలు ఈ సారి ఊరేగింపులలో పాల్గొన్నారంటే హేతువేమిటో జాగ్రత్తగా ఆలోచించాలి. ప్రజా అసంతృప్తికి మూల కారణమయినఅవినీతిని తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి.

ప్రప్రథమంగా కాశ్మీర్ శాసనసభా పక్షంలోని ముఠా పద్ధతిని రద్దు చేయాలి ప్రజాసామాన్యం విశ్వాసం చూరగొన్న సాదిక్‌ను నాయకుడుగా ఎన్నుకునేందుకు. కేంద్ర ప్రభుత్వం అగ్రనాయకత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలి సాదిక్ ముఖ్యమంత్రిగా నూతన మంత్రివర్గం ఏర్పడి, పరిపాలనలో అవినీతికి కారకులైన వారందరినీ శిక్షించుతామని ప్రజానీకానికి వాగ్దానం చేయాలి. ప్రభుత్వ యంత్రాంగంలోని అవినీతిని, స్వార్థపరులను తొలగించేందుకు వెంటనే ఉపక్రమించాలి

కొలది సంవత్సరాలుగా అనుసరించిన సాచివేత కార్యక్రమాన్ని ఉపేక్షాభావాన్ని విడనాడి అగ్రనాయకత్వం వెంటనే ఇందుకు పూనుకోవాలి అప్పుడే ప్రజలలో విశ్వాసాన్ని పునరుద్ధరించడం సాధ్యమవుతుంది. పాకిస్తాన్ ఏజెంట్ల దుండగాలకు ఆస్కారం లేకుండా పోతుంది

ఆంధ్ర పేపరు మిల్లు

ప్రయివేటు రంగానికి బదలాయించకూడదని రాజమండ్రి ప్రముఖుల విజ్ఞప్తి

రాజమండ్రి, జనవరి 28

రాజమండ్రిలోని ప్రభుత్వ కాగితాలమిల్లును ప్రయివేటురంగానికి బదిలీ చేయటానిక్ని వ్యతిరేకిస్తూ రాజమండ్రిలోని ప్రముఖులు యాభైమంది ఒక విజ్ఞప్తిపత్రాన్ని ప్రధాని నెహ్రూకు పంపించారు.

ఈ విజ్ఞప్తి పత్రాన్ని ప్రణాళికాసంఘ ఉపాధ్యక్షులు శ్రీ అశోక మెహతా, సభ్యులు శ్రీ జి. ఎల్. నందాకుకూడా పంపించారు.

ఈ విజ్ఞప్తి పత్రంపై సంతకాలుచేసిన వారిలో రాజమండ్రి మునిసిపల్ అధ్యక్షులు, అనేకమంది మునిసిపల్, పంచాయతీసభ్యులు న్యాయవాదులు, డాక్టర్లు, కాంగ్రెస్ వాదు ఉన్నారు.

మిల్లును అభివృద్ధి పరచటానికి కావాల్సిన ధనాన్ని ప్రజలవద్దనుండి అప్పుగా ప్రభుత్వం సేకరించవచ్చునని ఆ విజ్ఞప్తి పత్రంలో సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం గనుక మిల్లును పబ్లిక్ రంగంలో అట్టిపెట్టి, నడపటానికి, అభివృద్ధి చేయటానికి సాధ్యంకాకపోతే. యీ మిల్లును కేంద్రప్రభుత్వం తీసుకోవాలని ప్రణాళికా సంఘం సూచించాలనికూడా ఆ విజ్ఞప్తిపత్రంలో కోరారు.

కంకిపాడు ఉప ఎన్నికలో

కమ్యూనిస్టు అభ్యర్థిని గెలిపించండి

కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితి విజ్ఞప్తి

విజయవాడ, జనవరి 26

కంకిపాడు (కృష్ణాజిల్లా) ఉప ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి శ్రీ మైనేని లక్ష్మణ స్వామిగారిని గెలిపించవలసిన అవశ్యకతను వివరిస్తూ నియోజకవర్గంలోని ప్రజలకు కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితి విజ్ఞప్తి చేస్తూంది విజ్ఞప్తిలో ఇలా ఉంది

1962 జనరల్ ఎన్నికలు జరిగి 2 సంవత్సరాలు గడిచాయి ఈ రెండు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం శాసన సభలో తనకున్న సంఖ్యాబలాన్ని ఆధారం చేసుకొని రైతాంగంపై అదనపు శిస్తువిధించింది. బంజర్ల పంపకాన్ని యేవో సాకులు చూపి వాయిదా వేస్తూవచ్చింది

నిత్య జీవితావసర వస్తువులధరలు విపరీతంగా పెరిగి, సామాన్య ప్రజలు కటకటలాడుతున్నారు. సామాన్యుడి జీవితం భారమైపోయింది.

ప్రణాళిక విజయానికి కావలసిన ధనాన్ని సేకరించడానికి ప్రత్యామ్నాయ మార్గాలను కమ్యూనిస్టుపార్టీ, తదితర ప్రజాతంత్రవాదులు సూచించినా అందుకు పూనుకోకుండా, సామాన్య ప్రజలపై అదనపుపన్నులు విధించింది. కోటీశ్వరులయెడ పక్షపాత వైఖరి అవలంబిస్తోంది.

దేశ వ్యాపితంగా కార్మికవర్గ నాయకత్వాన ధరల తగ్గుదలకు మహోద్యమం సాగుతోంది మన రాష్ట్రంలో అదనపు శిస్తు రద్దుకు, బంజర్ల పంపకానికి ఫిబ్రవరి 3 నుండి సత్యాగ్రహ పోరాటం సాగబోతోంది.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు తమ అసమ్మతి తెలియజేయడానికి కంకిపాడు ఉప ఎన్నికద్వారా ప్రజానీకానికి ఒక చక్కటి అవకాశం వచ్చింది.

ఆంధ్ర శాసనసభలో ప్రధాన ప్రతిపక్షంగా కమ్యూనిస్టుపార్టీ వుంటూ, ప్రజా వాణిని ప్రతిధ్వనిస్తోంది. అడుగడుగునా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తోంది.

ఈ ఉపఎన్నికలో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా శ్రీ మైనేని లక్ష్మణస్వామిని నిర్ణయించాం. వారిని గెలిపించడానికి పూర్తిగా కృషిచేయవలసిందిగా ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాము.

ఎన్నికల ఖర్చులకుగాను విరివిగా విరాళాలు ఇచ్చి తోడ్పడవలసినదిగా కోరుచున్నాం.

విరాళాలు ఈ దిగువ అడ్రసుకు పంప ప్రార్థన.

ఎం. నాగభూషణరెడ్డి,
కంకిపాడు ఎన్నికల కార్యాలయం, కంకిపాడు.

అంతర్జాతీయ సమస్యల శాంతియుతపరిష్కారం

బ్రిటిష్ విదేశాంగనీతికి మూల సూత్రమట !

మాస్కో, జనవరి 25

అంతర్జాతీయ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవడమే బ్రిటిష్ విదేశాంగ నీతికి మూలసూత్రం అని బ్రిటిష్ ప్రధాని సర్ అలెక్ డగ్లస్‌హోమ్ సోవియటు ప్రధాని కృశ్చేవ్‌కు సమాధానం ఇచ్చారు.

ప్రాదేశిక తగాదాలను శాంతియుతంగా పరిష్కరించుకొనేటందుకు అంతర్జాతీయ ఒప్పందం చేసుకోవాలని కృశ్చేవ్ డిసెంబరు 31 వ తేదీన చేసిన ప్రతిపాదనకు సమాధానం ఇస్తూ శాంతి సంరక్షణకొరకే బ్రిటన్ విదేశాలలోసైన్యసహాయహామీలిచ్చిందని వ్రాశారు.

హోమ్ సమాధానం నిన్న సోవియట్ ప్రభుత్వానికి అందజేయబడింది. నేడు పత్రికలకు దానిని విడుదల చేశారు.

"మీరు ప్రతిపాదించిన సాధారణ సూత్రాలపై ఇతోధికంగా కృషి చేయడానికి మా ప్రభుత్వం సంతోషంతో పరిశీలిస్తుంది.

"అయితే ఏ ఒప్పందం అయినా ఉపయోగకరంగా వుండాలి, అందరూ అమలు జరిపేదిగా వుండాలి, దానిలోని అంశాలు అమలు జరిపేటట్లు చేసే పరికరం వుండాలి.'

–అంటూ ఐరాస శాంతి సంరక్షణ కార్యసరళిని 'మరింతకట్టుదిట్టంచేయబడా"లని బ్రిటిష్ ప్రధాని వ్రాశారు.

ఈ సమాధానాన్ని సోవియటు విదేశాంగ మంత్రి గ్రోమికోకు బ్రిటీషు రాయబారి సర్ హంఫ్రీ ట్రెవెల్యాన్ అందచేశారు. ఇది 1400 మాటలు గలపత్రం

"శాంతి అవిభాజ్యం అనీ, ఎంత చిన్న స్థానిక ఘర్షణ అయినా దానిని భంగపరచే ప్రమాదం వున్నదనీ మీలాగనే మేమూ భావిస్తున్నాం.

జాతీయ విముక్తి పోరాటాలంటూ పేరు పెట్టి బయటినుంచి ఆయుధాలనూ,వలంటీర్లనూ సరఫరా చేస్తున్నయుద్ధాలు కొన్ని పెద్ద యుద్ధాలుగా వ్యాప్తిచెందే ప్రమాదం వున్నది"– అని ఆ పత్రంలో వ్రాశారు.

"అందుచేత, సాయుధ సంఘర్షణలు ఏవీ జరగకుండా వుండడం మనందరకూ ప్రయోజనకరం, బలప్రయోగాన్ని సమర్థవంతంగా

మిగతా 6 వ పేజీలో

అభ్యుదయకరమైన ప్రత్యామ్నాయ ప్రతిపాదనలతో మితవాదులను ఎదుర్కొన్న అతివాదశక్తుల వైఖరి

హర్షణీయమని కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యవర్గ తీర్మానం

అయితే ఇంతమాత్రాన కాంగ్రెస్ అతివాదం వైపుకు మొగ్గినట్లు కాదని స్పష్టీకరణ

మితవాదశక్తులపై ప్రజాతంత్రశక్తులఐక్యపోరాటాల అవసరము,ఆవశ్యకత ఇనుమడించినదనివివరణ

న్యూఢిల్లీ, జనవరి 24

కాంగ్రెస్‌లోని మితవాద అభివృద్ధి నిరోధకుల విధానాలపై దాడిచేస్తూ అతివాద శక్తులు అధికార ముసాయిదా తీర్మానంకన్నా చాలా అభివృద్ధి కరమైన ప్రత్యామ్నాయ ప్రతిపాదనలతో ముందుకురావడం భువనేశ్వర్ కాంగ్రెస్ మహాసభలో అన్నిటికన్నా హర్షణీయవిషయమనీ,అయితే యింతమాత్రాన కాంగ్రెస్ అతివాదంవైపుకు మొగ్గినట్లుకాదనీ భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యవర్గం భువనేశ్వర్ కాంగ్రెస్‌పై చేసిన తీర్మానంలో ఉద్ఘాటించింది.

ప్రజలపై దాడిచేస్తున్న మితవాదశక్తుల విధానాలను తిప్పికొట్టడానికై దేశంలోని ప్రజాస్వామికశక్తులన్నీ ఐక్య కార్యాచరణకు, పోరాటాలకు పూనుకోవాలని కార్యవర్గం పిలుపు నిచ్చింది.

(తీర్మానం క్లుప్తంగా లోగడ ఇచ్చాం పూర్తి పాఠమిది)

ఈ నెల 11 వ తేదీనుండి 17 వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యవర్గం, భువనేశ్వర్ కాంగ్రెస్ మహాసభపై యీ క్రింది తీర్మానాన్ని ఆమోదించింది

"భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యవర్గం అత్యంత ప్రముఖమైన ఘటనలతో కూడిన జాతీయ కాంగ్రెస్ భువనేశ్వర్ మహాసభ కార్యకలాపాలను స్థూలంగా సమీక్షించింది "ప్రజాస్వామ్యం సోషలిజం" నిర్వచనపైన, యింకా నిర్దిష్టంగా చెప్పాలంటే ఆర్థిక విధానాలగురించి, సాంఘిక లక్ష్యాల గురించి ఈ మహాసభలో ప్రముఖంగా చర్చ జరిగింది."

కాంగ్రెసు సంస్థలో పెంపొందుతున్న అతివాద ధోరణులను యీ మహాసభ గట్టిగా ద్యోతకం చేసింది. మహాసభ కంటే ముందు బ్యాంకుల జాతీయకరణ, వాణిజ్యరంగాన్ని ప్రభుత్వమే చేబట్టడం, రాజభరణాల రద్దు వంటి నిర్దిష్ట సమస్యలపై కాంగ్రెస్ సంస్థలోని వివిధ స్థాయిలలో కొన్ని ప్రదేశ్ కమిటీలతో సహా చర్చలు జరిగాయి. ఈ విధానాలను సమర్థిస్తూ కొన్ని కమిటీలు తీర్మానాలను ఆమోదించడంకూడా జరిగింది.

దేశీయ సమాజంలోని వైరుధ్యాలు నిశితమౌతున్నవి. అధికారపార్టీ ప్రకటిత విధానాలకూ, ఆ పార్టీయే నిర్వహిస్తున్న ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకూ, చేబడుతున్నచర్యలకూ తీవ్రమైన వైరుధ్యాలేర్పడుతున్నవి. ఈ పూర్వరంగంలో జరిగిన దృష్ట్యా. యీ మహాసభకు అత్యంత ప్రాముఖ్యత యేర్పడింది. మరో విశేషం యేమంటే తృతీయ ప్రణాళిక సంక్షోభంలోపడిన స్థితిలో కాంగ్రెస్ వాదులతోసహా చాలామంది తీవ్రమైనయోచనలో పడుతున్నారు. దేశం ముందున్న సమస్యల వాస్తవ పరిష్కారంకోసం వాద తరుసుకులా కుంటున్న దశలో యీ మహాసభ జరిగింది.

గత మహాసభల సందర్భంలో యెన్నడూ జరుగనంత ప్రముఖంగా ఈ వైరుధ్యాలూ, సంఘర్షణలూ, భువనేశ్వర మహాసభలో బహిర్గతమైనది. కాంగ్రెస్ లోని అతివాద శక్తులు చొరవతో ముందుకు వచ్చి గుత్తా పెట్టుబడిదారులనూ, యితర స్వప్రయోజనపర వర్గాలనూ నిశితంగా విమర్శించడమే గాకుండా దేశం, ప్రజల ప్రయోజనాల పరంగా అత్యవసరంగా మైన నిర్దిష్టమైన కొన్ని కోర్కెలను మహాసభ ముందు ప్రతిపాదించాయి. కాంగ్రెసును అనుసరించే ప్రజా సామాన్యంతో సహా, దేశ ప్రజలందరిలోనూ వ్యక్తమౌతున్న ప్రజాస్వామిక వాంఛితాలను యిది బహిర్గతం చేసింది. ఇటీవలి దశలో కాంగ్రెసు చరిత్రలో మరేనాడు జరగనంత పటిష్టంగా, ఆ సంస్థలోని అతివాదులు తమ వాంఛితాలను ప్రకటించారు. వారు చాలా చురుకుగా వ్యవహరించారు.

దేశ ప్రజలందరితోబాటు పాలకపార్టీలోని సభ్యులలోనసహాసోషలిస్టుభావాలు అభివృద్ధిచెందుతుండటాన్ని పార్టీ కేంద్ర కార్యవర్గం సహజంగానేహర్షించుతోంది సోషలిస్టు భావాలకు వర్తమాన దశలో యెంతటి గట్టి ఆకర్షణ వుందో యిది రుజువు చేస్తోంది. మార్క్సిజమూ, లెనినిజమూ యిచ్చే యేకైక శాస్త్రీయ నిర్వచన ఆధారంగా, ప్రజాస్వామ్యంకోసం సోషలిజం కోసం జరిగే పోరాటంలోనికి సాధారణ ప్రజానీకాన్ని సమీకరించడానికి గల అపార అవకాశాల్ని గూడా యీ పరిస్థితి వెల్లడి చేస్తోంది.

కాంగ్రెస్ మహాసభ సోషలిజంపై చర్చను లేవనెత్తిన దృష్ట్యా, శాస్త్రీయ సోషలిజం సిద్ధాంత ప్రవక్తలయిన మార్క్స్-ఏంగెల్స్-లెనిన్‌లు ఆ సిద్ధాంతాన్ని చిరకాలంక్రితమేనిర్వచించారని, కార్యవర్గం పునరుద్ఘాటించకతీరదు విప్లవ మేధావులైనవారి బోధనలు వాస్తవ జీవితంలో సరైనవని రుజువైనాయి. ఒకవంద కోట్ల జనాభా నివసిస్తున్న ప్రపంచంలోని మూడింట ఒకవంతు భాగంలో ఈ బోధనలకు ఆచరణరీత్యా విజయం సిద్ధించింది.

సమాజం పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిస్టువ్యవస్థలోనికి పరివర్తనచెందాలంటే, రాజ్యాంగ అధికారం విధిగా శ్రామిక ప్రజల హస్తగతం కావాల్సివుంటుంది శ్రామిక ప్రజల పరమైన రాజ్యాంగ వ్యవస్థ యేర్పడాల్సివుంటుంది. సోషలిజం కోసంప్రపంచమంతటా జరిగిన పోరాటపు చారిత్రకానుభవం యీ విషయాన్నే తిరుగులేని విధంగా రుజువుపరచింది.

సోషలిస్టువ్యవస్థక్రింద,ఉత్పత్తిసాధనాలూ, పంపిణీ, మారకపుసాధనాలన్నీ సమాజపరం కావాల్సి వుంటుంది ఒక వ్యక్తిని మరో వ్యక్తి దోపిడీచేసేపద్ధతి నిర్మూలం కావలసి వుంటుంది,

మార్క్సిజం, లెనినిజంల బోధనలకు అనుగుణంగా, వర్గ పోరాటాలను విప్లవాత్మకమైన దిశలో, తీవ్రపరచటం ద్వారానే సోషలిస్టు లక్ష్యం సాధించ బడుతుంది. వర్గ పోరాటమనేది సాంఘికాభివృద్ధి క్రమాన్ని శాసించే భౌతికసూత్రం. వర్గపోరాటం లేకుండా పోతే బాపుండునని ఆశించినంత మాత్రాన అది నివారించబడేదికాదు.

వర్గపోరాటం లేకుండా సోషలిజం సంపాదించాలనిచెప్పేవారు ఊహా జగత్తులోసంచరించే వారైనాకావాలి లేదా వారు ఉద్దేశ పూర్వకంగా శ్రామిక ప్రజలను శాశ్వతంగా నిరాయుధుల్ని చేయ తలపెట్టేరనైనా భావించక తప్పదు. అందుకని వర్గ పోరాటంతో నిమిత్తం లేకుండా సోషలిజంసాధించాలంటూకాంగ్రెస్ అధ్యక్షులు చేసిన ప్రతిపాదనతో పార్టీ కేంద్ర కార్యవర్గం మౌలికంగా భేదిస్తోంది.

మన దేశంలో యీ నాడుదోపిడీవర్గాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతాంగమూ, ఇతర తరగతుల ప్రజలూ జరుపుతున్న వర్గపోరాటాలు నానాటికీ తీవ్రమౌతున్నవి. కాగా, భారత ప్రజానీకం వర్గ పోరాట విసర్జన పంథాలో పయనించడంగాక, శాస్త్రీయ సోషలిజం బోధనలకు అనుగుణంగా తమ పోరాటాలను అభివృద్ధి పరచుకోవడం పైనే వారి భవితవ్యం ఆధారపడి వుంది.

ఈ పోరాటాలను ప్రజాస్వామ్యయుతమూ, శాంతియుతమూనైన పద్ధతులద్వారానే అభివృద్ధి పరచడానికి భారత కమ్యూనిస్టు పార్టీ కృతనిశ్చయమై వుంది.

కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కామరాజ్, మరి యితర కాంగ్రెస్ నాయకులు ఈ చర్యల సందర్భంలో సోషలిస్టు లక్ష్యసాధనపట్ల అవలంబించదగు వైఖరినీ. అందుకు అనుసరించదగు మార్గాలనూ ప్రస్తావనకు తెచ్చారు. మహాసభలో ఆ అంశాలుగూడా చర్చించబడ్డవి. వారు పార్లమెంటరీ ప్రజాస్వామికంగురించిన ప్రస్తావన కొనివచ్చిన దృష్ట్యా, కార్యవర్గం, భారత కమ్యూనిస్టుపార్టీ నిబంధనావళిలోని ఉపోద్ఘాతంలో పేర్కొన్న యీ క్రింది భాగాన్ని ప్రస్తావించడం అవసరమని భావించుతోంది.

"భారత కమ్యూనిస్టుపార్టీ, సమగ్రమైన, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాల సాధన కోసం శాంతియుత పద్ధతులద్వారా కృషి చేస్తుంది. బలమైన ప్రజా ఉద్యమాన్ని అభివృద్ధి చేయడంద్వారా, పార్లమెంటులో మెజారిటీ సంపాదించడం ద్వారా, అందుకు ప్రజామోదాన్ని సంపాదించడంద్వారా, కార్మిక వర్గమూ, ఆ వర్గానికి మిత్రులూ, అభివృద్ధి నిరోధ శక్తుల ప్రతిఘటనను నిరోధించగలరు తద్వారా రాజ్యాంగ యంత్ర నిర్మాణంలోనూ, సాంఘిక, ఆర్థిక రంగాలలోనూ ప్రజల ఆంకాక్షలకు అనుగుణమైన మౌలికమైన మార్పులను కొనివచ్చేటందుకు పార్లమెంటును సాధనగా మార్చగలరు.

"దేశంలోసోషలిజం సాధనకోసంపాటుబడే శక్తులన్నింటి సహకారంతో, కమ్యూనిస్టు పార్టీ సోషలిస్టు సమాజ నిర్మాణానికి కృషి చేస్తుంది. అలాంటి సోషలిస్టు వ్యవస్థ అన్ని రంగాలలోనూ, త్వరితగతిని అభివృద్ధి సాధించడానికి హామీ కల్పించగలదు. అది వ్యక్తి స్వేచ్ఛను విస్తృత పరచి. వాక్సభా పత్రికా స్వాతంత్ర్యాలకూ. ప్రభుత్వానికి ప్రతిపక్షాలుగా వ్యవహరించే రాజకీయపార్టీలలో సహా, ఆ పార్టీలు రాజ్యాంగానికిలోబడి వ్యవహరించే మేరకు నిర్మాణస్వేచ్ఛను ప్రసాదించగలదు, ఒకవ్యక్తిని మరోవ్యక్తి పీడించే పద్ధతిని రూపుమాపి, మానవవ్యక్తిత్వం సమగ్రంగా వికసించడానికి సోషలిస్టు వ్యవస్థ మాత్రమే తగుపరిస్థితులను యేర్పాటు చేయగలదు."

కమ్యూనిస్టుపార్టీ నిబంధనావళిలోని యీ అంశాన్ని చూచినప్పుడు పార్లమెంటరీ ప్రజాస్వామికంపైన ఆధారితమైన శాంతియుత పద్ధతుల ద్వారా సోషలిజం సాధించాలా లేదా అనే విషయంపై, కాంగ్రెస్‌కూ, కమ్యూనిస్టు పార్టీకీ మధ్య వివాద మేమీ లేదని స్పష్టమౌతుంది. ఇతర మౌలిక సమస్యలపైనే కాంగ్రెస్‌కూ, కమ్యూనిస్టులకూ మధ్య వివాదం వుంది.

సాధారణ పౌరులకుప్రజాస్వామ్య హక్కులను గ్యారంటీచేసేటందుకు,పార్లమెంటరీవ్యవస్థ మాత్రమే సరిపోదనే విషయాన్ని యీ సందర్భంలో నొక్కి చెప్పవలసి వుంది. విచారణతో నిమిత్తం లేకుండా పౌరులను నిర్బంధించుతూ జైళ్లలో పెడుతున్నారు. నిరుపేద కార్మికులూ, రైతాంగమూ నిర్బంధించబడి పోలీసులాకప్పులలో వేధించబడుతున్నారు. చౌకగా తమకు విద్యాసౌకర్యాలు కల్పించబడాలని ఆందోళన చేస్తున్న పాపానికి, పోలీసులు విద్యార్థులపై అమానుషంగావిరుచుకు పడుతున్నారు

ఈ పరిస్థితి యిలా సాగుతూ వుండగా, కేవలం అసమ్మతి ప్రకటించినంత మాత్రాన, పార్లమెంటరీ ప్రజాస్వామ్య పదజాలాన్ని వాడినంత మాత్రానే సరిపోదు వాస్తవమైన పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, ప్రజాస్వామ్య మౌలిక భావనకే విరుద్ధమైన బ్యూరాక్రటిక్ వ్యవస్థను తొలగించడానికి యిదిబొత్తిగా సరిపోదు,

ఎన్నికలు జరిగినంత మాత్రాన, పార్లమెంటులోనూ, శాసనసభల్లోనూ చర్చలు జరిగినంత మాత్రాన, కోట్లాది శ్రామిక ప్రజానీకానికి ప్రజాస్వామ్యం సిద్ధించదు ఫ్యాక్టరీలలోను, పనిస్థలాలలోనూ కార్మికులకు తమహక్కులను వినియోగించుకొనే స్వేచ్ఛయేర్పడాలి. గ్రామసీమలలో శ్రామిక రైతాంగానికి స్వేచ్ఛకలగాలి నిజమైన ప్రజాస్వామ్యం యీవిధంగా క్రిందనుండి ప్రారంభమై పై స్థాయిలోపార్లమెంటుద్వారా వ్యక్తం కావాలి.

"పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ఆధారితమైన సోషలిస్టు రాజ్యాంగస్థాపనే తమనిర్మాణ ధ్యేయమని కాంగ్రెస్ మహాసభ ప్రకటించింది కాంగ్రెస్ యిలాంటిసోషలిస్టు ప్రకటనలు చేయడంలో కొత్తయేమీలేదు. తొమ్మిదేండ్ల క్రితం వారు తమ ఆవడి మహాసభలో "సోషలిస్టు తరహా సమాజం" తమ లక్ష్యమని ప్రకటించారు. ఆ తరువాత రెండేండ్లకు అంటే 1957 లో తమ లక్ష్యాన్ని "సోషలిస్టు సహకార కామన్వెల్తు"గా నిర్వచించారు

ఇన్ని లక్ష్య ప్రకటనలు జరిగినా దేశంలో వాస్తవానికి పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణం మాత్రమే కొనసాగుతూ వచ్చింది. కొద్దో దేశంలోని కొద్దిమంది కోటీశ్వరుల చేతులలో దేశ సంపద అంతా కేంద్రీకృతమైంది. కాంగ్రెసు నాయకులు సోషలిస్టు ప్రకటనలెన్ని చేసినా, వారి ప్రభుత్వం, ధనిక స్వామ్యపు అధికారాన్ని అదుపులో పెట్టేందుకుగానీ, మన ఆర్థిక వనరులపై విదేశగుత్తదివతులదోపిడీని నివారించడానికిగానీ, రైతాంగ ప్రయోజనాలకు అనుగుణంగా భూసంస్కరణలు అమలు జరపడంగానీ, శ్రామిక ప్రజల తక్షణ కోర్కెలను తీర్చడంగానీ, పరిపాలనను ప్రజాస్వామ్యబద్ధం చేయడంగానీ జరుగనేలేదు. అత్యవసరమైన యిలాంటి ప్రజాస్వామిక చర్యలు అమలు చేయకుండా. సోషలిజం గురించి మాట్లాడటం వట్టిగాలిని పోగుచేయడం మాత్రమే అవుతుంది.

అయితే సోషలిజం, ప్రజాస్వామ్యం అనే విషయంపై చర్చజరపడాన్ని కార్యవర్గం తప్పక హర్షించుతుంది. ప్రజాసామాన్యపు ఆశలపట్లా, శాంతి ఆశయాలపట్ల విధేయతతో నిజాయితీగా ఈ చర్చ జరిగితే తద్వారా ప్రజాసామాన్యపు రాజకీయ చైతన్యం పెంపొందుతుంది. ప్రజాస్వామ్యం కోసం, సోషలిజం కోసం జరిగే పోరాటానికి వారు తద్వారా, సైద్ధాంతికంగా సన్నద్ధులు కాగలుగుతారు. కమ్యూనిస్టులు యీ చర్చలో తప్పక పాల్గొంటారు. సోషలిస్టు ధ్యేయంపట్ల విశ్వాసం కలవారితో చర్చించటానికి వారుసర్వదా సిద్ధంగా వుంటారు, నిజాయితీ పరులయినసోషలిస్టులంతాశాస్త్రీయ సోషలిస్టు భావాలను తప్పక స్వీకరించగలరని కమ్యూనిస్టులు దృఢవిశ్వాసాన్ని కలిగివున్నారు.

దేశంలోని ప్రజాస్వామిక, దేశభక్తియుత శక్తులు ఆచరణరీత్యా తక్షణ కర్తవ్యాలుగా నేడు రూపొందిన సమస్యల దృష్ట్యా భువనేశ్వర్ మహాసభ నిర్ణయాలను సమీక్షించడం అవసరమని కార్యవర్గం భావిస్తూవుంది.

'ప్రజాస్వామ్యం, సోషలిజం'పై భువనేశ్వర్ మహాసభ ఆమోదించిన ప్రధాన తీర్మానంలో కొన్ని ఆమోద యోగ్యమైన భావాలు ప్రకటించబడినాయి. అయినా, కాంగ్రెస్ పార్టీ అతివాదంవైపు మొగ్గిందని చెప్పడానికి తగిన ఆస్కారమేదీ యీ మహాసభ కల్పించలేదని కార్యవర్గం అభిప్రాయ పడుతోంది.

నిజానికి, కొందరు ముఖ్య కాంగ్రెసు వాదులతో సహా, ప్రతినిధులలోని అత్యధిక సంఖ్యాకులు, తమ ప్రసంగాలలో డిమాండ్ చేసిన బ్యాంకుల జాతీయకరణ వంటి ముఖ్యమయిన ప్రతిపాదనలన్నింటినీ కాంగ్రెసు అగ్రనాయకత్వం పూర్తిగా నిరాకరించింది

తీర్మానంలోని ఆచరణకు సంబంధించిన భాగం చాలా అస్పష్టంగా విడిచిపుచ్చబడింది. శ్రామిక ప్రజల క్షేమసాధన కోసం గానీ, విదేశ, స్వదేశ గుత్త పెట్టుబడిదారులనూ, స్వప్రయోజనపరులను అదుపులోపెట్టేందుకు నిర్దిష్టమూ, స్పష్టమూనైన చర్య లేవీ ఈ భాగంలో చేర్చబడలేదు.

ప్రజల ప్రయోజనాలకు అనుగుణమైన నిర్దిష్టమైన కార్యాచరణను నిర్దేశించగలదని భువనేశ్వర్ మహాసభపై ఆశపెట్టుకొన్న అత్యధికసంఖ్యాక ప్రతినిధులకు, యిందువల్ల తీవ్రమైన ఆశాభంగం కల్గడంలో ఆశ్చర్యమేమీలేదు

కాంగ్రెస్ అధిష్ఠాన వర్గానికీ ప్రభుత్వానికీ ఇతరుల జోక్యం లేకపోతే, యీ ప్రకటనలు కాగితంమీద మాత్రమే వుండిపోతాయి. వాగ్దానానికీ ఆచరణకూ మధ్యవున్న అఖాతాన్ని పూడ్చేటట్లుగా వాళ్ళ విధానాలూ తీవ్రమైన మార్పురాదు. సోషలిజం గురించి చేసే యీ కొత్త ప్రకటనల చాటున పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించే కార్యక్రమమే సాగుతుంది ప్రజా సముదాయాన్ని భ్రమలకుగురిచేసి పోరాటవిముఖులుగా చేయడానికి తాత్కాలికంగానూ రాజకీయంగానూ పాలకవర్గాలు చేసే ప్రయత్నాలు యథాప్రకారంగా సాగుతూనే వుంటాయి.

మితవాద నాయకులు, ఆత్మ సమర్థనాస్థితిలోకినెట్టబడి, కుతంత్రాలకు దిగినారు. అభివృద్ధి - నిరోధక భావాలకు పేరుగాంచిన ఒక మితవాద నాయకుడు సోషలిజం మీది తీర్మానానికి సహ ప్రతిపాదకుడుగా ముందుకు వచ్చాడు. కాంగ్రెసు యొక్క ప్రగతి శీలమైన యీప్రకటన అమలులో పెట్టవలసి వచ్చినప్పుడు గతంలో వలెనే దానిని విచ్ఛిన్నం చేయగలమనే ధీమా వాళ్ళకు వున్నట్లుంది.

భువనేశ్వర్ కాంగ్రెస్‌లోని అత్యంత ప్రోత్సాహకరమైన లక్షణం యేదంటే, కాంగ్రెస్‌లోని వామపక్షం మితవాద అభివృద్ధి నిరోధక వర్గంమీద దాడిచేసి. నాయకత్వాన్ని నిర్దాక్షిణ్యంగా విమర్శించి, అధికార ముసాయిదా తీర్మానానికంటె ఎంతో ప్రగతిశీలమైన ప్రత్యామ్నాయ వేదికను ప్రతిపాదించినారు.

గుత్తకంపెనీలను రద్దుచేయాలనీ, కొన్ని నిర్దిష్ట పరిశ్రమలను, ముఖ్యంగా బ్యాంకులను, జాతీయం చేయాలనీ, వామపక్షం డిమాండు చేసింది. ధాన్య వ్యాపారం ప్రభుత్వం తీసుకోవాలని పట్టుదలగా డిమాండు చేసింది గుత్త పెట్టుబడిదార్లకూ స్వలాభ ప్రేరితులకూ ప్రభుత్వం చూపే దాక్షిణ్యాన్ని ఖండించింది. ప్రస్తుత భూసంస్కరణలపట్ల అసంతృప్తిని ప్రకటించింది.

ప్రజల సుఖజీవనానికి, ప్రజలకు న్యాయం కలిగించడానికి వామపక్ష ప్రతినిధులూ, ప్రగతి శీల ప్రతినిధులూ, నాయకత్వానికి ముఖాముఖిగా నిలబడి అనేక డిమాండ్లు చేసినారు. వామపక్షవాణికి ప్రతినిధుల నుండి ఉత్సాహపూరితమైన మద్దతు లభించింది.

చర్చలో అధిష్ఠాన వర్గం ఆత్మ సమర్థనా స్థాయికి నెట్టబడింది. అయినప్పటికీ అది ప్రతినిధులలోని సాంప్రదాయకమైన విధేయతా భావాలను వినియోగించుకొని వామపక్ష డిమాండ్లను తిరస్కరించే స్థితిలో వుండింది.

కాంగ్రెసులోని వామపక్ష శక్తులూ ప్రజాతంత్ర శక్తులూ చేసే డిమాండ్లు దుర్వారమైనవిగా వుండాలంటే ఆ శక్తులు యింతకంటె చాలా యెక్కువగా బలపడాలనీ సమైక్యపడాలనీ భువనేశ్వర్ మహాసభ నొక్కిచెప్పింది.

వామపక్ష వేదికలో కొన్ని ముఖ్యలోపాలు లేకపోలేదు. కాంగ్రెసు పార్టీలో అన్ని పక్షాలూ భూసంస్కరణలను బలపరుస్తూనూ, రైతుల ప్రయోజనాలను రక్షించా లంటూనూ మాట్లాడుతాయి. కానీ ప్రభుత్వంలో వున్న వాళ్ళు ఉచితమైన శాసనాలద్వారా మౌలిక భూసంస్కరణలు ఆచరణలో పెట్టడం లేదు.

అంతేగాదు. కేరళలో భూసంబంధాల చట్టంద్వారా కమ్యూనిస్టుప్రభుత్వం చేసినట్లు మౌలికమైన భూసంస్కరణలు ఆచరణలో పెట్టడానికి యెక్కడైనా ప్రయత్నం జరిగితే, ఆ ప్రయత్నానికి అనుమతి లభించడం లేదు. కేరళ భూసంబంధాల బిల్లును కాంగ్రెస్‌వాళ్ళు హీన ప్రయోజనాలు కలదానిగా మార్చి చట్టం చేయడం భువనేశ్వర్ మహాసభ జరగబోయే ముందుగానే.

కాంగ్రెస్‌లోని వామవర్గాలు భూసంస్కరణల చట్టంయొక్క అభివృద్ధితో తృప్తిపడటం లేదు. సరియైన భూసంస్కరణలు అమలులోకి రావాలని వాళ్లు గాఢంగా వాంఛిస్తున్నారు. కానీ భూసంస్కరణలను గురించిన తమ ప్రతిపాదనలు అమలులోకి రావాలంటే, కర్షకప్రజాసమూహాల ఆధారంతో ప్రజాతంత్రశక్తులన్నీ కలిసి సాగించే సమష్టి పోరాటం అవసరమని వాళ్లు యింకా గుర్తించలేకున్నారు.

అటువంటి పోరాటాలు లేనప్పుడు వామపక్ష విమర్శలు భౌతిక ప్రయోజనాలు లేని సదుద్దేశ ప్రకటనలుగా మాత్రమే మిగిలిపోతాయి.

విదేశీ పెట్టుబడులు దేశంలోకి చొచ్చుకొని వస్తున్నాయి. వీటిని ప్రభుత్వం ఇంకా ప్రోత్సహిస్తూనే వుంది. ఈ ప్రమాదాన్ని గురించి ప్రస్తావనే జరగలేదు.

వామపక్ష వేదికలో మరొక తీవ్రమైన లోపం వుంది, అదేమంటే, ఏ గుత్త కంపెనీలైతే భువనేశ్వర్‌లో తీవ్రమైన విమర్శకు గురైనాయో ఆ గుత్త కంపెనీలమీద కార్మికవర్గం తమ డిమాండ్ల ద్వారానూ తమ పోరాటాల ద్వారానూ శక్తివంతంగా దెబ్బతీస్తున్న విషయాన్ని వామపక్షం స్పష్టంగా గుర్తించలేదు కాంగ్రెస్‌లోపలాబయటా వున్న ప్రజాతంత్రశక్తులూ, వామపక్ష శక్తులూ కార్మిక వర్గ పోరాటానికి మద్దతు యివ్వక తప్పదు.

కాంగ్రెస్ వామపక్ష డిమాండ్లకు భువనేశ్వర్‌లో విజయం లభించక పోయినా, మొత్తం కాంగ్రెస్ సంస్థమీదా, మన ప్రజా జీవితంమీదా వామపక్షం వేసిన ముద్రను యెవరూ నిరాకరించలేరు. పాలక పార్టీలో పెరుగుతున్న విభేదాన్ని నొక్కి చెప్పడంతో బాటు, తన స్వతంత్ర వ్యక్తిత్వాన్ని వామపక్షం గట్టిగా ఉద్ఘాటించింది.

* * *

ఇది ప్రజలకు ఆత్మవిశ్వాసాన్నిచ్చింది మితవాద అభివృద్ధి నిరోధకత్వానికి వ్యతిరేకంగానూ, ప్రభుత్వంయొక్క ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగానూ, ప్రజల ప్రాణప్రదమైన ప్రయోజనాల రక్షణకొరకూ, దేశ ఆర్థిక రాజకీయ జీవితాన్ని వామ దిశగా మళ్ళించడానికీ, జరిగే విశాల ప్రజాపోరాటాలకు యిది (ఈ వామపక్ష చర్య) కొత్తమార్గాలను ఆవిష్కరించింది.

కాంగ్రెస్ లోపలా, కాంగ్రెస్ బయటా వున్న ప్రజాతంత్ర శక్తులన్నీ కలిసి, ఆర్థిక సమస్యల మీదా, తదితర ఆంతరంగిక సమస్యలమీదా, ఇంతకు ముందుకంటే విశాలమైన పరిధిలో సమైక్య పోరాటాలు జరపడానికి యీనాడు ఆచరణయోగ్యమైన అవకాశాలు వున్నాయి. అటువంటి పోరాటాలను రూపొందించడానికి కాంగ్రెస్ లోపలా బయటా వున్న ప్రజాతంత్ర శక్తులు వచ్చే మాసాలలో తీసుకోబోయే సమష్టి చర్యల మీద చాల భాగం ఆధారపడి వుంటుంది.

గుత్త పెట్టుబడిదార్లకు వ్యతిరేకంగా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెసు వాదులూ, ప్రజలూ డిమాండు చేస్తున్నప్పటికీ, విదేశ ప్రైవేటు పెట్టుబడిని యితోధికంగా ఆహ్వానించేవిధానాన్ని భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రి బహిరంగంగా ప్రచారం చేస్తున్నాడు సామ్రాజ్యవాదుల చేతిలో నవ్య వలసతత్వ పరికరమే విదేశీ పెట్టుబడి. ఈ విషయాన్ని దేశమంతా గుర్తించాలని భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యవర్గం కోరుతున్నది.

ఉత్పత్తిని పెంచాలనే సాకుతో ధన కేంద్రీకరణనూ ఆర్థికాధికార కేంద్రీకరణనూ సమర్థించడానికి ఆర్థికమంత్రి శ్రమపడుతున్నాడు. కానీ యథార్థమేమంటే, గుత్త పెట్టుబడిదారలమీద భారత ప్రభుత్వం యెంత అతిగా ప్రేమ చూపిస్తున్నప్పటికీ, అనేక ముఖ్య పరిశ్రమల్లో వాళ్లు ప్రణాళికా లక్ష్యాలను పూర్తిచేయలేకపోయినారు.

కార్మికులకు న్యాయమైన భాగం నిరాకరించడంద్వారానూ, దేశంమీద అధిక ధరలను రుద్దడంద్వారానూ, తమ బందిపోటు దోపిడీని సాగిస్తున్న ఈ గుత్తపెట్టుబడిదార్లే మన జాతీయ జీవితంలోని అభ్యుదయ నిరోధకశక్తులన్నిటికీ రాజపోషకులు.

కాబట్టి గుత్త కంపెనీలను ఖండించడం మొక్కటే చాలదు. బ్యాంకులూ, నూనె, విదేశ వాణిజ్యమూ వీటిని తక్షణం జాతీయం చేయడంద్వారానూ, ఆహార ధాన్యాల వ్యాపారాన్ని ప్రభుత్వం స్వాధీనంచేసుకోవడం ద్వారానూ, యితర ఆర్థికచర్యలద్వారానూ, గుత్తపెట్టుబడిదార్ల అధికారాన్ని తక్షణమే తుదముట్టించవలసి వుంది

ధరలు తగ్గించ వలసికూడా వుంది. ప్రణాళికల ఆర్థిక భారమంతా సామాన్యుల మీద మోపే పద్ధతికి స్వస్తిచెప్పి, ధనవంతులు కూడా తమ వంతు భారాన్ని మోసేటట్లు చేయాలి.

మౌలికమైన భూసంస్కరణల ద్వారా భూసంబంధాలను పునర్నిర్మించడంలోనూ, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలను హామీ యివ్వడంలోనూ ప్రభుత్వం విఫలమైంది. బీద రైతాంగం ఋణయోగ్యం కాదనే నెపంతో వాళ్ళకు ఋణసౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఈ వైఫల్యాల కారణంగా రైతు ప్రజా సముదాయం అంతులేని దారిద్ర్యంలో మునిగిపోవడమేగాక, మన వ్యవసాయం చాలావరకు నిలవనీరు మాదిరి వుండడమేగాక, యెడతెగని ఆహార కొరత దేశంమీద పెద్ద భారంగా తయారైంది. తన తిండికి కూడా భారత దేశం అమెరికా బిచ్చం మీద ఆధారపడవలసివుంది.

అణగ ద్రొక్కబడిన రైతు ప్రజల కొరకే గాక, మొత్తం దేశం కొరకుగూడా, మౌలిక భూ సంస్కరణల నిమిత్తం సమైక్య పోరాటాలు జరపడం అత్యవసరంగా తయారైంది.

* * *

భారత కార్మికవర్గం యిప్పటికే కదిలింది. బోనస్ కొరకూ, కరువు భత్యం కొరకూ, జాతీయకరణకొరకూ, జరిపే ఉద్యమాల ద్వారానూ, పోరాటాల ద్వారానూ కార్మిక వర్గం తన ప్రయోజనాలతోబాటు దేశప్రయోజనాలను కూడా రక్షిస్తున్నది. ఈ పోరాటాలు గుత్తపెట్టుబడులమీద బలమైన దెబ్బతీసి, మొత్తం ప్రజాతంత్ర ఉద్యమాన్ని బలపరుస్తాయి

ప్రజా స్వామ్యమూ, పురోభివృద్ధీ, సాంఘిక న్యాయమూ కావాలనేవాళ్లందరూ యీ పోరాటాలను జరపడం విధ్యుక్త ధర్మం.

మితవాద అభివృద్ధి నిరోధకత్వానికి వ్యతిరేకంగానూ, దేశ ప్రయోజనాలకూ ప్రజానీక ప్రయోజనాలకూ సంబంధించిన ప్రభుత్వ విధానాలను అభివృద్ధి ముఖంగా మళ్ళించడానికి, ప్రజాతంత్ర శక్తులూ, దేశభక్తశక్తులూ అన్నీ కలిసి శక్తివంతమైన సమిష్టి చర్యలు రూపొందించడానికి భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యవర్గం పిలుపు యిస్తున్నది.

పార్లమెంటులోనూ రాష్ట్ర శాసనసభల్లోనూ గల ప్రజాతంత్ర శక్తు లన్నిటినీ సమైక్యపరచడానికీ. యీ అత్యవసర డిమాండ్లను అప్రతిహతమైనవిగా చేసే విశాల సమైక్య ప్రజోద్యమాలను నిర్మించడానికీ, గల వర్తమాన అవకాశాలు సంపూర్ణంగా వినియోగించబడతాయని కార్యవర్గం ఆశిస్తున్నది. ప్రజా

(మిగతా 6 వ పేజీలో)

చర్చ

ఆర్థిక స్వాతంత్ర్య సంపాదన-స్త్రీల వివాహ సమస్యలకు ప్రధాన పరిష్కార మార్గం

“వివాహ వ్యవస్థలో ఈనాడు కనబడుతున్న అనేక లోపాలకు స్త్రీల ఆర్థిక అస్వాతంత్ర్యానికి విడదీయరాని సంబంధం ఉంది. స్త్రీ ముఖ్యంగా ఆర్థిక స్వాతంత్ర్యం సంపాదించాలి. తన కాళ్ళమీద తాను నిలబడి తన కుటుంబాన్ని పోషించగలుగుతాననే ధీమా ఉండాలి. ఆనాడు వరకట్నాలు, ఝంఝూమారుతానికి విచ్చిపోయే పెనుమబ్బుల్లా పారిపోతాయి.” అని ఈ వ్యాసంలో శ్రీమతి డి. సూర్యకాంతమ్మగారు తెలియజేస్తున్నారు.

శ్రీమతి డి. సూర్యకాంతమ్మ

ప్రపంచంలో అందుకే భారతదేశాన్ని చూస్తుంటే మధ్య. ధనిక కుటుంబాల్లో స్త్రీలు సోమరితనానికి ప్రతినిధులా అనిపిస్తోంది. కారణం: వీరికి ఆర్థికస్థితిపైన దృష్టే చూరవారిది పురుషుడు సంపాదించాలి, స్త్రీ యింట్లో సకల సుఖాలు అనుభవించాలి అనేదే వీరి ధ్యేయం. పేదరికంతో బాధపడే ఒక స్త్రీని చూచి ఏమమ్మా కుటుంబపోషణార్థం ఏ చేతి పనో చేసి చన్నీళ్ళకు వేణ్ణీళ్ళు అన్నట్లు మగవానికి సాయపడితే యింతకష్టం వుండదుగా" అని ప్రశ్నించారనుకోండి. ఆమె సమాధానం "నేనేం చెయ్యనండీ ఆడదాన్ని రచ్చకెట్లా ఎక్కేదీ" అంటుంది. అది ఆమె తప్పుకాదు లెండి. అసలు ఆడపిల్ల పుట్టగానే తండ్రి అనుకొంటాడు, దీన్ని ఏ కలవానికో ఏ పెద్ద అధికారికో పెండ్లి చేస్తే తనబాధ్యత తీరిపోతుందనుకొంటాడు. కాని తన కు కొడుకు పుట్టిననాడు కనే కమ్మని కలలు మచ్చుకొకటైనా కనడు. అతని దృష్టి మొగపిల్లల భావి వధువులమీదే విహరిస్తుంది, అతడి ప్రయత్నం, శ్రమ, ధనం అంతా అందుకే వుపయోగపడతాయి.

తీరా ఆడపిల్లకి ఏ ఎలిమెంటరీకోర్సో లేక హైస్కూలు వున్న వూరైతే రెండు మూడు ఫారాల్తో అంతగా చదువుమీద వ్యామోహమున్న పిల్లయితే స్కూలుఫైనలు ప్యాసో ఫెయిలో అంతే. అంతటితో చదువుకు స్వస్తి. ఇక ఆ పడుచుల వూహాసౌధాలు స్వార్థం అనే పునాదుల్తో ప్రారంభమౌతాయి. అణకువ, పెద్దలయందు గౌరవం. సాంఘిక సంస్కారణ ధైర్య స్థైర్యాలు ఇవేమీ వంటబట్టవు (అంటే అందరికీ కాదు 75% కన్యలను గూర్చే వ్రాస్తున్నాను.)ఇక ఆడంబరాలు, అతిప్యాషన్లూ చౌకబారురచనలుగలనవలాపఠనము దానికితగ్గ సినీ ప్రదర్శనం ఇవి వీళ్ళ నిత్యకృత్యాలవుతాయి. వరాన్వేషణకు మొదలెడతాడు తండ్రి. తనకు అల్లుడయేవాడు రూపంలో మన్మధుడు, ధనంలో కుబేరుడు కావాలని కోరుతాడు ఆ రెండూ వున్నా యింకా వాళ్ళ అటో ఏడు తరాలు ఇటు ఏడు తరాలు అందులో ముఖ్యంగా స్త్రీలు మంచివారేనా? లేక తప్పితారి వాళ్ళ సాంఘిక కట్టుబాటుల్ని అధిగమించి స్వతంత్రంగా జీవిస్తున్నారా? అని చూస్తారు పురుషులైతే అంతపట్టింపు ఉండదులెండి. మన కుళ్ళిపోయిన సంఘంలో అంతా స్త్రీల నెత్తిమీదే వుంటుంది సాంఘిక మర్యాద అంతా. అదైనా లోలోపల ఏమిచేసినా పైకిమాత్రం యీ కట్టుబాట్లు వుల్లంఘించనట్లు నటించాలి, అదీ నేటి కన్యాదాత అభిప్రాయం,

పైవిషయాలన్నీ బాగున్నాక మరి కట్నం లేకుండా వరుడు రావాలంటే సాధ్యమేనా? భగవంతుడు ప్రత్యక్షం కావాలంటే మన పురాణాల్లో వ్రాసిన కథల్లో భక్తులు ఎంతెంత త్యాగం చేశారు. రావణాసురుడు తన తలకాయల్నికోసి హోమం చేశాడట బ్రహ్మసాక్షాత్కారానికి. ఎండనక వాననక, ఆకలి, దప్పిక వదలిపెట్టి అహోరాత్రాలు ఎన్నో శతాబ్దాలుగా ఘోరతపంచేశాడు.హిరణ్యకశ్యపుడు, శైశవంలోనే అనేక కష్టాలకు తట్టుకొని భగవత్సాక్షాత్కారం పొందేడు ధ్రువుడు. క్రీస్తు శిలువకు గురయ్యాడు.బుద్ధుడు రాజ్యాన్ని, అందమైన భార్యని అసందమైన బిడ్డని వదలి దైవశక్తికొరకు సన్యసించాడు. ఇట్లాంటి గాథలు పురాణాల్లోనేకాక నిత్యం మన కళ్ళఎదుటే జరుగుతున్నాయి.

అట్లాంటివారు తమకోర్కెల నిమిత్తం అంతంత త్యాగాలుచేశారేయీనాడు తమ వాంఛితాన్నిబట్టి వాటికి ప్రతిబింబాలైన అల్లుళ్ళను పొందటానికి గృహస్తి కెందుకింతబాధ పోనీ తనదగ్గర ధనంలేదు. కట్నాలివ్వ లేదు. అందుకు తమకోర్కెల సోపానాల్లో కొన్నిటిని తగ్గించుకోవచ్చుగాని అప్పుడు వరకట్నాల ప్రసక్తే రాదు. ఐదోతరగతి చదివిన ఆడదాన్ని ఐ. ఏ. యస్. చదివిన మగవాడు లక్షణంగా పెండ్లాడుతున్నాడుకదా! అట్లాగే పెద్ద చదువులు చదివిన స్త్రీలు సామాన్య విద్యావంతుణ్ణి ఎందుకు వివాహం చేసుకోకూడదు? అట్లాంటప్పుడు వరకట్నాలే వుండవు. పోనీ తన కుమార్తెవివాహంలో కొంతవరకైనా కట్నం తగ్గుతుందేమోనని కుమార్తెను ఏ బి.ఎ. వరకో చదివిస్తాననుకోండి తండ్రి. అప్పు డాదొరసానమ్మగారికి ఎమ్. ఏ చదివినవాడో లేక ఏ ఫారిన్ డిగ్రీ పొందినవాడో రావాలికాని, ఏ సెకండరీ గ్రేడ్ టీచరో, ఏ తాలూకా ఆఫీసు గుమాస్తాయో నికిరాడు. ఇక కట్నాలెలా పోతాయి? ఈ భేదం గమనించిననాడే వరకట్నాలు పోతాయి.

పోయిన వేసవిలో మా దగ్గర బంధువుల యింట్లో ఒక విచిత్రవివాహం జరిగింది. పెండ్లికూతురు సెకండరీగ్రేడు పంతులమ్మ. ఆవిడగార్ని పెండ్లాడటానికని ఒక ఇంజనీరుగారు వచ్చారు, కట్నం ప్రసక్తే లేకుండా. పెండ్లికి ఒప్పుకున్నారు వుదారంగా. కాని ఆ ఇంజనీరు గారికి మనస్సైతే మంచిదేకాని శ్రావుమాత్రం నల్లగావుంది. ఏంచేస్తాడు అతడిపుట్టుకే పల్చని అట్టుతో ప్రారంభమైంది. కానీ. పెండ్లికూతురు, ప్రజా కీపల్చని శ్రావు పెండ్లికొడుకు నచ్చలేదు గారితరువాత ఒక నెలకు నొక్కునొక్కుల సింగుగల ఒక బి. యస్‌సి. స్టూడెంటు కాందమైన అబ్బాయి వచ్చాడు పెండ్లిమాపులకి, అబ్బాయికి ఐదువేల రూపాయల కట్నంతో పెండ్లిచేశారు. ఇక వరకట్నాలు పోవాలని గోలపెడితే మాత్రం ఎట్లాపోతాయి? ఆడపిల్లల్ని కన్నవాళ్ళు వరాన్వేషణలో ఏమాత్రం పొల్లుపోకుండా, కులం, గుణం, రూపం, విద్య, ధనం చూస్తారు పైగా ఎక్కువ మంచి కుటుంబస్తులైతే అమ్మాయి వాళ్ళ కందరకూ చాకిరీ చేయలేదు. అవిభక్త కుటుంబంలో భర్తమీద పూర్తి అజమాయిషీ వుండదు, అందుకు పెండ్లికొడుకూ ఒక్కడే సంతానమై వుండాలి. అన్నదమ్ము లుండరాదు. అక్కచెల్లెళ్ళు అసలేవుండరాదు అని కోరుకొంటారు. అంట్లాటప్పుడు కట్నాలసమస్య లెట్లా పోతాయి.

అదీకాక మనవాళ్ళు మొగపిల్లాడు పుట్టగానే "అమ్మయ్య ఇంటికి లాభం కూర్చేవాడే కాని నష్టము తెచ్చేవాడు కాదనుకుంటాడు, అంటే పుత్రోదయంతోపాటే కట్నాలకోరిక కూడా వుదయిస్తుంది వాళ్ళ హృదయాల్లో. చాలమంది స్నేహితుల్ని" మీకు ప్లస్‌లెన్ని మైనస్‌లెన్ని అని ప్రశ్నిస్తారు సంతానాన్ని గురించి. ప్లస్ అంటే మనదబ్బుతో పాటు కట్నంకూడా కలుపుతాడని, మైనస్ అంటే మన ధనంలో కొంత కట్నం రూపేణా తీసుకుపోతుందని అర్థం. ఇది వింటే నాకు చాలా ఆశ్చర్యమేసింది. చిన్నతనంలోనే తలిదండ్రులు కొడుకుల్ని ముద్దాడుతూ నా బాబు పదివేలు కట్నం తెస్తాడంటారు, కాస్త జ్ఞానం వచ్చాక "ఒరే మీ అత్తారు నీకేమిస్తార్రా? అని ప్రశ్నిస్తారు, అంతకుముందు వాడి కలవాటుచేసివుండడంవల్ల వెంటనే కుర్రాడు నాకు మా అత్తారు కారు యిస్తారు అంటాడు.అట్లాంటి కోరికల్ని ఆ లేత హృదయాల్లో చొప్పిస్తారు. అవే పెండ్లియీడు వచ్చేటప్పటికి చిలవలు పలవలు గల ఒక కోరికల వృక్షంగా తయారవుతుంది. ఒక్కొక్క సందర్భంలో తండ్రిని కొడుకు ఏ రిస్టువాచో సైకిలో, విలువగల బట్టలో కొనివ్వమంటాడనుకోండి "ఎందుకురా రేపు పెళ్ళిలో అత్తవారిస్తారు" అంటారు. తల్లి, మేనత్త తదితరులు ఎంత ఎక్కువ కట్నం తీసుకొంటే అంత గొప్పగా భావించేవారు ఎంతోమంది వున్నారు. ఒక సందర్భంలో మా చెల్లెలితో మా అబ్బాయికి కట్నం తీసుకోకుండా పెండ్లి చేస్తానన్నాను అంటే ఆవిడగారంటుంది "ఛీఛీ కట్నం లేకుండా పెళ్ళేమిటి అడుక్కు తినే వాళ్ళలాగు" అని.అంటే, కట్నం అడుక్కోవని, దాన్ని మేం తినదల్చుకోలేదుగా ఇక అడుక్కు తినేవాళ్ళ మెట్లాగౌతాం? అని సమాధానం చెప్పేసనుకోండి.

అదీ కాక, చదువురాని పిల్లలు, సౌందర్యహీనులైన పిల్లలుగల తలిదండ్రులు మితిమీరిన కట్నాలిస్తామని తద్వ్యతిరేకులై, కన్యల వివాహాలతో పోటీ చేస్తున్నారు. ఈ పరిస్థితిలో చిన్నప్పటినుండి నైతికంగా పతనం చెందిన ప్రస్తుత యువకులు, వివాహం అంటే అర్థం కానివారు. కేవలం సంతానోత్పత్తికి సేవ చేయటానికి ఎవరైతేమని. ఆ ధనానికిమాత్రం ప్రాముఖ్యత నిచ్చి అట్టివారినే వివాహం చేసుకొంటారు, వీరిలో మరొకభావంకూడ కలదు. అదేమంటే చదువుకొన్న భార్యలైతే విస్సన్న చెప్పిందే వేదమని భర్త ఏం చెప్పినా సిరసావహించదని. వారిలో కొంత పరిశీలనాశక్తి వుంటుందని భయం. విద్యావిహీనలైతే యీ బాధవుండదని అనుకొంటారు.

చైనావారు మనభూభాగాన్ని ఆక్రమించిన క్రొత్తలో ఒకామె నాతో అంది "వదినగారూ చైనావాళ్ళు తాడేపల్లిగూడెం వచ్చారటండీ అందులో నలుగుర్ని మన పోలీసులు పట్టుకొన్నారట. వాళ్ళని చూట్టానికి మీ తమ్ముడు గారు వెళ్ళారండీ' అంది. పాపం చైనావాళ్ళ మిటి? ఎక్కడవాళ్లు ఎక్కడికొచ్చినట్లు? అనన్నా ఆలోచించలేకపోయింది. ఆలోచించటానికన్నాకాస్తచదువు సంస్కారం,లోకజ్ఞానం వుండాలికదామరి, అట్లాంటి శుద్ధమొద్దు స్వరూపాలకి ధనరాసుల్తో కాకపోతే వివాహాలెట్లా అవుతాయి?

ప్రస్తుతం వరకట్నాలబాధ ఎట్లా పోతుందంటే ముందు వధువుగా రూపొందే కన్యలు మనోధైర్యం, లోకజ్ఞానం, సంస్కారం ఎక్కువగా సంపాదించాలి. కులభేదాలు, చదువుల్లో వ్యత్యాసాలు పాటించకూడదు. అసలు సంఘంలో సమత్వం ఐకమత్యం రావాలంటే అది మహిళల చేతుల్లోనేవుంది. అందుకని పెండ్లి కావలసిన కన్యలందరూ వాళ్ళ సంస్కారాన్ని స్వాతంత్ర్యాన్ని, వ్యక్తిత్వాన్ని తగిన పందాలో విలపెట్టుకొని కట్నం కోరిన వరుణ్ణి పెండ్లాడను అని ప్రతిన చెయ్యాలి. పైశక్తులు సంపాదించాలంటే స్త్రీకి ముఖ్యంగా ఆర్థిక స్వాతంత్ర్యం రావాలి. తన కాళ్ళమీద తాను నిలబడి తన కుటుంబాన్ని తాను పోషించగలననే ధీమావుండాలి. ఆనాడు వరకట్నాలు ఝంఝూ మారుతానికి విచ్చిపోయే పెనుమబ్బుల్లా వాటంతటవే పారిపోతాయి.

కాని ఎన్ని వుపన్యాసాలిచ్చినా సమయం వచ్చేటప్పటికి ఎవరూ చూడరులే. చూస్తే ఏ తల్లీమీదో భార్యమీదో యీ నెపం నెట్టివెయ్యవచ్చు. ఈ ఒక్క కుమారుని పెండ్లికి కట్నం తీసుకుందాం, లేక యీ ఒక్కకూతురు పెళ్ళికి కట్నం యిద్దాం అదే ధోరణి ప్రదర్శిస్తే అందరూ శ్రీ వైష్ణవులే బుట్టెడు రొయ్యలూ మాయమయ్యా యనే సామెతలా వుంటుంది.

రాజమండ్రి ఐ. ఎల్. టి. డి. కార్మికుల అసంతృప్తి

కార్మికులను తగ్గించి పనిభారం పెంచున్నందుకు ఆందోళన

రాజమండ్రి, జనవరి 25

“1960 సం॥ లో 3500 మంది కార్మికులు పనిచేస్తుంటే నేడు 2818 మంది మాత్రమే వున్నారు. గత మూడు సంవత్సరాలలో సుమారు 600 మంది పనికి రాజీనామా ఇవ్వడమో, అనారోగ్యముతో రిటైర్ కావడమో జరిగినది. ఈ వున్న సంఖ్యకైనా పని చెప్పక పోవడం ఏటా ఏటా పని రోజులు తగ్గిపోతున్నాయి. ఈ సభకు ప్రారంభములో కార్మికులు చేయాల్సిన పనులు బయట కంట్రాక్టరు ద్వారా చేయిస్తున్నారు” అని రాజమండ్రి పొగాకు కార్మికులు తమ తీవ్రతను తెలియచేశారు. జనవరి 19 న జరిగిన ఐ. యల్. టి. డి కంపెనీల కార్మికుల సమావేశానికి ప్రదేశ్ యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీ జి. యస్. బాలాజీదాస్‌గారు అధ్యక్షత వహించారు. ఈ డిపోలోగల రెండవ యూనియన్‌కు చెందిన శ్రీమతులు ఉప్పలూరి శేషమ్మ, కప్పల వీరమ్మ, చెల్లే కన్నమ్మ, శ్రీయుతులు రాయుడు సుందర్రావు, ముత్యాల ఎల్లయ్య, పోలారపు గురయ్య, దుంగా రాములు గార్లు కూడా హాజరై అందరు కలిసి కంపెనీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను మాన్పించుటకై కృషిచేయాలని తమ అభిలాషలు తెలియజేశారు. సభకు వివిధ గ్రామాల, పేటలనుండి వందమంది హాజరయ్యారు.

ప్రారంభంలో అధ్యక్షులు శ్రీ జి. యస్. బాలాజీదాస్ ఉపన్యసిస్తూ కేంద్ర త్రైపాక్షిక సమావేశాలలో కాంట్రాక్టు విధానం రద్దుగావాలని నిర్ణయాలు చేస్తూంటే, కార్మికులుచేయు ప్రతి పనిని బయట కాంట్రాక్టర్లద్వారా ఫ్యాక్టరీ ఆవరణలోనే పనులు చేయించడం, వందలాది పనివారు బయటవుండటం క్రమవిరుద్ధ చర్య కాగలదన్నారు. ఒకవైపు 5000 మంది డిపోల మూతద్వారా నిరుద్యోగం, మరియొకవైపు బయట కాంట్రాక్టర్లచేపనులు పూర్తిచేయించి పనివారలపనిరోజులుతగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతూన్నాయి. మగవార్ని తగ్గించడం, ఆడవారిచే పనిభారం పెంచేందుకూ కూడ కృషి జరుగుతున్నదన్నారు. కంపెనీ యీ విధానాన్ని వెంటనే ఆపకపోతే కార్మికులలో తీవ్ర అసంతృప్తి ఏర్పడగలదని హెచ్చరించారు.

బ్రాంచి ఉపాధ్యక్షులు. చాట్ల దేవదాసు, సంయుక్తకార్యదర్శి చిట్టిరాజుగార్లుమాట్లాడారు.

కార్యదర్శి శ్రీ యాళ్ళ ఆనందంగారు యీ క్రింది తీర్మానమును ప్రవేశపెట్టగా శ్రీమతి వాసాచిన్నమ్మగారు బలపర్చారు. తీర్మానములు ఏకగ్రీవంగా ఆమోదింపబడ్డాయి.

సీజను ప్రారంభమౌతున్నందున మరియొక మూడు గ్రూపుల మగ కార్మికులకు పనులు కల్పించాలి, యూనియన్‌తో ఒప్పందం లేకుండా పని విధానము మార్చకూడదు, కార్మికులకు వైద్య పరీక్ష, వార్ని బాగుచేయుటకే చేయాలి గాని పనినుండి ఉద్వాసనం చెప్పుటకు చేయకూడదు, బోనసు తగ్గించరాదు, కరువు పరిస్థితులను బట్టి కరువుభత్యం సీలింగు లేకుండా జీవన ప్రమాణానుగుణ్యంగా యివ్వాలి పని భారం పెంచరాదు. పని రోజులు కనీసం 4 మాసాలు తక్కువ కాకుండా అందరికీ పనులు కల్పించాలి.

ఈ నెల 18 వ తేదీన తేతలిలో కాపుక్షీ రజత, సువర్ణవస్తు నిర్మాణ సంఘం సప్తమ వార్షిక సభ జరిగింది, శ్రీ చోడవరపు రాఘవాచారి ప్రతినిధుల సభకు అధ్యక్షత వహించారు. శ్రీ సుగంధం వెంకటేశ్వరరావు అధ్యక్షులుగా, శ్రీ అరెపాక నరసింహారావు కార్యదర్శిగా నూతన సంవత్సర కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.

కమ్యూనిస్టు పార్టీకి కష్టజీవుల శ్రమదానం

కోవూరు, జనవరి 24

నెల్లూరు జిల్లా, కొవ్వూరు టవును లో కమ్యూనిస్టు పార్టీ నిధికిగాను జనవరి 18 న కాలేగుంట, పల్లెపాలెం వ్యవసాయ కార్మికులు మొత్తం 25 మంది వరికోత కోసి వచ్చిన డబ్బు 60 రూపాయలను కమ్యూనిస్టు పార్టీకి కానుకగా యిచ్చారు.

జనవరి 22న కోవూరులోని కమ్యూనిస్టు పార్టీ సానుభూతి పరులైన వ్యవసాయ కార్మికులు 10 మంది, తూర్పు అరుంధతీయవాడ వ్యవసాయ కార్మికులు 50 మంది కలసి వరికోత కోసి తద్వారా వచ్చిన మొత్తం రూ. 140/- లలో 50 రూపాయలు తూర్పు అరుంధతీయవాడ కార్మికులు మనిషికి 1 రూపాయ వంతున తీసుకొని, మిగిలిన రు. 90/-లు పార్టీ నిధికి యిచ్చారు.

కోవూరుకు సంబంధించిన యింతవరకు మొత్తం రు. 150/- లు వరికోత ద్వారా వ్యవసాయ కార్మికులు పార్టీనిధికి సమర్పించారు.

ప్రదేశ్ హోమ్యోపతిక్ అసోసియేషన్ కార్యవర్గం

గుంటూరు, జనవరి 20

ఆంధ్రప్రదేశ్ హోమియోపతిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ 31 వ వార్షిక సమావేశం యిక్కడ జరిగినది. హోమియోపతి వైద్యుల రిజిస్ట్రేషన్లు ప్రభుత్వం సదా సాగించాలనీ, బోర్డు పరీక్షలు ప్రతిసంవత్సరము రెండుసార్లు జరపాలనీ, బోర్డు ఏర్పడిన నాటినుండి ప్రభుత్వము మూడుసార్లే పరీక్షలు జరిపినది. నేడు పరీక్షలలో తప్పినవారికి ఇక మూడుసార్లు ఛాన్సుఇవ్వాలనీ తీర్మానించారు. ఆంధ్ర, తెలంగాణా చట్టాలను సమన్వయపరచి హోమియోబోర్డును ప్రత్యేకముగా నిర్మించాలనీ, గ్రామాలలో వెంటనే ప్రభుత్వపు హోమియో వైద్యశాలలు ఏర్పరచి 'బి' క్లాసు వైద్యులను నియమించాలనీ కూడా వారు తీర్మానంలో కోరారు.

ఆంధ్రప్రదేశ్ హోమియో మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్‌కు 1963-64 సం॥ నకు అధ్యక్షులుగా శ్రీ గాదిరాజు వెంకటేశ్వరరావు(విజయవాడ). ఉపాధ్యక్షులుగా శ్రీయుతులు టి. వి. రమణయ్య (కావలి), సి. కృష్ణమూర్తి (గుంటూరు). ప్రధాన కార్యదర్శి, కోశాధికారిగా శ్రీ వి. టి. కృష్ణయ్య (అరగొండ, చిత్తూరు), సహాయ కార్యదర్శులుగా శ్రీయుతులు జె. ఎస్. ఎల్. నరసింహారావు (చిలకలూరుపేట). జి. నాగేశ్వరరావు (విశాఖపట్నం) ఎన్నికయ్యారు.

రజతోత్సవసభలు మార్చిలో విజయవాడలో జరపాలనీ తీర్మానించారు.

అనంతపురం జిల్లా తాడిపత్రి రాయలసీమ సాహితీ సమితి ఆధ్వర్యమున జనవరి 18 న శ్రీ వి. చెన్నకేశవులు (తాడిపత్రి తహసీల్దారు) గారి అధ్యక్షతను జరిగిన సభలో శ్రీ వల్లంకొండ వెంకటలక్ష్మయ్య కవి గారిచే వ్రాయబడిన శ్రీ మద్దిరాల చిన్నారాయణరెడ్డి గారి గంగిరెడ్డి ధనసహాయంచే తాడిపత్రి రాయలసీమ సాహితీ సమితి ద్వారా ప్రచురించబడిన "తిరుపతియాత్ర" (గేయకావ్యము)ను శ్రీ జోస్యం జనార్దనశాస్త్రి ఆవిష్కరించారు.

మహిళల నేటికర్తవ్యం

విద్య, ఉద్యోగం, వివాహం, వారసత్వం మొదలైన అనేక సమస్యలు స్త్రీలకు ఉన్నాయి. ఇందులో వివాహసమస్య గురించి జనవరి 14 వ తేదీ సంచికలో శ్రీమతి వై. తాయారమ్మగారు చర్చ ప్రారంభించారు. ఈచర్చను వచ్చేవారంతో ముగించుతున్నాం.

ఇదే సంచికలో శ్రీమతి వేములపల్లి విమలాదేవిగారు వ్రాసిన వ్యాసం కూడా ప్రచురించుతున్నాం. ఈ వ్యాసంపై చర్చ పరిమితికే కట్టుబడకపోయినప్పటికీ, ఇందులో రచయిత్రి వెలిబుచ్చినఅభిప్రాయాలు స్త్రీలు చర్చించ దగినవి. అందుచే ఈ వ్యాసంపై వచ్చేవారంనుండి ప్రత్యేక చర్చ ప్రారంభిస్తున్నాం.

"మహిళల నేటికర్తవ్యం" అన్న అంశంపై సోదరీమణులు తమ అభిప్రాయాలను పంపి ఈ చర్చలో పాల్గొనవలసిందిగా కోరుతున్నాం.

వివాహ విధానం: లోపాలు

వచ్చేవారం చర్చ ముగింపు

విజయవాడలో సాంస్కృతిక మహాసభలు

విజయవాడ, జనవరి 24

స్థానిక వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయ సంఘ కార్యదర్శి శ్రీ ఉసిరిక జగన్మోహనరావుగారిలా వ్రాస్తున్నారు:

1964 మార్చి 1 వ తేదీన జరిగే వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయ నూతన ఆడిటోరియం భవనం ప్రారంభోత్సవం, మార్చి 4 వ తేదీ నుండి 8 వ తేదీ వరకూ జరిగే ఆంధ్ర సాంస్కృతిక మహాసభల నాలుగవ వార్షిక నాటక, నాటిక ఏకపాత్రాభినయాల కళోత్సవాలను పురస్కరించుకొని మనప్రాచీన ఆధునిక భారత సాంస్కృతిని ప్రతిబింబించే వివిధ కళారూపాలనుసేకరించి ప్రదర్శించేందుకు నిశ్చయించాం.

ఈ ప్రదర్శన మార్చి 1 వ తేదీ నుండి 8 వ తేదీ వరకూ జరుపదలచాం. ఈ కళా ప్రదర్శనాన్ని ప్రారంభోత్సవం చెయ్యడానికి ప్రఖ్యాత ఆంధ్ర చిత్రకారులు శ్రీ సంజీవ్‌దేవ్ గారిని ఆహ్వానిస్తున్నాం. ఈ ఎనిమిది రోజులు జరిగే ఉత్సవాలకు ప్రముఖ రచయితలను, ప్రఖ్యాత చిత్రకారులను, విద్యావేత్తలను, పత్రికా సంపాదకులను, ఔత్సాహిక కళాకారులను వివిధ రంగాలలోని ప్రముఖులను, అమాత్యులను ఆహ్వానిస్తున్నాం.

ప్రతిదినం ప్రదర్శనాన్ని చూచి ఆనందించే 5000మందికళాభిలాషులకు ఈ ప్రదర్శనచూచే అవకాశాన్ని కలిగించేందుకు. చిత్రకారులు, తాము చిత్రించిన రూపరేఖా చిత్రాలను, పుస్తక ప్రకటన కర్తలు, తాము ప్రకటించిన వివిధ ప్రాచీన అధునాతన సాంస్కృతిని ప్రతిబింబించే పుస్తకాలను, ఫొటోగ్రాఫర్లు తాముతీసిన భారత ప్రాచీన ఆధునిక ప్రతిబింబరూపఛాయా చిత్రాలను, వివిధ కళాఖండాలు సేకరించే కళాభిమానులు. తాము సేకరించిన కళాఖండ రూపాలను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసి ఈ మా మొదటి ప్రయత్నాన్ని విజయవంతం చేయుటకు మాతో సహకరించవలసిందిగా కోరుచున్నాం.

ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసే తమ తమ చిత్రాలకు, ఫొటోలకు కళా ఖండాలకు, వాటి వివరాలు, వ్రాసి అంటించి, ఫిబ్రవరి 20 వ తేదీకి మాకు చేర్చితే, మళ్ళీ తిరిగి మార్చి 10 వ తేదీకల్లా భద్రంగా ఎవరి వస్తువులు వారికి చేర్చబడతాయి. కాన, తమ తమ చిత్రాలు ఫోటోలు, పుస్తకాలు, కళాఖండాలు ఈ క్రింది అడ్రసుకు చేర్చమని మనవి చేస్తున్నాం. ఈ ప్రదర్శనలో బైట వూరి పుస్తక ప్రచురణ కర్తలు, కళా ఖండాలు ప్రదర్శించే ప్రదర్శకుల ప్రతినిధులకు, కాఫీ, భోజన వసతి సమకూర్చబడును. కళాభిమానులు ఈ ఎనిమిదిరోజులు జరిగే ఉత్సవాలలో పాల్గొని ఉత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయుటకు మాతో సహకరిస్తారని ఆశిస్తున్నామని తెలియజేస్తున్నారు.

ప్రదర్శన వస్తువులు, కళాఖండాలు చేరవలసిన అడ్రస్, "కార్యదర్శి శ్రీ వెలిదండ్ల హనుమంతరాయగ్రంథాలయం విజయవాడ-3"

భవననిర్మాణ, గ్రంథాలయ సంఘాల సమావేశం

గ్రంథాలయకమిటీ, భవననిర్మాణ కమిటీ, దాతల, అభిమానుల సంయుక్త సమావేశం ఇటీవల శాసనసభ్యులు శ్రీ టి. వి. యస్. చలపతిరావుగారిఅధ్యక్షతనజరిగింది. ఈ సమావేశానికి పట్టణ వాణిజ్య ప్రముఖులు, పెద్దలు, కళాభిమానులు హాజరయ్యారు.

నూతన ఆడిటోరియం భవనం పూర్తి అయినసందర్భాన్ని పురస్కరించుకొని దాతల, అభిమానుల గౌరవార్థం అల్పాహార విందు జరిగింది.

భవన నిర్మాణ సంఘ కార్యదర్శి శ్రీ శాస్త్రి గారు యిప్పటివరకూ జరిగిన నిర్మాణ కార్యకలాపాలను సమీక్షించారు.

గ్రంథాలయ కమిటీ కార్యదర్శి శ్రీ ఉసిరిక జగన్మోహనరావుగారు, మాట్లాడుతూ మార్చి 1 వ తేదీన నూతన భవనం ప్రారంభించేందుకు మూహూర్తం నిశ్చయించబడిందని ఇంతవరకూ ఆడిటోరియం భవనం నిర్మాణం మాత్రమే. పూర్తి అయిందని గ్రంథాలయ విభాగం పూర్తి కావలసి వుందనీ తెలిపారు.

ఈ సమావేశంలో ఈ క్రింది దాతలు తమ విరాళములను ప్రకటించారు. కీ॥ శే॥ తుమ్మల కుటుంబరావుగారి జ్ఞాపక చిహ్నంగా వారి అల్లుడు. శ్రీ వర్షనేని శేషగిరిరావుగారు రు. 1116 లు, శ్రీ కనిగిచర్ల శేషయ్యగారు రు. 251 లు, శ్రీ పెమ్మరాజు సుబ్బారావుగారు రు. 251 లు, శ్రీ మాకినేనిసాంబశివరావుగారు (గ్రంథాలయకమిటి వుపాధ్యక్షులు) రు. 251లు, సుపకాంత్ ఎగ్రికల్చరల్ అండ్ కమర్షియల్ కార్పొరేషన్ వారు రు. 251 లు.

స్త్రీల సమస్యలకు పరిష్కారం సోషలిస్టు సమాజంలోనే సాధ్యం

శ్రీమతి వేములపల్లి విమలాదేవి

శ్రీమతి తాయారమ్మగారు జనవరి 14 విశాలాంధ్రలో వ్రాసిన వ్యాసం చదివాను అయితే వారు తమ వ్యాసం ద్వారా వెలిబుచ్చిన దేమిటో స్పష్టంగా అవగాహన కాలేదు. సమాజంలో స్త్రీలకు చాలా అన్యాయం జరుగుతోందనీ, సమాజం డబ్బుకే ప్రాధాన్యత యిచ్చి మానవత్వమునకు, ప్రేమకు విలువలను యివ్వటంలేదనీ, బాధ వెలిబుచ్చారు. రాజా రామ్‌మోహన్‌రాయి, కందుకూరి వీరేశలింగం మొదలైన సంస్కర్తలెంతో కొనియాడదగిన సేవజేశారన్నారు. అనాధ శరణాలయాలు, హితకారిణీ సంఘాలు, స్థాపించబడి కష్టాల్లో వున్నవారికి-ముఖ్యంగా నిర్భాగ్య మహిళలను ఉద్ధరించే కృషిజరుగుతోందనీ వ్రాశారు.

సంతోషమే జరిగిన సంగతులను, జరుగుతూవున్న సంగతులను, చరిత్రలో మనకు కనిపించిన వాటిని మరల యింకోసారి మన దృష్టికి తెచ్చారు. అయితే తాయారమ్మగారు చెప్పదలుచుకున్న దేమిటో స్పష్టంగా చెప్పలేక పోయారని నాఅభిప్రాయం. ఇందుకు కారణం తాము లేవనెత్తిన సమస్యలపై తమకే సమగ్రమైన అవగాహన, పరిష్కారమార్గము తెలియక అలా వదలి వేశారనుకుంటున్నాను. అందరూ యీ విషయంపై దృష్టిసారించి, చర్చలు జరిపి, పరిష్కార మార్గాలు వెతకాలని వ్రాశారు. కానీ వారుగూడా తమ సూచనలను. పరిష్కార మార్గాలను సూచించివుంటే బాగుండేదని భావిస్తున్నాను.

శ్రీమతి తాయారమ్మగారు లేవనెత్తిన విషయాలనునేను చర్వితచర్వణం చేయదలచలేదు స్త్రీలకుగల యిబ్బందులు తొలగి, స్త్రీ, సమాజంలో పరిపూర్ణ వ్యక్తి కాగలగాలంటే, సోషలిస్టు సమాజంలోనే అది సాధ్యమవుతుంది. ఈ పెట్టుబడిదారీ - భూస్వామ్య ప్రభుత్వహయాములో అది సాధ్యంగాదు. సాధ్యమవుతుందని భ్రమించడం ఆత్మవంచనే అవుతుంది. పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థలో డబ్బుకే ప్రాధాన్యత. స్త్రీ, పురుషులనే విచక్షణలేకుండా యీ డబ్బులేనివారందరూ యీ సమాజంలో సుఖముగా బ్రతకడానికి అవకాశంవుండదు. అలా అందరికీ అన్ని సౌకర్యాలూ సమానంగా అందుబాటులోవుండగలిగేట్లు యీ ప్రభుత్వం చేయగలిగితే యిది పెట్టుబడిదారీ సమాజమే అవదు. అది సోషలిస్టు ఆర్థికవ్యవస్థగల సమాజమే అవుతుంది. మన దేశం, ప్రస్తుతం పెట్టుబడిదారీ - భూస్వాముల చేతుల్లో వుంది. వీరు సోషలిజాన్ని స్థాపిస్తామని చెబుతున్నారు. వీరు చెప్పేది ఎవరూ నమ్మవలసిన పనిలేదు. అది జరిగేది కాదు. తమవర్గ హక్కులను. స్వార్థాలను ఎవరూ పరిత్యజించరు. ఇది చరిత్ర చాటిన సత్యం.

కాబట్టి మనం వాస్తవాన్ని మరువరాదు. విషయాలను పైన తడిమిమాత్రే లాభంలేదు. పునాదులలోవున్న లోపాలను మనం తెలుసుకున్నపుడే అసలు సత్యం బయటపడుతుంది అప్పుడే మన కర్తవ్యాన్ని తెలుసుకోగలుగుతాం. వాస్తవాన్ని తెలుసుకోడానికే యింత ప్రయాసపడుతున్నామంటే. మనం ఈ పెట్టుబడిదారీ భూస్వామ్య సమాజాన్ని. సోషలిస్టు సమాజంగా ఎలా నిర్మించుకోగలుగుతామా అని ఆందోళన పడాల్సివస్తోంది. అందుకే మనం ముఖ్యంగా ఈ సమస్యలపై సమగ్రమైన సమాధానాన్ని తెలుసుకోవలసి వుంటుంది.

ఇప్పటికే ప్రపంచములో కొన్నిచోట్ల (సోవియట్ యూనియన్, చైనా, తూర్పు యూరప్ దేశాలు) సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ ఏర్పడివుంది. ఆ దేశాల్లో మనం కోరుకునే సమాజం ఏర్పడివుంది. అక్కడ స్త్రీలకూ పురుషులకూ, విద్య వైద్య సౌకర్యాలు, ఉద్యోగంగ్యారంటీ - ఒకమనిషి పుట్టినప్పటినుండి. చనిపోయేవరకూ ఎవరు ఎట్టి ఆందోళనలు పడకుండా సర్వస్వమూ ప్రభుత్వమే హామియిచ్చి కాపాడుతూంది.

శ్రీమతి తాయారమ్మగారు కేవలం ఒక మధ్య తరగతి కుటుంబాలనే దృష్టిలో పెట్టుకొని వ్రాసినట్లున్నారు. మొత్తం సమాజంలోని అన్ని వర్గాలలోని స్త్రీలకూ, పురుషులకూ - ముఖ్యంగా పేదవర్గాలకు - జరిగే అన్యాయాలను, లోపాలనూ చూపించలేదు. మన పెట్టుబడిదారీ సమాజంలో ధనిక మధ్యతరగతి కుటుంబాలలో వివాహ పద్ధతిలోని లోపాలవల్ల అనేకరకములైన కష్టాలనుభవించటం, ఆత్మహత్యలు పాలుకావడం జరుగుతూవున్నమాట నిజం అయితే వ్యవసాయ కార్మికుల, పారిశ్రామిక కార్మికుల, తదితర నిరుపేదల స్థితితలచుకుంటే మరీదారుణంగా వుంది. వారు నిరుద్యోగానికి నిత్యమూ గురి అవుతూ, తిండిలేక యిల్లువాకిలి లేక ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకోవడం, రోడ్లలతో, రోజూ చావడం రోగాలపాలయి వస్తు వెంబడిచావడ వగైరాలన్నిటినీ దృష్టిలో పెట్టుకొని చూస్తే మన సమాజంయొక్క దౌర్భాగ్య స్థితి మనకు స్పష్టముగా కనిపిస్తూనేవుంది.

ఈ ప్రభుత్వ విధానాలతో మనయీసమాజ పరిస్థితి బాగుపడదు. సోషలిస్టు సమాజంలోనే అది సాధ్యమవుతుంది. అందుకే సోషలిస్టు సమాజాన్ని మనం కోరుకుంటున్నాం. కోరుకున్నంత మాత్రాన మనధ్యేయం నెరవేరదు. ఆ సమాజ వ్యవస్థను యేర్పరచుకోడానికి మనమంతా బాధ్యతను గుర్తించిమహిళలందరూ ఎక్కువ చైతన్యంతో కృషిసాగించాలి. ఈ పెట్టుబడిదారీ భూస్వామ్య వ్యవస్థలో ఇక్కట్లపాలయేది ప్రధానంగా మహిళలే. కనుక మహిళలు ప్రధానపాత్రవహించటం అవసరం. మనంఅంత చైతన్యవంతంగా లేమని చెప్పటానికి నేను బాధపడుతున్నాను. అలా అని నిరాశపడితే లాభంలేదు. మన హక్కుల కోసం మన దేశంలో అనేకమంది అభివృద్ధికాముకులు ప్రజావుద్యమాలను అనేక రీతుల్లో నడుపుతున్నారు. అట్టివారికి అట్టి ప్రజావుద్యమాలకు మనం తగినంత ప్రోత్సాహాన్ని యివ్వాలి. ముందు మనం చేయాల్సిందేమిటంటే 1. స్త్రీలందరికీ వుచిత వున్నత విద్య నభ్యసించడానికి అవకాశాలు కల్పించాలనీ, 2. విద్యాభ్యాసానంతరం వుద్యోగాలు గారంటీ చేయాలనీ, 3. నిరక్షరాస్యలకుగూడా తగిన జీవనభృతి కలిగించాలని. 4. చట్టరీత్యా పురుషులతో సమానంగా స్త్రీలకుగూడా ఆస్తిపై వారసత్వపుహక్కు కలిగించాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలి. ఇందుకొరకు ఆందోళన సాగించడం వుచితంగా వుంటుందని భావిస్తున్నాను. ఈ హక్కులను పొందగలిగితే స్త్రీల కష్టాలు తొలగినట్లే. ఈ కార్యక్రమం మహిళాసంఘాలు చేబట్టాలని నా అభిప్రాయం

కాకినాడ పట్టణ స్వర్ణకార సభ

కాకినాడ, జనవరి 25

కాకినాడ స్వర్ణకారుల మహాసభ జనవరి 23 వ తేదీన అన్నదాన సమాజం హాలులో శ్రీ పట్నాల సత్యనారాయణమూర్తిగారి అధ్యక్షతను జరిగింది.

ప్రదేశ్ స్వర్ణకారుల సంఘం ప్రధాన కార్యదర్శి. శ్రీ గానాల రాధాకృష్ణయ్య శ్రీ మర్లాడి స్వామి, శ్రీ పంపన్న వెంకట్రావు గార్లు మాట్లాడారు.

ప్రభుత్వంవారు జారీచేసిన సర్టిఫికెట్లను, స్వర్ణకారులు సద్వినియోగం చేసుకోవాలని, సర్టిఫికెట్లు అందులో జరిగిన జాప్యానికి తగిన కాలవ్యవధి యిప్పించాలని తీర్మానించారు.

ఫిబ్రవరి 15 వ తేదీన కాకినాడలో తూర్పుగోదావరిజిల్లా స్వర్ణకారుల మహాసభ జరుపుటకు నిర్ణయించారు.

మోటూరుబ్లాక్ స్వర్ణకారసభ

మోటూరు బ్లాకు స్వర్ణకార మహాసభ శ్రీ చింతాడ సత్యనారాయణగారి అధ్యక్షతను జనవరి 20 న జరిగింది.

శ్రీ పాలకొల్లు రామకోటేశ్వరరావుగారు అధ్యక్షులుగా కార్యవర్గం ఎన్నికయింది.

రామచంద్రపురం తాలూకా సమావేశం

తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం తాలూకా స్వర్ణకారుల మహాసభ, డా॥ సందివాడ సత్యనారాయణరావు. యం ఎల్.ఎ గారి అధ్యక్షతను జరిగింది.

ప్రదేశ్ స్వర్ణకార సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ గానాల రాధాకృష్ణయ్యగారు సభను ప్రారంభించారు. శాసన సభ్యులు శ్రీ పాలచర్ల పనసరామన్న, పెదపాటి వెంకట్రావు (జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి) శ్రీ జె.బి. ఆనంద (ప్రిన్సిపాల్) తాలూకా స్వర్ణకార సంఘాధ్యక్షులు శ్రీ గారోజు లింగమూర్తిగార్లు ఉపన్యసించారు.

స్వర్ణకారుల యిండ్లకు పన్నులు రద్దు చేయాలనీ, పునరావాస సౌకర్యము వెంటనే కలుగజేయాలనీ తీర్మానించారు.

స్కూల్‌ఫైనల్ విద్యార్థులకు జరిమానాలు

కాకినాడ, జనవరి 28

తూ. గో. జిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘవర్కింగ్‌కమిటీ మెంబరు, శ్రీజి చిట్టెమ్మ గారు యిలా వ్రాస్తున్నారు.

ఇదివరలో స్కూల్‌ఫైనల్ పరీక్షకు ప్రత్యేకంగా కూర్చునేవారు దానికి సంబంధించిన ఫారాలు, సర్టిఫికేట్లు అన్నీ సరాసరి ఎస్.ఎస్.ఎల్.సి బోర్డుకు పంపుకునేవారు. ఫలితాలు ప్రకటించిన వెంటనే ఆయా అభ్యర్థులు వారి సర్టిఫికేట్లు చూసుకొని పరీక్షలు పూర్తిచేసేవారు, జరిమానాలు లేకుండా ఫీజు చెల్లించి తరువాత పరీక్షకు మామూలు ఫారములు పూర్తిచేసి యథావిధిగా కూర్చునేవారు.

కాని అత్యవసర పరిస్థితులలో పొదుపుతనమంటూ పెట్టారు. విద్యార్థులైతే ఇదివరలో తాము చదివిన స్కూళ్ళ ద్వారాను. ఉపాధ్యాయులైతే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ల ఆఫీసుల ద్వారాను యథారీతిలో ఫారములు డి. ఇ. ఓ. ఆఫీసు ద్వారా ఎస్. ఎస్. ఎల్.సి.బోర్డుకు పారములుపంపాలన్నారు. 1963 అక్టోబరు పరీక్షకు కూర్చున్నవారు పరీక్షలో తప్పితే 1964 మార్చికిగాని కూర్చోదలిస్తే 1964 జనవరి 15 వ తేదీలోపుగా జరిమానా లేకుండగను, 20 వ తేదీలోపునైతే జరిమానాతోను ఫీజు చెల్లించాలని స్కూలుఫైనలు ఫలితాలు రాకముందే పత్రికలలో ప్రకటన పడింది, ఫలితాలు ఆలస్యంగా వచ్చాయి.

కాని వెంటనే సర్టిఫికేట్లు రాలేదు. సరాసరిగా అయితే ఎవరివారి సకాలంలో అందివుండేవి. బోర్డునుండి అంచీలుపై వచ్చేటప్పటికి ఈ నెల 18 వ తేదీన సంతకములు పెట్టి సర్టిఫికేట్ల తీసుకోవడం జరిగింది.

అసలే అధిక పన్నులతోను, ఆర్థికబాధలతోను గడుపుతున్న ఈ నికృష్ట జీవితంలో పొదుపరితనమంటూ చేసిన ఈ మార్పువలన తల్లిదండ్రులు తమ బిడ్డలకు జరిమానాతో ఫీజు చెల్లించుట జరిగింది. ఈ ఆలస్యమునకు కారకు లెవరో ప్రభుత్వం తెలుసుకొని ఇట్టి ఆలస్యం ఇకముందు జరుగకుండగ చూడవలెనని కోరుచున్నాము.

విజయవాడసీతన్నపేటప్రజల అవసరాల పట్ల మున్సిపల్ అధికారుల అలక్ష్యం

విజయవాడ, జనవరి 28

తాము చిరకాలంగా కోరుతున్నట్లు మరుగుదొడ్లు, పాఠశాల, ఏలూరు కాల్వకు మెట్లు కట్టించె విషయాలలో ఇప్పుడైనా మున్సిపల్ అధికారులు తమ అలక్ష్యం విడిచి వాటి నిర్మాణానికి పూనుకోవాలని కోరుతూ విజయవాడ సీతన్నపేట యువజనసంఘం తీర్మానించింది.

విజయవాడ సీతన్నపేట యువజన సంఘం సర్వసభ్య సమావేశం శ్రీ బోదంకి అప్పలస్వామి అధ్యక్షతన జనవరి 25 న శ్రీ ఎస్. ఏ. రావు గారి షాపులో జరిగింది, ఈ క్రింది తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడినవి.

యువజన సంఘ 16 వ వార్షికోత్సవం మార్చినెలలో జరపాలనితీర్మానించి, యిందుకై శ్రీ బోదంకి అప్పలస్వామి అధ్యక్షతన ఆహ్వాన సంఘమును ఏర్పాటుచేశారు.

అనేక సంవత్సరాలనుంచి సీతన్నపేట ప్రజలకు మరుగుదొడ్ల సౌకర్యం. కలిగించమని ఉన్న ఒక దొడ్డికాక మరొక రెండు దొడ్లు కట్టించాలని పేట ప్రజలు కోరుతూ వస్తున్నారు పేద ప్రజానీకం ఎక్కువమంది కావటం తమ యిండ్లలో మరుగుదొడ్లు కట్టించుకొనుటకు స్థలాలు లేక శక్తిలేక బాధపడుతున్నారు. ముఖ్యంగా స్త్రీలు విపరీతంగా బాధపడుతున్నారు. యీ సమస్యలను అనేక దఫాలుమునిసిపల్ అధికారులకు తెలియజేయడమైనది. అయినప్పటికీ మునిసిపల్ అధికారులు ఏమీ పట్టించుకోవడం లేదు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా అదనంగా రెండు మరుగుదొడ్లు కట్టించవలెనని మునిసిపల్ అధికారులను కోరుతూ ఒక తీర్మానం చేశారు.

ఏలూరు కాల్వకు సీతన్నపేట ప్రజల అవసరాలకు నీళ్ళు తెచ్చుకొనుటకు మెట్లరేవు కట్టించాలని అనేక సంవత్సరాలనుండి ఆందోళన చేస్తూ వచ్చారు. ఈ సమస్యను కూడా అధికారులు పట్టించుకోవటం లేదు. వెంటనే మునిసిపల్ అధికారులు ఏలూరు కాల్వకు మెట్లరేవు కట్టించాలని మరొక తీర్మానం చేశారు

సీతన్నపేట జంతానాక్ష్మల్ ప్రక్క ఖాళీ స్థలంలో పాఠశాల కట్టించాలనేది కూడా ఒక చిరకాల వాంఛ. పేటలోని చిన్నపిల్లలు యితర పేటలలో స్కూళ్ళకు వెళ్ళి చదువుకోవాల్సి వస్తున్నది. రోడ్ల రద్దీతో అనేక ప్రమాదాలు ప్రమాదాలు జరుగుతున్నాయి. తల్లిదండ్రులు భయపడి, తమ పిల్లల్ని పాఠశాలలకు పంపించటానికి భయపడుతున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు. పేట ప్రజల అభివృద్ధికోసం ఒక పాఠశాలను కట్టించాలని ఇంకొక తీర్మానం చేశారు.

రేడియో

బుధవారం, జనవరి 29
శక 1885 మాఘ 9

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 శుభోదయం; 6-35 ప్రసార విశేషాలు, 6-40 అం. వా; 6-45 భక్తిరంజని, 6-55 సూక్తిముక్తావళి, 7-00 తె. వా. 7-15 చతురంగం, 7-30 పాతాల సావిత్రిదేవి, 8-00 అం వా. 8-15 దేశభక్తి గేయాలు; 8-30 హైదరాబాద్‌వలె, 9-00 సమాప్తి.

మధ్యాహ్నం 10-40 రన్నింగ్ కామెంటరీ, 11-40 ఉన్నత పాఠశాలలకు, 12-10 ప్రకటించబడును, 12-20 గానసుధ 12-30 కార్మికుల కార్యక్రమం. 1-00 హై. వలె, 1-30 ఫిల్మ్ సంగీతం. 1.40 హిం. వా. 1-50 తె. వా; 2.00 క్రికెట్ కామెంటరీ, 2-25 సమాప్తి.

ప్రత్యేక ప్రసారం

3-00 క్రికెట్ కామెంటరీ; 4-40 సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు. 6-05 ప్రాం. వా. 6-15 నేటి విశేషం, 6-30 గ్రామస్థుల కార్యక్రమం; 7-00 తె. వా. 7-15 గ్రామస్థుల కార్యక్రమం; 7-30 నాగానందం - సంస్కృత నాటిక, 8-00 నాటిక (మ. రి.); 8-30 ప్రకటించబడును, 8.45 రేడియో న్యూస్‌రీల్, 8-55 ప్రస్తుతాంశం, 9-00 అం. వా; 9-15 ఆంగ్లమున, 9-25 మణిహారం, 9-30 రి. రిలే, 9-45 లలితసంగీతం. 10-00 పాతాల సావిత్రిదేవి, 10-30 అం. వా. 10-35 సమాప్తి - జనగణమన.

హైదరాబాద్ - ఎ

405 4 మీ (740 కిలోసై)

ఉదయం: 6-30 సుప్రభాతం, కార్యక్రమ వివరణ, 6-40 అం. వా, 6-45 భక్తిరంజని- [illegible] ప్రోగ్రాం; 6-55 సూక్తిముక్తావళి; 7-00 తె. వా. 7-15 వయొలిన్ యుగళం; 7-45 ఖయాల్, 8-00 అం. వా. 8-15 దేశభక్తి గీతాలు; 8-30 వయొలిన్ యుగళం, 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 10-40 రన్నింగ్‌కామెంటరీ; 11 40 ఉన్నత పాఠశాలలకు, 12-30 కార్మికుల కార్యక్రమం. 1-00 మహిళా సమాజం, 1-30 ఖయాల్, 1-40 హిం. వా; 1-50 తె. వా. 2-00 హై. బి వలె; 2-10 ఉ. వా, 2-20 హై. బి వలె, 2-30 సమాప్తి.

3-00 క్రికెట్ కామెంటరీ, 3-50 సమాప్తి.

4-05 క్రికెట్ కామెంటరీ 4-40 సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాం.వా, 6-15 ప్రస్తుతాంశం; 6-20 కన్నడ శ్రోతలకు, 7-00 తె. వా, 7-15 అదాన్ ప్రదాన్ - ప్రసంగం (హిందీ), 7-30 హై. బి. వలె; 8-00 నాటిక (మ. రి). 8-30 సంగీత కచేరీ, 8-45 రి. రిలే, 8-55 ప్రస్తుతాంశం, 9-00 అం. వా; 9.15 ఉ. వా, 9-30 రి. రిలే. 9-45 నాటిక (ఉర్దూ), 10-15 ఖయాల్, 10-30 అం. వా; 10-35 సమాప్తి - జనగణమన.

హైదరాబాద్ - బి

కడప

252.1 మీ (1190 కిలోసై)

విశాఖపట్నం

382.8 మీ (980 కిలోసై)

సాయంత్రం 6-00 నుండి రాత్రి 9-30 వరకు

39.42 మీ (3855 కిలోసై)
(హైదరాబాద్ మాత్రమే)

ఉదయం: 6-30 హై. ఎ. వలె; 7-45 సమాప్తి.

8-00 హై. ఎ. వలె; 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 10-40 హై. ఎ.వలె 12-10 ఆయవిన్యాసం; 12-30 హై. ఎ. వలె, 2-00 వార్త కదంబం, 2-30 సమాప్తి.

3-00 హై. ఎ. వలె, 3-50 సమాప్తి.

4-05 హై. ఎ. వలె, 4-40 సమాప్తి.

సాయంత్రం: 6-00 హై. ఎ. వలె, 6-20 గ్రామస్థులకు: 7-00 తె. వా; 7-15 గ్రామస్థుల కార్యక్రమం; 8-00 హై. ఎ. వలె, 9-15 ఆంగ్లమున: 9.25 విరామ సంగీతం. 9-30 హై. ఎ. వలె. 9-45 సంగీతామృతం, 10-30 హై. ఎ. వలె; 10-35 సమాప్తి-జనగణమన.

మద్రాస్ - బి

211.3 మీ (1420 కిలోసై)
60.98 మీ (4920 కిలోసై)

ఉదయం: 6-40 అం. వా, 6-45 మంగళగానం, 7-00 తె. వా; 7-15 మ. ఎ. వలె, 7-30 మణి త్తిరునాడు - రూపకం; 7-30 మ. ఎ. వలె, 7-45 మెల్లిశై, 8-00 అం. వా; 8-15 సమాప్తి.

211.3 మీ (1420 కిలోసై)
41.90 మీ (7160 కిలోసై)

మధ్యాహ్నం 12-00 కార్మికుల కార్యక్రమం, 12-30 మ. ఎ. వలె, 1-00 కదంబం, 1-30 అం వా, 1-40 గీతమంజరి, 1-50 తె. వా, 2-00 మధురగీతం, 2-10 మ. ఎ. వలె, 2-40 సమాప్తి

211.3 మీ (1420 కిలోసై)
60.98 మీ (4920 కిలోసై)

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం; 6-00 అం. వా. 6-05 మద్రాస్ ఎ వలె, 6-20 వాతావరణ సూచన, స్థానిక ప్రకటనలు, వాణిజ్య వార్తలు (ఆంగ్లం), 6-30 కార్యక్రమ వివరణ (తమిళం); 6-35 నాటిక (తమిళం), 6-50 కదంబం. 7-00 తె. వా. 7-15 బృందగానం, 8-00 వీరతిలకం-నాటిక. 8-55 ప్రస్తుతాంశం; 9-00 అం. వా; 9-15 ఆంగ్లమున. 9-30 రి. రిలే. 9-45 పాశ్చాత్య సంగీతం; 10-35 సమాప్తి - జనగణమన.

తమసిఫార్సులు అమలుపరిస్తే రెండేళ్లలో అవినీతి తగ్గుదల

శ్రీ సంతానం ప్రకటన

బొంబాయి, జనవరి 24

తమ సంఘం చేసే సిఫార్సులను అమలు జరిపినట్లయితే రెండు సంవత్సరాల కాలంలోనే దేశంలో అవినీతి 'ప్రశంసనీయం'గా తగ్గిపోతుందని తాము విశ్వసిస్తున్నామని అవినీతి నిరోధక కమిటీ అధ్యక్షుడు శ్రీ కె సంతానం నేడిక్కడ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమలుజరుగుతున్న ఈ కమిటీ సిఫార్సుల తుది రిపోర్టు రెండు మూడు మాసాల్లో అందజేయబడగలదని భావిస్తున్నారు.

రెండు సంవత్సరాల కాలంలోనే దేశంలో అవినీతిని సగం మేరకు తగ్గిస్తానని కేంద్ర హోం మంత్రి శ్రీ నందా చేసిన వాగ్దానం నెరవేర్చడం కోసం అవినీతిని 'ప్రశంసనీయం'గా తగ్గించడానికి చర్యలు తీసుకుంటామని ఆయన పత్రికా సమావేశంలో తెలియ జేశారు.

ఈ సందర్భంలో ఆయనొక ప్రశ్నకు జవాబు చెబుతూ నందా చేసిన వాగ్దానాన్ని నెరవేర్చడానికి గల అవకాశాలను లెక్కవేసి చెప్పడానికి తాను అంగీకరించ నన్నారు.

అవినీతి నిరోధానికి తీసుకోవలసిన చర్యలను గురించి వినడానికి ఉద్దేశించిన ఆఖరు సమావేశం ఈ సాయంత్రం ముగిసింది. ఇక ఈ కమిటీ ఢిల్లీలో తన రిపోర్టు వ్రాయడం ప్రారంభిస్తుంది. ఇంతవరకూ అవినీతి నిరోధక చర్యలను గురించి ఈకమిటీ శ్రీ నందాకు సమర్పించిన ఐదు తాత్కాలిక రిపోర్టులను కూడా ఈ తుది రిపోర్టులో [illegible] చేస్తామని అధ్యక్షుడు శ్రీ సంతానం చెప్పారు.

అనేక కారణాలవల్ల తాము వదలివేసిన మిలటరీ, న్యాయనిర్ణయశాఖల్లోని అవినీతి విషయాలను దర్యాప్తు చేసి, తెలియ జేయడానికి ఒక ప్రత్యేక కమిటీని నియమించాలనే విషయం కూడా ఈ కమిటీ చేసిన సిఫారసులలో ఒకటని ఆయన చెప్పారు.

పై రెండు దశలలోని అవినీతి దర్యాప్తు చేయక పోవడానికి గల ప్రధాన కారణం భద్రత గురించి ఆలోచించవలసి రావడమేననీ ఆయన అన్నారు.

వివిధగ్రూపులతో అవినీతినిరోధకచర్యలపై జరిపిన చర్చల సందర్భంలో కమిటీ ఎదుర్కొంటున్న ముఖ్యసమస్యల్లో అవినీతిని గురించి తమ దృష్టితో చూడలేని సాంఘిక వాతావరణం ఒకటని చెప్పారు.

అధికార్లకు లంచంపెట్టిన వ్యక్తి ప్రజా తిరస్కారాన్ని లెక్కచేయకపోవడం అనేది అవినీతి నిరోధానికి ప్రభుత్వం ఎదుర్కొంటున్న ప్రధానమైన ఇబ్బంది అని కూడా ఆయన అన్నారు.

'రాజకీయ అవినీతి' అనేది మరొక సమస్య అనీ, ప్రభుత్వోద్యోగులలోని అవినీతిని సమర్థవంతంగా నిర్మూలించగలిగితే దీనిని కూడ ఎదుర్కొనగలమని ఆయన చెప్పారు.

ఈ 'రాజకీయ అవినీతి'ని ప్రభుత్వోద్యోగుల అవినీతితో కలపరాదని, తమ కమిటీ భావిస్తూ వుందని చెప్పారు. ఈ కమిటీ తాత్కాలిక రిపోర్టులలో సూచించిన మేరకు యేర్పాటుచేసిన విజిలెన్సు కమిటీలు ఈ ఉద్యోగుల అవినీతిని దర్యాప్తు చేస్తాయి.

ప్రభుత్వోద్యోగుల ప్రవర్తనానిబంధనలను, ఉద్యోగుల క్రమశిక్షణా నిబంధనలను, ఉద్యోగ విరమణచేసిన ఉద్యోగులు ప్రయివేటు సంస్థలలో ఉద్యోగం చేయడానికి సంబంధించిన విషయాలను గురించిన చేర్పులుమార్పులను తమ ఇతర నివేదికలో పొందుపరుస్తామని ఆయన చెప్పారు.

వేతన సంఘాలు పని విధానం

అవి న్యాయమూర్తులుగా ఉండకూడదని

శ్రీ వెంకట్రామన్ ప్రసంగం

మద్రాసు, జనవరి 24

వేతన సంఘాలు తమ విధులను విజయవంతంగా నిర్వహించాలంటే న్యాయమూర్తులుగా వ్యవహరించడం మానుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి శ్రీ ఆర్. వెంకటరామన్ నేడిక్కడ ఒక సభలో ప్రసంగిస్తూ చెప్పారు.

ఉభయపార్టీలకు సంతృప్తికరమైన ఒడంబడిక కుదుర్చుకోటానికి వచ్చిన ఉభయ పార్టీల ప్రతినిధులుగా యీ సభ్యులు భావించుకోవాలన్నారు.

మద్రాసు పాత్రికేయుల సంఘ దశవార్షికోత్సవానికి ప్రారంభోత్సవం చేస్తూ శ్రీ వెంకటరామన్ ఈ విషయం చెప్పారు. ఈ సభ నేటి సాయంత్రం జరిగింది.

వేతనసంఘంలో తాను ఒకప్పుడు సభ్యుడైనప్పటికీ, వేతనసంఘం అంటే తనకు యిష్టంలేదనికూడా మంత్రి తెలియజేశారు.

పశ్చిమదేశాలలో వేతన సంఘాలు, న్యాయస్థానాల మాదిరిగా సాక్ష్యం వినటం, వాదనలు వినటం చేయవు. వివరాలను సేకరించి, పరిశీలించి ఉభయులకు సంతృప్తికరమైన నిర్ణయాలకు వస్తాయని తెలియజేశారు. ఆ విధానాన్ని భారతదేశంలో అనుసరించకపోతే, వివాదాల పరిష్కారానికి జాతీయ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయటం మంచిదన్నారు.

పాత్రికేయుల రెండవ వేతన సంఘం విషయం ప్రస్తావించి, తాను చెప్పినట్లుగా యీ సంఘం కార్యక్రమం చేపట్టటానికి వ్యవధి మించి పోలే దన్నారు.

పార్టీల ప్రతినిధుల మధ్య స్వేచ్ఛా ఒప్పందం కుదరటానికి అవకాశం ఉందనీ, సమస్యల పరిష్కారానికి యిది ఆదర్శ మార్గంగా కూడా ఉంటుందన్నారు.

పారిశ్రామిక శాంతి ప్రయోజనాల దృష్ట్యా, పరిష్కారం కొరకు న్యాయస్థానాలకు వెళ్ళే కంటే, యజమానులతో ఉద్యోగులు నేరుగా చర్చల ద్వారా ఒడంబడికకు రావటం మంచిదన్నారు. పారిశ్రామిక ట్రిబ్యునల్స చుట్టూ తిరగటం మానుకోవటం మంచిదన్నారు.

పత్రికా యజమానుల, ఉద్యోగుల మధ్య ప్రస్తుతం ఉన్న స్నేహ సంబంధాలపట్ల తన హర్షాన్ని [illegible]

[illegible]

ఆంధ్ర యూనివర్శిటీ అకడమిక్ కౌన్సిల్

మార్చి 6వ తేదీన సమావేశం

వాల్తేరు, జనవరి 25

ఆంధ్ర విశ్వ విద్యాలయ అకడమిక్ కౌన్సిల్ సమావేశం మార్చినెల 6 వ తేదీ ఉదయం 8-30 గంటలకు విశ్వవిద్యాలయ సెనేట్ హాలులో జరుగుతుంది.

ఈ సమావేశంలో తీర్మానాలు ప్రతిపాదించ దలచిన సభ్యులు ఫిబ్రవరినెల 4 వ తేదీలోపల తమ తీర్మానాలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రారుకు పంపాలి

కలకత్తాలో ప్రశాంత పరిస్థితి

ముఖ్య మంత్రి శ్రీ పి. సి. సేన్ ప్రకటన

కలకత్తా, జనవరి 25

గత ఇరవైనాలుగు గంటలలో కలకత్తాలోను, జిల్లాలలోను ఎట్టి సంఘటనా జరగనందువల్ల, పరిస్థితి సంపూర్తిగా ప్రశాంతంగా ఉన్నదని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి శ్రీ పి.సి. సేన్ నేడిక్కడ పత్రికలవారితో చెప్పారు.

24 పరగణాల జిల్లాలో కొన్ని ప్రాంతాలలో ఈనాటికీ అమలులో ఉన్న కర్ఫ్యూ ఉత్తర్వులు నేటి రాత్రినుంచి సడలించబడతాయని ఆయన తెలియజేశారు.

బారక్‌పూర్‌లో నిన్న కొద్దిపాటి సంఘటన జరగడంవల్ల బారక్‌పూర్, టిటాఘర్ పోలీస్ స్టేషన్ ప్రాంతాలలో ప్రొద్దు గుంకినది మొదలు తెల్లవారేవరకు కర్ఫ్యూ ఉత్తరువు అమలు జరుపబడింది.

రిపబ్లిక్ దినం సందర్భంగా బిరుద ప్రదానం

న్యూఢిల్లీ, జనవరి 25

ఈ సంవత్సరం రిపబ్లిక్ దినోత్సవాల సందర్భంగా పార్లమెంట్ సభ్యుడూ, ప్రఖ్యాత రచయితా అయిన ఆచార్య కాకాసాహెబ్ కలేల్కర్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రసిద్ధ సంస్కృత పండితుడు శ్రీ గోపీనాథ్ కవిరాజ్‌లకు పద్మవిభూషణ్ బిరుదు ఇవ్వబడినట్లు నేడిక్కడ ప్రకటించబడింది.

ఇంతకుపూర్వం ఈ బిరుదు 24 గురు వ్యక్తులకుమాత్రమే ఇవ్వబడింది.

అలాగే 18 మందికి పద్మభూషణ్, 18 గ్గురికి పద్మశ్రీ బిరుదులు ప్రదానం చేయబడ్డాయి. వారిలో ఒక వనిత కూడా ఉన్నది.

పద్మశ్రీ బిరుదు పొందినవారిలో హాకీ ఆటగాడు చరంజిత్‌సింగ్, క్రికెట్ ఆటగాడు శ్రీ యం. జె. గోపాలన్‌లుకూడా ఉన్నారు.

దార్-ఎ-సలాంలో ప్రశాంత పరిస్థితి

లండన్, జనవరి 25

బ్రిటిష్ సైనికదళాల రాకతో దార్-ఎ-సలామ్‌లో ప్రస్తుతం పరిస్థితి ప్రశాంతంగా ఉన్నదని కామన్వెల్తు సంబంధాలశాఖ కార్యాలయం ఈ ఉదయం ఇక్కడ ప్రకటించింది.

విమానాలనుంచి బ్రిటిష్ సైనిక దళాలను దింపడం జయప్రదంగా ముగిసినట్లు ఈ కార్యాలయం ప్రకటించింది దార్-ఎ-సలాంలోని బ్రిటిష్ హైకమిషనర్‌తో ఈ కార్యాలయం నిత్య సంబంధం [illegible]

విజయనగరం అల్యూమినియం కార్మికుని మృతి

[illegible]

తిరువూరు, మధిర తాలూకాల్లో రజక సంఘాలు

తిరువూరు, జనవరి 22

కృష్ణాజిల్లా తిరువూరుఫిర్కా రజకసంఘ సర్వసభ్య సమావేశం జనవరి 13న శ్రీబిగిడిపల్లి రామయ్యగారి అధ్యక్షతను జరిగింది. గ్రామ రజక స్త్రీపురుషులు 150మంది హాజరయ్యారు

గ్రామరజక సంఘాన్ని నడుపుటకు 11 మందితో ఒక కమిటీని ఎన్నుకొన్నారు. దీనికి అధ్యక్షులు: శ్రీకంచనపు లాలయ్య; కార్యదర్శి శ్రీ కంచనపు హనుమంతరావు, కోశాధికారి శ్రీ జక్కుల రామారావు.

మధిరతాలూకా రామచంద్రరావు బంజర గ్రామ రజకసంఘ సమావేశం జనవరి 18 వ ఉదయం శ్రీ జబాలుపాటి పిచ్చయ్యగారి అధ్యక్షతను జరిగినది. రజక స్త్రీ పురుషులు 25 మంది హాజరయ్యారు. వారిలోనుంచి గ్రామరజక సంఘాన్ని నడుపుటకు ఐదుగురుతో ఒక కమిటీని ఎన్నుకొన్నారు. దీనికి అధ్యక్షులు శ్రీ బండి బుక్కయ్య, కార్యదర్శి శ్రీ జబాలు పాటి పిచ్చియ్య, కోశాధికారి శ్రీ జబాలు పాటి వెంకటప్పయ్య.

మధిరతాలూకా నారాయణపురం గ్రామ రజకసంఘ సమావేశం జనవరి 19న ఉదయం శ్రీ గానిదేవపల్లి పిచ్చియ్యగారి అధ్యక్షతను జరిగింది. ఆ సమావేశానికి స్త్రీ పురుషులు 40 మంది హాజరయ్యారు. 5గురితో కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. దీనికి అధ్యక్షులు శ్రీ మేడేపల్లిమల్లయ్య, కార్యదర్శి శ్రీమునిగంటి అమ్మయ్య, కోశాధికారి: గరిడేపల్లి అప్పయ్య

ఈ మూడు సమావేశాలలోను ప్రదేశ్ రజకసంఘ నాయకులు శ్రీ కావటరపు వెంకటేశ్వరరావుగారు పాల్గొన్నారు.

కూలి హెచ్చించాలని అల్యూమినియం కార్మికుల అభ్యర్థన

విజయనగరం, జనవరి 25

విజయనగరం అల్యూమినియం రేకు పనివారల సర్వసభ్య సమావేశం జనవరి 22 వ జరిగినది.

జూర అప్పలనరసయ్య కంపెనీలో పొలంగిన్నెల మూర్తులకు రు 0—10—0 యిస్తూయున్నారు. కాబట్టి ఇతర కంపెనీల వలె అన్నిమూర్తులకు రు 0-11-0 యివ్వాలని తీర్మానించారు.

యూనియన్‌ను రిజిస్ట్రేషను చేయించాలని తీర్మానించారు.

వ్యవసాయ కార్మిక సంఘ నిధికి శ్రమదానం

నెల్లూరు, జనవరి 25

నెల్లూరు తాలూకా పొట్టిపాళెం వ్యవసాయ కార్మిక సంఘం నిధికిగానుసంఘ సభ్యులు 70 మంది పొట్టిపాళెంలో జనవరి 14 వ తేదీన ఎర్రజెండాలతో, నినాదాలిచ్చుకొంటూ 10 ఎకరాల కోతకోశారు. వచ్చిన రూ. 80 కూలి సంఘ నిధికి యిచ్చారు. కోతలలో స్థానిక నాయకులు, గోవుల పిచ్చిరెడ్డి శ్రీమతి శకుంతలమ్మగార్లు కూడా పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో పంచదార కరువు

రాజమండ్రి, జనవరి 24

ధవళేశ్వరంలో పంచదార దొరకక ప్రజలు నానాయిబ్బందులకు గురవుతున్నారు.

జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలలో పంచదారను పంచాయతీ సభ్యులద్వారా గ్రామంలో పంపకం కొనసాగించారు. సరిపోయేంత పంచదారను అందివ్వక పోవటంచేత, పంచాయతీ సభ్యులు తమ అసమ్మతిని తెలియజేస్తూ, పంపకం చేయమని చెప్పారు. అప్పుడు గ్రామ మునసబే బాధ్యత వహించి పంపకానికి పూనుకొన్నారు. మునసబు పంపకం ప్రారంభించిన నాటినుండి కొంత మందికి మాత్రామే పంచదార అందుబాటులో వుండట, హెచ్చుమందికి దొరకకపోవటం జరుగుతూవుంది.

అందుచేత, రాజమండ్రి పట్టణంలో జరుగుతున్న విధంగానే కార్డులు పంపకంద్వారా పంచదారను సప్లయిచేయవలసిందిగా గ్రామ కమ్యూనిస్టుపార్టీ జిల్లాకలెక్టరునుకోరుతూవుంది. (వి.వి.)

సర్వోదయ కార్యకర్తలు అందరుసత్యాగ్రహంలో పాల్గొనాలి

శ్రీ సన్యాసిరావు గారి విజ్ఞప్తి

పాయకరావుపేట, జనవరి 25

విశాఖ జిల్లా పాయకరావుపేట నియోజక వర్గంలోని గుంటుపల్లిలో పంచాయతీ అధ్యక్షులు శ్రీ తోట అచ్యుతరావు గారి అధ్యక్షతను జనవరి 23 న పెద్ద బహిరంగసభ జరిగింది.

సర్వోదయ నాయకులు శ్రీ గెడ్డం సన్యాసిరావుగారు ప్రసంగిస్తూ సర్వోదయ కార్యకర్తలందరూ అదనపు శిస్తు వ్యతిరేక సత్యాగ్రహంలో పాల్గొనాలని కోరారు.

జిల్లాకమ్యూనిస్టు నాయకుడు శ్రీ గోళ్ళ నారాయణగారు, స్థానిక శాసనసభ్యులు శ్రీ మండే పిచ్చయ్యగార్లు మాట్లాడుతూ పన్నులు వసూలు చేస్తున్న సందర్భంలో అధికారులు రైతుల్ని బెదిరిస్తున్న పద్ధతుల్ని తీవ్రంగా విరసించారు.

విజయనగరం ప్రజానాట్య మండలికి బహుమతులు

విజయనగరం, జనవరి 25

విశాఖజిల్లా తృతీయ యువజనోత్సవాలు జనవరి 16 నుండి 22 వరకు అనకాపల్లిలో నాటికలు, ఆటలపోటీలు జరిగిన సందర్భంలో విజయనగరం ప్రజానాట్యమండలివారి ప్రముఖ రచయిత శ్రీ పథాల రామారావుగారు రచించిన "అరిదండాలు" అనే నాటికకు ప్రథమ బహుమతి వచ్చింది. అదే నాటికలో వ్యాప్రప్ప పాత్రధారి శ్రీ యం. బాబూరావుకు ఉత్తమ నటుని బహుమతి లభించినది.

'ఆధునిక సాహిత్యం' అంటే ఎటువంటిది?

రాజమండ్రి సభలో శ్రీ పురిపండా అప్పలస్వామి ప్రసంగం

రాజమండ్రి, జనవరి 26

"ఆధునిక సాహిత్యం" అనేఅంశంపై మొన్న శ్రీ పురిపండా అప్పలస్వామిగారు రాజమండ్రి యూథరిన్ గ్రంథాలయంలో ఉపన్యసించారు. ఆ సభకు శ్రీమతి అద్దేపల్లి వివేకానందదేవి అధ్యక్షత వహించారు.

శ్రీ అప్పలస్వామిగారు యిలా అన్నారు:

"సాహిత్యంలో ఎంతసేవచేసినా కించిత్తుగా వుంటుంది. కవిత్వమంటే ఎపుడు పుడుతుందో అదే ఆధునికమైంది, ప్రక్రియలలో తేడా నవ్యత సృష్టిఉన్నంతవరకూ వుంటుంది. నన్నయ్యకలంపట్టిననాడు తెలుగుపరిస్థితిలోవుందో ఊహించడం కష్టం. అది జాతీయం కాదేమో ననిపిస్తుంది. భారతానికి పూర్వం ముందు ఋషి ఆశ్రమ శిల్పం వుండేదేమోననిపిస్తుంది. అది అనాటికి నవ్యత. తెలుగు వ్యాకరణాన్ని మొదట నన్నయ్య రచించారు. అది కొన్ని విరుద్ధ నమ్మకాలు కలిగించేదిగా వుంది తెలుగు భాషకు వ్యాకరణాన్ని సంస్కృతంలో ఎందుకు వ్రాయాలి? సంస్కృత పండితుల ఆస్థానాలలో ప్రవేశించడానికి ఆంధ్రశబ్ద చింతామణి వ్రాశాడు. దొరలు మన తెలుగు దేశంలోకి ప్రవేశించడానికి రచించారు. భారతం పురాణమైనా మహాకావ్యం. రాజులను సంతోషపెట్టే విధంగా మహాశిల్పాన్ని చిత్రించారు. కాని కాలంమారగా ఎల్లెలలో తలదాచు కోడానికి వీలు కలిగింది. నన్నయ్యనవ్యత నజాతీయమైన దానిని మార్చి కొత్తపుంతలు తొక్కింది. ప్రబంధకావ్యాలు విసుగెత్తి అవధానాలలోకి వచ్చింది. తిరుపతి కవులనాటివి. అది అనాటికి నవ్యకవిత.

ఆంధ్రసాహిత్య ప్రభావం మనమీదపడింది భావకవిత్వ ప్రక్రియగా మారింది. అది గేయాలు మాత్రాఛందస్సుల్లో వ్రాయడం దానికి ముందు అరుణోదయం గురజాడ. ఆయన నవ్యకవిత్వం ముత్యాలసరాలతో శ్రీకారం చుట్టబడింది. రాయప్రోలువారు దానినే పాత ఛందస్సులలో మరోదానికి మళ్ళించారు. గురజాడ నాటికి అప్పటి తెలుగు సరస్వతి "కొయ్యబొమ్మ"లావుంది. సాహితీసమితిఅప్పారావు ఛందానువిడిచి మరోమార్గాన్ని పట్టింది శ్రీ కృష్ణశాస్త్రి ప్రేమగీతాలు ఎక్కువై సాహితీసమితిని స్థాపించారు. భావ కవిత్వం సాహితీసమితి సృష్టి. అనంతరం విడిపడి శ్రీశ్రీ [illegible] రాశారు. కమ్యూనిస్టు సమాజంలేని రోజుల్లో ఆయన వ్రాశారు. శ్రీశ్రీ మార్గంలో అభ్యుదయ కవిత్వం వ్రాశాక 63 సంవత్సరానికి అభ్యుదయ కవిత్వంనుండి విడిపడి మరో ప్రక్రియలోకి మారింది. కమ్యూనిస్టు అయినవాడే అభ్యుదయ కవిత్వం వ్రాయగలడనేవాదనఒకటి. కమ్యూనిస్టు కాకపోయినా అభ్యుదయకవిత్వం వ్రాయ గలడనే వాదన మరొకటి వచ్చింది.

నన్నయ్యలో అది కనిపిస్తున్నది. నన్నయ్య విశ్వశ్రేయమైనదే కావ్యమన్నారు. రాజులను, ధనవంతులను తిట్టడమే అభ్యుదయ కవిత్వమంటే అదిదయ సూరకవికంటె మరొకడు లేడు. మార్క్సిజానికి ముందు అలాంటిభావాలు లేవని అనుకోనక్కరలేదు. కాల ప్రవాహంలో ఆధునికత రూపం ధరిస్తుంది. ఇది అని చెప్పడం కష్టం. విమానాలూరాకెట్లూ వచ్చినా నడక, పోటులబండి వుంటాయి విజ్ఞాన మెంతపెరిగినా ఆదిమానవలక్షణాలు కనబడతాయి. పాతభావాలున్నంతమాత్రం చేత అభ్యుదయక విశాదని అనుకోరాదు. విశ్వనాథ సత్యనారాయణ కెంత పేరుందో ఎంకిపాటలకి అంతేపేరు వుంటుంది. ఎందుచేత? కొత్త కల్పన వుండాలి. కవితకి కొత్తపాత లేదు శకుంతల ఈ నాటికి చదవబుద్ధి వేస్తుంది. జరిగిననాటి ప్రక్రియలను విడిచి కొత్త ప్రక్రియలను వ్రాయమని ఆధునికకవులకు విజ్ఞప్తి. చిలకమర్తి తిరుపతికవులు చాలా చదివి కలంపట్టారు. మనుమను చరిత్ర చదివి. అప్పటివారు శ్రీ శ్రీనివదివి రాస్తున్నారు నవ్యకవితకు వెనుకటి వాటిని కూలంకషంగా చదవాలి.

'కవిత ముందు ఎలావుండాలి?' ఎప్పుడూ ఈప్రశ్న వుంటుంది. ఏది కొత్తది వ్రాసినా పూర్వీకులు విమర్శించారు కొత్తదానిని వ్రాసిన వాడిని తాయెపెడగొడుతున్నాడని తిడుతున్నారు. ఆధునికతలో ప్రయాణం చేయగలగాలి. తన వరకే ఆధునికత, తన తరవాతది కాదంటే కుదరదు. విశ్వనాథ సత్యనారాయణలాంటి కవిలేరు. నవల, నాటకం, కావ్యాలలో బహుముఖ ప్రజ్ఞాశీలుడు. కాని పాతను చూస్తాడు ఏ నవ్య ప్రక్రియ వచ్చినా దానిలో ప్రయాణం చేయాలి. భారతాన్ని తెలుగులో వ్రాస్తే, దాన్ని చదువుతూ అర్థం చెప్పవలసిన దౌర్భాగ్యం తెలుగులోనేవుంది. ఒరియాలో భాగవతం అన్నిరకాల ప్రజలకు అర్థమౌతుంది. ఈ బాధకలిగి మహాభారతాన్ని వెలిగించపూనుకున్నాను. రామాయణం కవిత్వంగా, భాగవతం భక్తిగానూ వుంటుంది. భారతం అన్ని నిధులూనూ ఉంటుంది. ఏదీ అవకతవకగావుండని భారతంలో చెప్పడానికిలేదు. ఒరియాలో భాగవతం అందరికీ అర్థమైతే మన ఇంటిలోనూ భాగవతం వుంటుంది. కాని ఎవరికీ అర్థంకాదు".

అనంతరం శ్రోతల ప్రశ్నలకు శ్రీ అప్పలస్వామిగారు జవాబులు చెప్పారు.

శ్రీ పోలిశెట్టి నాగేశ్వరరావు వందనసమర్పణ చేశారు. (వి. వి.)

లేఖలు

నడుపూరు గ్రామ పొలాలకు నీటి ఇబ్బంది, శిస్తుబకాయిలు

ఆర్యా,

బందరు తాలూకా నడుపూరు గ్రామం [illegible]. పెదన లజ్జబంద మురుగు కాలువల మధ్యవుంది. గ్రామానికి ఎప్పుడు పంటనీరు కరువే. గ్రామానికి సంబంధించిన పంటకాలువలు వర్షమన్నాకు మురుగు కాలువ పైపున ద్వారా దాటిరావాలి. అందువల్ల వచ్చే నీరు వర్షమన్నాము వరకే వస్తాయి అదిదాటి రావు. రావాలని పి. డబ్ల్యు. డి. వారికి కూడా అంతగా పట్టదు. ఈ గ్రామం తంట దిగుబడి 2 బస్తాలనుండి 7 లేక 8 వరకు వుంటే చాలా గొప్ప పంట. యీ పరిస్థితులలో 1962 సంవత్సరము అధిక వర్షాలవల్ల మొత్తం గ్రామమంతా నెలరోజుల వరకు నీటిలో మునిగిపోయి పంట పూర్తిగా పోయింది. ఈ సంవత్సరం అనావృష్టివల్ల పంటలు పోయినాయి. ఈ గ్రామానికి పంటనీరు సప్లయి గురించి చేసే ఆందోళన అరణ్యరోదనంగావుంది. రెవిన్యూ అధికార్లు మాత్రం బకాయి శిస్తుతోపాటు యీ సంవత్సరం కట్టవలసిన శిస్తుబకాయికూడా [illegible] చేయమంటున్నారు. గత సంవత్సరం అధికార్లు యిస్తామన్న రెమిషన్ కూడా యింతవరకు అంతులేదు. అందువల్ల యీ గ్రామం రైతులు చాలా యిబ్బందులకు గురిఅవుతున్నారు. శిస్తు బకాయి వసూలు గురించి పంటనీరు సప్లయి గురించి తగు చర్యలు తీసుకో కోరుచున్నాము.

ఇట్లు,
శింగంశెట్టి సుబ్బారావు.

కాంగ్రెసు కార్యకర్తగా కూనవరం సమితి వి. ఎల్. డబ్ల్యు.

ఆర్యా,

భద్రాచలం తాలూకా కూనవరం పంచాయతీ సమితిలో వి. ఎల్. డబ్ల్యు. గా పనిచేస్తున్న గూడూరు రామగోపాలం కాంగ్రెసు కార్యకర్తగా మాత్రమే పని చేస్తున్నారు. ఇటీవల ఆయన స్థానిక కమ్యూనిస్టు నాయకులపై నిరాధారపూర్వక విమర్శలతో కాంగ్రెసు పార్టీ బహిరంగసభలలో బాహాటంగా ప్రసంగాలకు పూనుకున్నారు

కాంగ్రెసు కార్యకర్తలతో కూడి కాంగ్రెసు పార్టీ బహిరంగసభలలో బుర్రకథకుడుగాకూడ పని చేస్తున్నారు.

ఈ నెల 19 వ తేదీన సమితి అధ్యక్షుని గ్రామమైన చీడుమాక గ్రామంలో కాంగ్రెసు పార్టీ ఆధ్వర్యాన జరిగిన సభలో, బుర్రకథలోను, ఉపన్యాసంలోను ఆయన కమ్యూనిస్టు వ్యతిరేకప్రసంగం హద్దుమీరిపోయారు. కొందరు ప్రజలు "ప్రభుత్వ ఉద్యోగి యిలా వ్యవహరించవచ్చునా?" అని అడిగితే, "ప నెవ్వరేమిచేస్తారు" అని జూటుసామెతలతో సమాధానం యిచ్చారు.

ఈయన పుద్యోగంలోకి వచ్చేముందు చాలకాలం కాంగ్రెసు కార్యకర్తగాపనిచేసి, ఉద్యోగం సంపాదించిన తర్వాత ప్రభుత్వ జీతంతో గడుపుతూ, ఏమాత్రం దాటులేకుండా, యీ విధంగా కాంగ్రెసుపార్టీ సమావేశాలలో, సభలలో పాల్గొంటూ అర్థంలైజరుగాపనిచేస్తున్నారు.

19 వ తేదీన జరిగిన బహిరంగసభనాడు బి. డి. ఓ. కూడా ఆ గ్రామంలోనే మకాంచేసి యున్నారు, ఆయనకూడా ప్రత్యక్షంగా చూచి మందలింపకపోగా, కొందరు ఆయనతో రిపోర్టు చేసినా ఎట్టిమందలింపు చర్యకూడా తీసుకొనలేదు. అధికారపార్టీ కార్యకర్తగా పనిచేసే వారికి ఉద్యోగనిబంధనలు వర్తించవా? అని యిక్కడచాలమంది ప్రశ్నిస్తున్నారు.

టి. వి. ఆర్. చంద్రం,
భద్రాచలం.

పంచాయతీ వార్డుల నిర్ణయంలోతలెత్తిన అంశాలు

ఆర్యా,

ఇంతవరకు వున్న మద్రాసు పంచాయితీ చట్టాన్ని మార్చి, ఆంధ్రప్రదేశ్ పంచాయితీ చట్టంగా రూపొందించారు. త్వరలో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. పాత వార్డుల ప్రకారం గాక, వోటర్ల జాబితాలోని వరుస నెంబరును, ఆయా గ్రామాలలో సరిపడే సీట్ల సంఖ్యచే భాగించి నూతన వార్డులు ఏర్పాటుచేసే చట్టాన్ని అమలుచేయబోతూ వున్నారు. దీని యొక్క వివరణ ప్రజలకు, సందిగ్ధావస్థలో అర్థంగాకుండావుంది. 1961 వ సంవత్సరంలో కొత్త వోటర్ల జాబితాలు తయారుచేసి ప్రకటించారు. దానిపై చేర్పులు-మార్పులు అదే సంవత్సరంలో రెండుదఫాలు జరిగి వున్నాయి. అదే విధంగా 1962, 1963 సంవత్సరాలలో గూడా జరిగింది. తిరిగి యీ సంవత్సరం (1964) ఓటర్ల నమోదు ఫారాలు 5 పైసలకు కొని, అర్థరూపాయి (దస్తావేజుల) స్టాంపును జతపరచి చేర్పులు, ఆక్షేపణలు చేసుకొనే అవకాశాలున్నాయి. ఈ అవకాశానికి ఆఖరి గడువు యెప్పుడో అధికారులకే తెలియదు. పైగా 1961 వ సంవత్సరంలో నూతన ఓటర్ల జాబితాలు ప్రకటించిన తర్వాత చేర్చబడిన చేర్పులు ఓటర్ల జాబితాలలో చివరి వరుస నెంబరు నుండి వరుస వారీగా నమోదు చేయబడివున్నాయి. అలా నమోదుచేయబడిన ఓట్లు గ్రామములలో అన్ని వార్డులకు సంబంధించి, ఆయా వార్డు యింటి నెంబర్లతో వున్నాయి. నేటి ఓటర్లజాబితాలనుయథాతథంగా వరుసప్రకారంలెక్కించి నూతనవార్డులు ఏర్పాటు చేసియెన్నికలు జరిపితే, ఓటర్ల జాబితాలలో చివరిభాగములలో చేర్చబడిన ఓటర్లు క్రొంగ్రొత్త వార్డులలోకి వస్తారు. గ్రామములలో వివిధ వార్డుల వారితో కలసి ఒక క్రొత్తవార్డు సృష్టించబడుతుంది. ఈ క్రొత్త వార్డు మంది యెన్నికైన మెంబరు గ్రామములో యే ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించుతాడో అర్థంగాకుండా వుంది. ఓటర్ల జాబితాను యథాతథంగావుంచి సీనియారిటీని పాటిస్తారా? లేక ఓటర్ల జాబితాలోని చివరి భాగములో 1961 వ సంవత్సరం ఓటర్ల జాబితాను ప్రకటించిన తర్వాత చేర్చబడిన ఓటర్లను ఆయా వార్డులలో యింటి నెంబర్ల ప్రకారం చేర్చుతారా? అన్న ప్రశ్నలకు ఓటర్లను నమోదుచేయు అధికారులకు (ఆర్.డి.ఓ., కలెక్టర్లు)గాని, పంచాయితీ ఆఫీసర్లుగాని ఎలాంటి ఆదేశాలు ఇంతవరకులేవని తెలియుచున్నది. క్రొత్తగాచేరిన ఓటర్లు, చేరదలచిన ఓటర్లు తాము యే వార్డులలో చేరేదీ తెలియని స్థితిలోవున్నారు.

ఇక స్త్రీ మెంబర్లు నామినేటెడ్ పద్ధతిలో గాక, యెన్నికల పద్ధతిలో జనాభా ప్రాతిపదికపై యెక్కువ యే వార్డులలో ఆడవాళ్ళు వుంటారో ఆ వార్డులలో వాళ్ళ స్థానాలు నిర్ణయించవలసి యున్నది జనాభా ప్రాతిపదికపై అంటే 1961లో జనాభా ననుసరించి స్త్రీ మెంబర్ల స్థానాలు యేర్పాటు చేస్తారా? ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జనాభాను సేకరిస్తారా? లేక కొంత మంది ప్రవాదంలో పెట్టిన విధంగా ఓటర్ల జాబితాలో యే వార్డులో స్త్రీ ఓటర్లు యెక్కువగా వుంటే ఆ వార్డులో స్త్రీ అభ్యర్థులను నిర్ణయిస్తారా? ఈ ప్రశ్నలకు యిది అవును ఇదికాదని చెప్పే అధికారులు గూడా కరువైనారు.

ఎన్నికలు జరిగేది సీనియారిటీ ప్రకారం, క్రొత్త వార్డులలో 1961 జనాభా లెక్కలు పాతవార్డుల ప్రకారం వున్నాయి. జనాభా ప్రకారం స్త్రీ అభ్యర్థినులను నిర్ణయించే యెడల నూతన వార్డులననుసరించి జనాభాను సేకరించవలసివుంటుందిగదా? అలా చేస్తారా? కాగా ఓటర్ల జాబితాలయితే అందరికి అందుబాటులోవున్నాయి, 1961 జనాభా లెక్కలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా తాలూకా ఆఫీసులలో భద్రపరుస్తుంటారు. అందరికి అందుబాటులో వుండేలాగా ఓటర్ల జాబితాలతోపాటు జనాభా ప్రకారం స్త్రీ అభ్యర్థులను నిర్ణయిస్తారో ఆ జనాభా లెక్కలను ప్రకటించవలసి యున్నది. అలా ప్రకటించక కేవలం అధికారుల దయాదాక్షిణ్యాలకు వదిలితే అధికార ముఠావారుగాని వారికి, అన్యాయం జరిగే అవకాశాలున్నాయి. అనధికార ముఠాలు, ప్రతిపక్ష పార్టీలకు సంబంధించిన వ్యక్తులు ఏ వార్డులలో నిలబడదలుస్తారో ఆ వార్డులలోనే స్త్రీ అభ్యర్థులను నిర్ణయింపజేస్తారు.

ఎన్నికలు దగ్గరకొస్తున్నాయి, అధికారులకే సందిగ్ధావస్థలోనున్న నూతన వార్డుల ఓటర్ల జాబితా తయారీ విధానం సామాన్య ప్రజలను అయోమయస్థితిలో పడవేస్తూవుంది. బాధ్యతగల ఆయా రాజకీయ పార్టీలవారు ఈ విషయంలో ఏది ఎట్లాచేసుకోవాలో తెలియనిస్థితిలోవున్నారు. దీని విషయంపై అధికారులు పూర్తివివరణలతో గూడిన సమాచారం ప్రకటనలద్వారా త్వరలో తెలియజేయ వలసియున్నది. ఈలోపు వీటి విషయమై తెలిసిన అనధికార ప్రముఖులు పత్రికాముఖమున ప్రకటించి సహాయపడవలసిందిగా కోరుచున్నాను. ఇట్లు,

మంచాల నరసింహారావు, భీమవరం.

కొత్తగూడెంలో హెచ్చుగా బస్సు ట్రిప్పులు

ఆర్యా,

కొత్తగూడెంలో నడుస్తున్న ఆర్. టి. సి. బస్సులు అధికంగా లేక తగినంత సౌకర్యం లేక పోతున్నది. 11వ ఇంక్లైన్‌నుండి కనీసం 8వ ఇంక్లయిన్‌నుండయినా ఉదయం రైలుకు కనక్షన్ బస్సులు లేవు. పుదయం రైలుకు పోవలసినవారు కనీసం 5 మైళ్లు నడవాలి. 5 వ ఇంక్లయిన్‌లో బస్సు అందుకోడానికి ప్రయత్నించాలి. పుదయమే వైటుపిష్టు అయిపోతుంది కాబట్టి, బస్సుస్టాండువద్ద [illegible] తప్పదు.

లోకల్ బస్సుల ట్రిప్పులు కనీసం 30 వరకు పెంచాలని పై అధికారులతో ప్రత్యుత్తరాలు జరిపినాకూడా లాభంకనపడటం లేదు. 1963 డిసెంబరు 3 వ తేదీన కొందరు మంత్రులు. ఆర్. టి. సి. అధికారులు కొత్త సభ్యులుకలిపినకమిటీతీర్మానంప్రకారమయినా. ఇంతవరకు అదనపు బస్సులులేవు. బహుశా ఇది ఆ కమిటీ బలహీనత అయియుండవచ్చు.

ఇంకకొన్ని పుదాహరణలు: బందరు-గుడివాడ-భద్రాచలం వరకు నడుపుతానన్న బస్సు ఇంతవరకు లేదు. కొవ్వూరు నుండి భద్రాచలం వరకు నడుపుతామన్న బస్సు ఇంతవరకులేదు.

వీటన్నింటిని దృష్టిలోపెట్టుకొని పై అధికార్లకు ఎన్నోసార్లు విజ్ఞప్తులుచేయడం జరిగింది. ఇంత ఆందోళన సాగించినాకూడ వారు ఆ నిర్లక్ష్యతను మాత్రం వదులుకోవడంలేదు.

దీనివల్ల ప్రజలు, కార్మికులు, ఎంతఇబ్బంది పడుతున్నారో కాస్తయినా ఆలోచించవలసిందిగా కోరుతున్నాము. ట్రిప్పులను క్యాన్సిల్ చేయకుండా, ట్రిప్పులను పెంచవలసిందిగా కమిటీ తీర్మానాల ప్రకారం, క్రొత్తరూటల్లో బస్సులను అతిత్వరగా నడపవలసిందిగా కోరుతున్నాము.

ఎస్. అనంతరెడ్డి - కార్యదర్శి
కొత్తగూడెం-కమ్యూనిస్టుపార్టీశాఖ.

డాక్టరు నిర్లక్ష్యం వల్ల రోగి మరణం

ఆర్యా,

నల్లమాడగ్రామం మజరా కొండ్రవారిపల్లె నివాసిఅయిన కంబల నారాయణప్ప అనే పేద వ్యక్తి కడుపునొప్పిచే బాధపడుతూ ప్రమాదస్థితిలో గత డిసెంబరు 26 న నల్లమాడ ఆస్పత్రికి రాగా, డాక్టరు పరీక్షచేయడానికి నిరాకరించారు.

కొంతమంది నల్లమాడ గ్రామస్థులు కూడా ఈ డాక్టరుకు సలహా యిచ్చి నప్పటికిన్నీ, ఖాతరు చేయలేదు. ఆసాయంకాలము 4 గంటలకు డాక్టరు అనుమతికి రాగా ఆరోగి కడుపు నొప్పి బాధను భరించలేక, చాలమంది గ్రామస్తులు చూస్తూ వుండగనే చనిపోయారు.

దీనిపై అనంతపురం జిల్లా పరిషత్ కార్యదర్శి, అధ్యక్షులకు తెలుపుతున్నారు. కాని జిల్లా పరిషత్ అధికారులు యేలాటిచర్యలు తీసుకొనలేదు. ఇట్లు,

యస్. యమ్. సైదాం అలీ,
కార్యదర్శి, కదిరి తాలూకా,
కమ్యూనిస్టుపార్టీ, కదిరి.

సభలు - సమావేశాలు

గుంటూరుజిల్లా కమ్యూనిస్టుసమితి సమావేశం ఫిబ్రవరి 4, 5 తేదీలలో గుంటూరులో జిల్లా సమితి కార్యాలయంలో జరుగుతుంది. సమావేశం 4 వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభించబడుతుంది.

• • •

కృష్ణాజిల్లా నూజివీడు తాలూకా కమ్యూనిస్టు సమితి సమావేశం జనవరి 29 వ తేదీ ఉదయం 10 గంటల నుండి సాయంకాలం 5 గంటలవరకు నూజివీడులో జరుగుతుంది. 29 ఉదయం 8 గంటలకు కార్యవర్గసమావేశం జరుగుతుంది.

• • •

"గుంటూరు మండల సర్వస్వము" (1964) ఆవిష్కరణ మహోత్సవం గుంటూరు (ఏ. సి. హాల్)లో 2-2-64 ఆదివారం సా॥ గం. 5.00 లకు జరుగుతుంది.

అధ్యక్షులు శ్రీ కొత్త రఘురామయ్య (కేంద్ర రక్షణ పరికరాల ఉత్పత్తిశాఖామంత్రి) ఆవిష్కరణ: శ్రీ నీలంరాజు వెంకటశేషయ్య ఉపన్యాసకులు: శ్రీ జి. లావుజ, శ్రీ తుమ్మల సీతారామమూర్తి, శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు. శ్రీ ఆవుల గోపాలకృష్ణమూర్తి. శ్రీ పిల్లలమర్రి వెంకటహనుమంతరావు. శ్రీ ప్రగడ కోటయ్య. వందనసమర్పణ శ్రీ కొల్లా శ్రీకృష్ణారావు. సభానంతరం నాజరు దళంవారి పల్నాటియుద్ధం బుర్రకథ వుంటుంది.

• • •

ఫిబ్రవరి 3 వ తేదీన ఏలూరులో మున్సిపల్ హయ్యర్ సెకండరీ స్కూలులో ఆంధ్రప్రదేశ్ టీచర్సు యూనియన్ కార్యవర్గం సమావేశం అవుతుంది.

• • •

గుంటూరు జిల్లా అభ్యుదయ రచయితల సమావేశం గుంటూరు, రవి ట్యుటోరియల్ కాలేజి, 3 వ లైను, బ్రాడీపేటలో 2-2-64 ఆదివారం ఉదయం 11 గంగలకు జరుగుతుంది.

అధ్యక్షులు: శ్రీ బాపిరెడ్డి వెంకటసుబ్బయ్య. ప్రారంభకులు: శ్రీ తుమ్మల వెంకటరామయ్య (ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘ కార్యదర్శి) చర్చనీయాంశాలు. (1) జిల్లా సంఘ నిర్మాణము (2) ఆంధ్రఅభ్యుదయ రచయితల మహాసభలు. (3) ఇతరములు. (సభ్యత్వ రుసుము 50 న. పై. సమావేశమప్పుడు చెల్లించ వచ్చును. ప్రతినిధిరుసుము లేదు.)

• • •

గుంటూరుజిల్లా ఒంగోలు తాలూకా గ్రామోద్యోగీయ వార్షిక మహాసభ ఈ నెల తే 31 న ఒంగోలు పెండ్యాలవారి సత్రంలో జరుగుతుంది.

• • •

"ఆంధ్రప్రదేశ్ హైవేస్ ఎంప్లాయీస్ యూనియన్ నాల్గవ వార్షిక మహాసభ ఫిబ్రవరి 17 వ తేదీన జరుగుతుందని (22-1-64) తేదీ విశాలాంధ్రలో ప్రచురించబడింది. కాని అది ఫిబ్రవరి 16, 17 తేదీలలో విజయవాడ (దుర్గాభవనం)లో జరుగుతుందని కార్యదర్శి శ్రీ కె. గోపాలకృష్ణమూర్తి తెలుపుతున్నారు.

భీమవరంలో ఆటల పోటీలు

భీమవరం, జనవరి 25

ఫిబ్రవరి 9 వ తేదీనుంచి భీమవరం టౌన్ హాలులో బాల్ బాడ్మింటన్ పోటీలు జరుగుతాయి. 1 వ తేదీ నాటికి పోటీదార్లు దరఖాస్తులు పంపాలి.

సంక్షిప్తవార్తలు

తెనాలి

ఈ నెల 19వ తేదీన తెనాలిలో, గుంటూరు జిల్లా హిందీ ప్రేమీ మండలి సర్వసభ్య సమావేశం శ్రీ బోయపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. దక్షిణ భారత హిందీ ప్రచార సభ, ఆంధ్రకు శ్రీయుతులు వావిలాల కోటేశ్వరరావు, ఆవుల వెంకటరమణయ్య, మాలెంపాటి ధర్మారావు, సూర్యదేవర వెంకటసుబ్బయ్య, మక్కపాటి వెంకటరత్నంగార్లను ప్రతినిధులుగా ఎన్నుకొన్నారు.

కొల్లూరు

ఈనెల 21 వ తేదీన "ఇటికతీత" సహకార కుటీర పరిశ్రమ సంస్థ ఇక్కడ నెలకొల్పబడింది. ఆ సందర్భంగా [illegible] ఆవరణలో శ్రీ జనస్వామి హనుమంతరావు అధ్యక్షతన బహిరంగసభ జరిగింది.

శ్రీ వర్రా పరంధామయ్య అధ్యక్షులుగాను, దేవరకొండ చలపతిరావు కార్యదర్శిగాను సంఘానికి డైరెక్టర్లను ఎన్నుకొన్నారు.

భీమవరం

విజయవాడ డివిజన్ క్లాస్ 4, క్లాస్ 3 పుద్యోగుల జనరల్‌బాడీ సమావేశాలు జరిగాయి. ఆంధ్ర సర్కిల్ పోస్టుమాస్టర్ జనరల్ తన యిచ్చవచ్చినట్లు స్థానాలు తగ్గించడంవలన [illegible] కొరతపడుతున్నదని సమావేశాలు తీర్మానించాయి.

డివిజనల్ యూనియను కార్యదర్శిని బదిలీ చేసిన అధికారులచర్యను నిరసిస్తూతీర్మానించారు.

జాంజిబార్ లో జోక్యం తల పెట్టవద్దు

బ్రిటన్ కు సోవియట్ హెచ్చరిక

లండన్, జనవరి 26

జాంజిబార్ నూతన ప్రభుత్వంపై ఎటువంటి బలప్రయోగచర్యలను తలపెట్టినా సహించమని సోవియట్ యూనియన్ నేడు బ్రిటన్ను హెచ్చరించింది.

అంతకుముందు బ్రిటిష్ ప్రధాని హోమ్ టెలివిజన్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తూర్పుఆఫ్రికాలో తిరుగుబాటులను, అల్లరులను కమ్యూనిస్టులే రెచ్చగొట్టారని ఆరోపించారు.

తమ మాజీ వలసాధిపత్యాన్ని వదలడానికి అంగీకరించనివారు నూతన జాంజిబార్ ప్రభుత్వంపై బలప్రయోగానికి పూనుకుంటే, అది విషమ పరిస్థితులకు దారితీస్తుందని సోవియట్ విదేశాంగశాఖ తన ప్రకటనలో నేడు హెచ్చరించింది.

బ్రిటిష్ సైన్యాలు జాంజిబార్ ప్రాంతంలో సిద్ధంగా ఉన్నాయని, మరొకదళం నౌకలలో దిగటానికి సిద్ధంగా ఉన్నట్టు వచ్చిన వార్తలను పేర్కొంటూ సోవియట్ ప్రకటనలో ఇలా ఉంది "జాంజిబార్‌లోని కొద్దిమంది బ్రిటిష్ జాతీయులకు భద్రతనేసాకుతో ఒక స్వతంత్ర ఆఫ్రికా దేశంపై సైనిక దురాక్రమణ జరపటమే దీనిలక్ష్యం"

కెన్యాకు బ్రిటిష్ సైనికులను చేరవేస్తున్న 13 బ్రిటిష్ విమానాలు నేటిరాత్రి నైరోబి చేరుకున్నాయి మూడు దేశాలలోను నిన్నటి నుండి 2 వేలమంది తిరుగుబాటు సైనికులను ఈ బ్రిటిష్ సైన్యం నిరాయుధులనుచేసింది. లానెట్ బారక్సులోని 500 మంది తిరుగుబాటు దారులను కస్టడీలోకి కూడా తీసుకొన్నారు

దార్-ఎ-సలాంలో ఇరవైనల్గురు సైనికులు మినహా మిగతావారంతా పట్టుబడటమో, లేక తిరిగి బారక్సుకు తిరిగిరావటమో జరిగింది. వీరు బ్రిటిష్ నావికా సైనిక దళం నుండి పారిపోయారు.

ఉగాండాలోకి అదనంగా బ్రిటిష్ సైన్యాలు దిగుతున్నాయి

టాస్ వార్తా సంస్థ విడుదల చేసిన సోవియట్ ప్రకటనలో ఇలా ఉంది,

"జాంజిబార్, పెంబాపీపుల్స్ రిపబ్లిక్ అంతరంగిక వ్యవహారాలలో విదేశీ జోక్యం జరిగే ప్రమాదం ఏర్పడింది.'

"జాంజిబార్ ప్రభుత్వ అసమ్మతికి వ్యతిరేకంగా జాంజిబార్ సరిహద్దు ప్రాంతంలో బ్రిటిష్ సైన్యాలున్నాయని, ద్వీపానికి దగ్గరగా ఉన్న సైనికస్థావరాలలోకి అదనపుసైన్యాన్ని, విమానాలను దించుతున్నారని, జాంజిబార్ సరిహద్దు జలాలలో బ్రిటిష్ యుద్ధనావలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి.'

"ఆదేవిధంగా జాంజిబార్ ఘటనలలో బ్రిటిష్ జోక్యం చేసుకునే అవసరం ఉండదన్నట్టుగా బ్రిటిష్ సైనిక స్థావరాల కమాండర్ సిగ్గువిడిచి ప్రకటన చేసినట్టుకూడా వార్తలు వస్తున్నాయి.

ఇదంతా బ్రిటిష్ జాతీయుల భద్రతకై సాగే ప్రయత్నంగా చిత్రించబడుతోంది. వలస రాజ్యాధిపతులు పన్నిన పన్నాగం మినహా ఇది మరొకటికాదు జాంజిబార్‌లోనివసిస్తున్న బ్రిటిష్ జాతీయులకు ఎటువంటి ప్రమాదం ఏర్పడలేదని జాంజిబార్‌లో బ్రిటిష్ ప్రతినిధి టెమ్ క్రాస్టువేట్ తెలియ జేశారు"

"ఇటువంటి చర్యలు అంతర్జాతీయ ఉద్రిక్తత నివారణకు పూర్తిగా విరుద్ధమైనవి అంతే కాదు. నూతనంగా స్వాతంత్ర్యం పొందిన ఆఫ్రికా దేశాల జాతీయ లక్ష్యాలకు ఇది విరుద్ధం

'వలస పాలకులకు వ్యతిరేకంగా పాగే ఏ దేశమైనా, సోవియట్, తదితరసోషలిస్టుదేశాల దృఢంమైన తోడ్పాటును, సహకారాన్ని పొందుతుంది వలస విధానానికి కాలంచెల్లింది దానిని ఏశక్తీ రక్షించలేదని ఆ ప్రకటనలో ఉంది.

మలేషియా, ఇండొనీషియా మధ్య విభేదాలు

మధ్యవర్తిత్వానికి ఐక్య అరబ్ రిపబ్లిక్ అంగీకారం

కైరో, జనవరి 27

మలేషియా, ఇండొనీషియాలమధ్య ఉన్న సమస్యలను పరిష్కరించి, వారిమధ్య తిరిగి మంచి సంబంధాలు నెలకొల్పటానికి ఐక్య అరబ్ రిపబ్లిక్ సిద్ధంగా వుందని నేడిచ్చట ప్రకటించారు

సింగపూర్ ప్రధాని లీక్వాన్‌యె ఐక్యఅరబ్ రిపబ్లిక్‌లో సుహృద్భావపర్యటన జరిపిన తరువాత నేడు విడుదలచేసిన సంయుక్తప్రకటనలో యీ విషయాన్ని చెప్పారు.

మలేషియా, ఇండొనీషియా దేశాల మధ్య ఉన్న సమస్యల విషయం విని అరబ్‌రిపబ్లిక్ చాలా ఆందోళన చెందిందనీ, రెండు దేశాల మధ్య విభేదాలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకో వచ్చుననీ, యిందుమూలకంగా ఆగ్నేయ ఆసియా దేశాలలో శాంతి నెలకొల్పబడుతుందనీ, యిది ఎంతో లాభదాయకమని కూడా ఆ ప్రకటనలో తెలియ జేశారు

మలేషియా ప్రధాని ఆహ్వానంపై మలేషియా రావటానికి అధ్యక్షుడు నాజర్ అంగీకరించారు అయితే ఎప్పుడు వెళ్లేది, ఆగ్నేయాసియాలోని యితర దేశాల పర్యటనకు వెళ్లినప్పుడు నాజర్ నిర్ణయిస్తారు

మలేషియా ప్రతినిధివర్గం నేడు యిచ్చట నుంచి ట్యూనిస్ వెళ్లింది.

పోర్టుఫోలియోలేని మంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి ఈనెల 25న ప్రధాని నెహ్రూను కలుసుకొని దాదాపు 45 నిమిషాలు సమాలోచనలు జరిపారు.

సింహళ కమ్యూనిస్టు పార్టీ 7వ మహాసభ

వచ్చేఏప్రిల్ 16-19ల మధ్య జరపడానికి కార్యవర్గనిర్ణయం

కొలంబో, జనవరి 25

సింహళ కమ్యూనిస్టుపార్టీ కార్యనిర్వాహక వర్గం గత మంగళవారం ఇక్కడ సమావేశమై వచ్చే ఏప్రిల్ 16 నుంచి 19 వరకు ఏడవ పార్టీ మహాసభ జరపడానికి నిర్ణయించింది.

పార్టీ మహాసభ జరగబోయే ముందు చర్చించడానికై తయారు చేయబడిన డాక్యుమెంట్లను కార్యవర్గం ఆమోదించింది.

మహాసభకు ప్రతినిధులను ఎన్నుకోవలసిన పద్ధతిని కూడా కార్యవర్గం రూపొందించింది.

మహాసభ ఏర్పాటు నిర్వహణలకు సంబంధించిన అనేక ఇతర నిర్ణయాలు కూడా చేయబడినట్లు కార్యవర్గం ప్రకటించింది,

గతవారం చైనా అనుకూలవర్గం ఏడవ పార్టీ మహాసభ పేరుతో ఇక్కడొక సభ జరిపి, ఆ సభలో పార్టీ మాజీ కేంద్ర కార్యవర్గ చర్యలను, సోవియట్ కమ్యూనిస్టుపార్టీని ఖండిస్తూ తీర్మానాలు ఆమోదించారు.

సరుకుల దొంగ రవాణా

డిశంబరులో రు 37 లక్షల విలువగల సరుకుల పట్టివేత

న్యూఢిల్లీ, జనవరి 24

1963 డిసెంబరులో కస్టమ్సు సుంకం చెల్లించకుండా దొంగతనంగా రవాణా అవుతున్న 36.85 లక్షల రూపాయల విలువగల సరుకులను కస్టమ్సు అధికారులు వశపరుచుకున్నారు 1962 డిసెంబరులో ఆ రీత్యా పట్టుకున్న సరుకుల విలువ రూ 19 92 లక్షలు.

1963 డిసెంబరులో కస్టమ్స్ అధికారులు స్వాధీనపరచుకున్న వాటిలో బంగారం విలువ రూ 11.80 లక్షలు, 1962 డిసెంబరులో స్వాధీనపరచుకొన్న బంగారంవిలువ రూ 5.33 లక్షలు.

జకార్తా, జనవరి 25

ఉత్తర బోర్నియోలో పోరాడుతున్న వాలంటీర్లకూ, మలేషియాలో సరిహద్దు పొడవునాగల సైనిక దళాలకూ నేటినుండి పోరాటం విరమించ వలసిందిగా ఇండొనీషియా ప్రభుత్వం నేడిక్కడ కోరింది.

తూర్పు పాకిస్తాన్‌లో తీవ్ర పరిస్థితులు

భద్రతాసమితి అధ్యక్షుని దృష్టికి తీసుకొనివస్తూ భారత ప్రతినిధి లేఖ

ఐరాస, జనవరి 25

కలకత్తాలో పరిస్థితులు కుదుటబడినప్పటికీ, తూర్పు పాకిస్తాన్‌లో పరిస్థితి ఇంకా తీవ్రంగానే ఉందనీ అయితే ఈ విషయం పాకిస్తాన్ భద్రతా సమితికి వ్రాసిన లేఖలో మచ్చుకి కూడా లేకపోవడం గమనించదగినదనీ ఐరాసలో భారత ప్రతినిధి శ్రీ చక్రవర్తి నేడు స్పష్టంచేశారు. కలకత్తాలో ప్రభుత్వాధికారులు అక్కడి పరిస్థితిని అదుపులోనికి తీసుకు రావడానికి ఏమి చేసినదీ, అదేవిధంగా తూర్పు పాకిస్తాన్‌లోఅధికారులుఏమిచేసిందీ రెంటికీగల తేడాను శ్రీ చక్రవర్తి తెలియజేశారు.

భద్రతాసమితి అధ్యక్షునికి శ్రీ చక్రవర్తి నిన్న వ్రాసిన లేఖలో పై విధంగా తెలిపారు

"కలకత్తా తదితర ప్రాంతాలలో పరిస్థితిని వెన్వెంటనే అదుపులోనికితీసుకొనివచ్చి,అక్కడ శరణార్థులకు తగు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం నిమగ్నమైఉంది. అక్కడ ఉన్న హిందువులు, ముస్లిములు, తదితరులు ప్రభుత్వం నెలకొల్పదలచిన సామరస్యపూర్వక విధానానికి చక్కగా సహకరించుతున్నార"ని శ్రీ చక్రవర్తి తెలియజేశారు "కాని తూర్పు పాకిస్తాన్‌లో హిందూ మైనారిటీలపై దాడులు ఇంకా కొనసాగుతునే ఉన్నాయి ఢాకా, నారాయణ గంజ్, చిట్టగాంగ్ తదితర ప్రాంతాలలో జనవరి 14 వ తేదీ నుండి చాలతీవ్రపరిస్థితులు ఏర్పడ్డాయి

తూర్పు పాకిస్తాన్ గురించిన వార్తలను ప్రచురించరాదని పాక్ ప్రభుత్వం నిషేధించింది. తూర్పు పాకిస్తాన్‌లో మత విద్వేషాన్ని బాగా రెచ్చగొట్టారనీ, తత్ఫలితంగా వందలాది హిందువులు చంపబడ్డారనీ. హిందువులు అధిక సంఖ్యాకులుగా నివసించే గ్రామాలకు గ్రామాలు దహనం చేయబడ్డాయనీ ఒక్క ఢాకాలోనే 50 వేల మంది నిరాశ్రయులైనారనీ విశ్వసనీయ వర్గాలద్వారా తెలుస్తుంది

పాక్ విదేశాంగమంత్రి భుట్టో భద్రతాసమితి అధ్యక్షునికి వ్రాసిన లేఖలో "ఈ దారుణ పరిస్థితి అంతా ఉద్దేశ్యపూర్వకంగా తప్పించివ్వారు' అని చక్రవర్తి ఖండించారు.

శాంతి; ప్రజాస్వామ్యస్థాపనకు దారిద్ర్యనిర్మూలనకుదీక్ష

భారత రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో రాష్ట్రపతి రాధాకృష్ణ సందేశం

న్యూఢిల్లీ, జనవరి 26

"భారతదేశం గతంలో ఏ ఆదర్శాలకోసం పాటుపడుతూ వచ్చిందో ఆ ఆదర్శాలకోసం, మనప్రజలకు ఉజ్జ్వలభవిష్యత్తు నిర్మించే ఏ కర్తవ్యం అయితే ఇంకా అసంపూర్తిగా ఉండి పోయిందో, ఆకర్తవ్యాన్ని పూర్తిచేయడానికి అందరూ తిరిగి నేడు అంకితంకావాలని.'' నిరాయుధీకరణ, శాంతి, ప్రజాస్వామం, దారిద్ర్య నిర్మూలన లక్ష్యాల సాధనకు దీక్షాధారులు కావాలని రాష్ట్రపతి రాధాకృష్ణ భారత రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో భారత ప్రజలకు సందేశం యిచ్చారు.

ఆలిండియా రేడియోలో మాట్లాడుతూరాష్ట్రపతి ఈసందేశం యిచ్చారు.

ప్రధాని నెహ్రూ ఇటీవల జబ్బుపడ్డారని అయినప్పటికి ఆయన త్వరలో కోలుకొంటూ ఉండటం సంతోషకరమని అన్నారు."ఉత్తేజకరమైన ఆయన నాయకత్వం తిరిగి పొందడానికి వీలుగా, ఆయన సత్వరం కోలుకోవాలనే నా కోర్కె యావత్తు భారత ప్రజల, శాంతి కాముక ప్రపంచ ప్రజల కోర్కెయే నని అన్నారు. మన దేశ చరిత్రలో అత్యంత క్లిష్టమైన దశలో ప్రధాని నెహ్రూ నాయకత్వం లభించడం మన అదృష్టమనీ, జాతీయ సమైక్యతను సాధించడంలోను, క్రమబద్ధమైన అభివృద్ధిని సాధించడంలోను ఆయన మనలను సరియైన దోవలో నడిపించుతున్నారని రాధాకృష్ణ అన్నారు.

భారతదేశ పురోభివృద్ధిగురించిమాట్లాడుతూ "ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిందిమొదలు ఇంతవరకుసమీక్షించుకుంటేమనకృషి గణనీయమైనదే అయినప్పటికీ, మన అవసరాలతో పోల్చి చూసుకుంటే ఈ కృషి ఎంతమాత్రం చాలదని అన్నారు. దేశ దారిద్ర్యాన్ని నిర్మూలించడంలో మనం ఇంకా ఎంతో కృషిచేయవలసి ఉంది. జనాభా పెరుగుదలతో ఈ దారిద్ర్య సమస్య అంతకంతకు విషమంగా తయారవుతోంది అన్నారు

చైనా దురాక్రమణగురించి మాట్లాడుతూ శ్రీ రాధాకృష్ణ ఇలా అన్నారు చైనా దురాక్రమణవలన మన దేశరక్షణ ఏర్పాట్లు ఉండవలసినంత సంపూర్ణంగా లేవని తేలింది. దీని నిప్పుడు సరిదిద్దుకొంటున్నాము. అయితే అదే సమయంలో ఆర్థికాభివృద్ధి గమనాన్ని తగ్గించజాలం. ఎందుకంటే మన స్వాతంత్ర్యానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదం అంతర్గతంగా కూడా ఉంది" అన్నారు.

నిరాయుధీకరణ

నిరాయుధీకరణ ప్రాధాన్యత గురించి శ్రీ రాధాకృష్ణ యిలా అన్నారు "మానవునికి తన్నుతాను నాశనం చేసుకోగల్గిన శక్తి ఈనాడున్నంత ఎక్కువగా ఎన్నడూ లేదు ప్రస్తుత విషమస్థితి నుండి బైటపడాలంటే సాధారణ నిరాయుధీకరణను, వసుధైక ప్రభుత్వాన్ని సాధించాలి" అన్నారు.

చైనా పాకిస్తాన్లతో భారతదేశ సంబంధాల గురించి చెబుతూ, ఈ దేశాలతో శాంతియుతమైన గౌరవ ప్రదమైన అంగీకారాన్ని కుదుర్చుకోవడమే భారతదేశ ఆశయం. ఇన్నాళ్లుగా మన సరిహద్దులలోనేగాక యావత్తు ప్రపంచంలోను శాంతిని నెలకొల్పడమే దేశలక్ష్యమని అన్నారు.

భారతదేశం ఏనాటినుండో శాంతియుత విధానాలకు వసుధైక్య ప్రభుత్వ నిర్మాణల లక్ష్యానికి అచ్చితంగా కట్టుబడిఉందన్నారు.

మత కలహాలు

ఇటీవల కలకత్తాలోను, యిరుగు పొరుగు ప్రాంతాలలోను జరిగిన ఆందోళన కరమైన ఘటనలగురించి మాట్లాడుతూ 'ప్రజలు ఇటువంటి విషయాలలో ఉద్రేకం చెందవద్దని' అన్నారు. "సరిహద్దులకు అవతల రెచ్చకొట్టే ఘటనలు జరిగిన మాటవాస్తవమే కాని దీనికి మనం ఉద్రేక వంతులమైతే లోగడనుండి మన దేశం అనుసరిస్తూ వచ్చిన ఆదర్శాలకు విరుద్ధంచేసిన వారమౌతామని" అన్నారు.

"రాజకీయాలలో ముఠాతత్వం. గ్రూపు తత్వం, కుల మత తత్వాలు వీటిని అనుసరిస్తే తప్పు నిర్ణయాలకు దారితీయడం, అందు వలన దేశంలో అసంతృప్తి పెరగటం సంభవమని అన్నారు. అటువంటి తప్పులు, పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్యంపట్ల విశ్వాసాన్ని కాపాడుకోవాలంటే ప్రజాజీవితంలో అవినీతిని అరికట్టాలి. అసమర్థమూ,అవినీతికరమూ, బలహీనమూఅయిన పరిపాలనపట్ల సహనానికి కూడా ఒక హద్దు అంటూ ఉంటుందని అన్నారు.

రష్యాలో రిపబ్లిక్ దినోత్సవాలు

మాస్కో, జనవరి 25

శాంతి, శాంతియు సహజీవన లక్ష్యాలకోసం భారత - సోవియట్ దేశాల మధ్య మైత్రి మరింత బలపడాలని సోవియట్‌లో నేడు అనేక ప్రాంతాలలో జరిగిన భారత రిపబ్లిక్ దినోత్సవసభలలో సోవియట్ వక్తలు పునరుద్ఘాటించారు. భారత- సోవియట్ మిత్ర మండలుల ఆధ్వర్యాన ఈ సభలు ఏర్పాటు చేయబడినాయి

ఒక్క మాస్కోలోనే 14 చోట్ల ఇటువంటి సభలు ఈ వారమంతటా జరిగాయి. ఇందులో కార్మికులు, కళాకారులు, స్కూలు పిల్లలు, యూనివర్సిటీ విద్యార్థులు, రచయితలు, మహిళలు పాల్గొన్నారు,

వివిధ వృత్తులకు, వివిధ జీవితాలకు చెందిన ప్రజలు పాల్గొని ఒక దేశంపట్ల స్నేహభావం వ్యక్తం చేసేందుకు ఇన్ని సభలు సోవియట్ రాజధానిలో ఏర్పాటుచేయడం అరుదు, ఈసభలన్నిటిలో మరో హృద్యమైన విషయం ఏమంటే భారత ప్రధాని నెహ్రూ ఆరోగ్యంపట్ల సోవియట్ ప్రజలు కనబరుస్తున్న ఆకాంక్ష

గత దశాబ్దంలో భారత- సోవియట్ మైత్రి పెంపొందినతీరు అంతర్జాతీయ సంబంధాలలో ఒక అపూర్వమైన విషయమని ఇక్కడ పరిశీలకులు అంటున్నారు

భారతదేశంపట్ల సోవియట్ ప్రజలు చూపుతున్న ఈ ఆప్యాయత కేవలం భావాత్మకమైనదేకాక, భారతదేశం అనుసరించుతున్న శాంతి, తటస్థ విధానాల ఫలితంగా నూ, ప్రధాని నెహ్రూ అంతర్జాతీయ ఉద్రిక్తతలను తగ్గించడంలోను, శాంతియుత సహజీవనాన్ని సంరక్షించడంలోను నిర్వహించుతున్న గొప్ప పాత్ర ఫలితంగాను ఏర్పడింది.

ఈ యేడు సోవియట్‌లో జరిగిన భారత రిపబ్లిక్ దినోత్సవాలు జరిగిన తీరుచూస్తే, సోవియట్‌లోని సామాన్య ప్రజలుకూడా భారత - సోవియట్ మైత్రీభావం ఎంతగాఢంగా అలుముకు పోయిందో వ్యక్తమౌతుంది.

సోవియట్ కేంద్ర ఆసియా, సోవియటు దూరప్రాచ్యం ఆల్మా ఆటా, ట్యాష్కెంట్, దుషాన్బీ, బాకు, లెనిన్‌గ్రాడ్ మొదలైన అనేక ప్రాంతాలలో భారత రిపబ్లిక్ దినోత్సవాలు జరిగినట్లు ఇంతవరకు అందిన వార్తలను బట్టి అర్థమవుతుంది.

ఒక సోవియట్ అధికారి పి. టి. ఐ. విలేకరికి ఈ విధంగా తెలిపాడు "సోవియట్ ప్రజలు భారత రిపబ్లిక్ దినోత్సవాన్ని దేశమంతటా జరుపుతున్నారు కాని వివిధ నగరాలలో ఎన్ని సభలు, ఉత్సవ కార్యక్రమాలు జరిగాయో చెప్పడం కష్టం. ఆఖరుకు మాస్కోలో ఎన్ని చోట్ల ఈ ఉత్సాహ సభలు జరుగుతున్నదీ చెప్పలేం. ఎందుకంటే ఆఖరుకు గ్రంథాలయాలలోనేకాక అనేక సంస్థలు భారతదేశం స్వాతంత్ర్యం పొందినతరువాత అభివృద్ధిని తెలిపే ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నాయి"

జొన్న పైరు పై పరిశోధన

హైద్రాబాదు వ్యవసాయ పరిశోధనా కేంద్రం కృషి

హైద్రాబాదు, జనవరి 24

హైదరాబాద్, అంబర్ పేటలోని, మొక్కజొన్న పరిశోధనాకేంద్రంలో అనేక రకాల జొన్నపైరును పండిస్తున్నారు. ఈ పరిశోధనా పథకం, రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ సంస్థ సహాయంతో నడుస్తూ వుంది

అబిసీనియా, నైగేరియా, ఉగాండా, అమెరికా, జపాన్ దేశాల నుండి భారత దేశంలోని వివిధ ప్రాంతాల నుండి తెప్పించిన జొన్నల రకాలను ఇక్కడ పండిస్తున్నారు. ఇన్నిరకాలు జొన్న పంట యే ఒక్క ప్రాంతంలోనూలేదు.

వీటితోపాటుగా అన్నివిధాలైన తెగుళ్ళకు తట్టుకొనే పైరును పండించడానికి భారతీయ వ్యవసాయ పరిశోధకులు ఆలోచిస్తున్నారు ఈ పైరు ఒక మొక్కకు పండేధాన్యమే ఒక మనిషి ఆహారానికి సరిపడినంత వుండాలనీ, అలానే పశువులకు సమృద్ధికరమైన ఆహారాన్ని ఈ పైరు సమకూర్చాలనీకూడా వారుభావిస్తున్నారు.

1120 ఎకరాలున్న ఈ వ్యవసాయ క్షేత్రాన్ని నేడొక పాత్రికేయుల బృందం సందర్శించింది

కేంద్ర ఎక్సైజు, కస్టమ్స్ ఆఫీసర్లకు బహుమతులు

రిపబ్లిక్ దినోత్సవంనాడు రాష్ట్రపతిచే బహూకరణ

న్యూఢిల్లీ, జనవరి 25

కేంద్ర ఎక్సైజు, కస్టమ్సు శాఖకుచెందిన నిర్వాహక అధికారులు తమ విధి నిర్వహణలో కొన్ని సందర్భాలలో తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొనవలసి వస్తుంది కొన్ని సందర్భాలలో ప్రాణాలనుకూడా లెక్కచెయ్యకుండా వారు తమ విధి నిర్వహించవలసి వస్తుంది. ఈ విషయంలో పోలీసుల పరిస్థితి వేరు వీరి పరిస్థితి వేరు.

ఈ శాఖలకుచెందిన వివిధ ఉద్యోగులు చేసిన గణనీయమైన సేవకు ప్రభుత్వ పరిగణన లభించేలా చెయ్యడానికి 1962 లో ఒక క్రొత్త పథకం రూపొందించారు.

ప్రాణాలను లెక్క చెయ్యకుండా అసాధారణ పరిస్థితులలో తమ విధి నిర్వహించి ప్రశంసనీయమైన సేవచేసిన కేంద్ర ఎక్సైజు, కస్టమ్సు శాఖ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలతోపాటు కొంత ధనంకూడా ఇవ్వాలని, ప్రశంసనీయమైన సేవచేసిన వారికి ప్రశంసా పత్రాలు ఇవ్వాలనీ నిర్ణయించారు.

ఈ పథకం క్రింద కేంద్ర ఎక్సైజు, కస్టమ్సు శాఖకు చెందిన తొమ్మిది మంది ఆఫీసర్లు, ఉద్యోగులకు ఈసంవత్సరం రిపబ్లిక్ దినోత్సవంనాడు రాష్ట్రపతి బహుమతులను ప్రదానం చేస్తారు.

శ్రీ నెహ్రూకు పూర్తి స్వస్థత

న్యూఢిల్లీ జనవరి 25

ప్రధాని నెహ్రూ పూర్తిగా కోలుకున్నారు శ్రీ నెహ్రూ ఆయన యింటి ఆవరణలో షికారు చేశారు. ఎండలోకూచుని ఫొటో గ్రాఫర్లు వివిధ భంగిమలలో ఫొటోలు తీసుకొడానికి అవకాశం యిచ్చారు.

శ్రీ శాస్త్రి నియామకానికి మురార్జీ ముఠా అభ్యంతరం

అహ్మదాబాద్, జనవరి 25

శ్రీ లాల్ బహదూర్‌శాస్త్రి తిరిగి కేంద్ర మంత్రిగా నియమింప బడినందుకు, ఆ నిర్ణయాన్ని విమర్శించడం తగదని శ్రీ మురార్జీ దేశాయ్ నిన్న యిక్కడ గుజరాత్ కాంగ్రెస్ కార్యకర్తల సభలోచెప్పారు.

ఈ విషయంపై ఒక కార్యకర్త అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన ఆలాంటి ప్రశ్నవేయడమే తప్పనీ. ప్రధానమంత్రి తన సహచరులను ఎంచుకోవడంలో ఆయన విజ్ఞతను ప్రశ్నించడం తగదనీ ఆయన అన్నారు.

"ప్రధాని అనారోగ్యంగా వున్నారు. అందుకని ఆయన తనకు నచ్చిన సహచరుల సహాయాన్ని తీసుకుంటే అభ్యంతరం మనకెందుకు వుండాలి ? అని ఆయన ఎదురు ప్రశ్నవేశారు.

తనను తిరిగి మంత్రివర్గంలోనికి తీసుకోనందుకు గుజరాత్ రాష్ట్రంలో ఎవరయినా ఆందోళనకు పూనుకుంటే తానందుకు గట్టిగా అభ్యంతరం చెప్పగలనని కూడా శ్రీ దేశాయ్ చెప్పుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగులు 7 గురికి రాష్ట్రపతి పతకాలు

న్యూఢిల్లీ, జనవరి 2

ఈ ఏడాది రిపబ్లిక్ దినోత్సవసందర్భంగా రాష్ట్రపతి 86 మంది ఆఫీసర్లకు పోలీస్ ఫైర్ సర్వీస్, పోలీస్ పతకాలు బహూకరించడానికి ఆమోదించారు.

పోలీస్ ఫైర్‌సర్వీస్ పతకం పొందినవారిలో ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు సూపరింటెండెంటు శ్రీ గుత్తి హనుమంతరావు నాయుడున్నారు

పోలీసు పతకాలు పొందిన వారిలో క్రింది ఆంధ్రులు కూడా ఉన్నారు.

శ్రీయుతులు కొరిని భీమశంకరరావు (డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్) కోకా రంగారావు (డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్), క్వాజ అల్తాఫ్ అహమ్మద్ (డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్), డి. వెంకట రమణప్ప (పోలీస్ ఇన్‌స్పెక్టర్), కె. రామారావు (పోలీసు ఇన్‌స్పెక్టరు) నారాయణ చెన్నయ్య (పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్).

శ్రీ గద్దె రామకోటేశ్వరరావు గారికి 'పద్మశ్రీ' బిరుదు

న్యూఢిల్లీ జనవరి 26

భారత రిపబ్లిక్ 14 వ వార్షికోత్సవాల సందర్భంగా ప్రశంసాపాత్రమైనసేవచేసినందుకు రాష్ట్రపతి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డా. గద్దె రామకోటేశ్వరరావు గారికి 'పద్మశ్రీ' బిరుదు బహూకరించారు

శ్రీ రామకోటేశ్వరరావుగారు ద్రాక్ష తోటల యజమాని

శ్రీ కామరాజ్‌తో శ్రీ జయప్రకాష్ భేటీ

అధిక ప్రాధాన్యం ఉంటుందని భావన

న్యూఢిల్లీ, జనవరి 24

కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్‌తో సర్వోదయ నాయకుడు శ్రీ జయప్రకాష్ నారాయణ్ రేపు జరుపబోయే సమావేశానికి యిచ్చట అధిక ప్రాధాన్యత యిస్తున్నారు.

సోషలిస్టు శక్తులు ఐక్యం కావాలని కాంగ్రెస్ అధ్యక్షుడు చేసిన విజ్ఞప్తిదృష్ట్యా ఈ ప్రాధాన్యత యిస్తున్నారు

ప్రజాస్వామిక సోషలిజంమీద విశ్వాసం కలిగిన పార్టీల నాయకులతో తీవ్ర సంభాషణలు జరపకపోతే సోషలిస్టు శక్తులు ఐక్యం కావాలని చేసిన విజ్ఞప్తి నిష్ఫలమని శ్రీ జయప్రకాష్ ఉదయపూర్‌లో చెప్పినట్లు తెలుస్తోంది

ఈసంభాషణలు తరువాతజరుగబోయే తీవ్ర చర్చలకు నాంది మాత్రమే.

శ్రీనగర్ లో పోలీస్ కాల్పులు: నల్గురి మృతి; 8 మందికి గాయాలు

శ్రీనగర్, జనవరి 25

శ్రీనగర్‌లో నేడు జరిగిన ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలపై పోలీసులు కాల్పులు జరిపారు. ఫలితంగా నల్గురు మరణించారు ఎనిమిది మంది గాయపడ్డారు.

అంతకుముందు పోలీసులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలిచ్చిన ప్రజలను చెదరగొట్టడానికి బాష్పవాయువు ప్రయోగించారు.

లాల్‌చౌక్‌లో గతరాత్రి 144 వ సెక్షన్‌ను ధిక్కరించి బహిరంగసభ జరిపేందుకు ప్రయత్నించిన జనసమూహాన్ని పోలీసులు చెల్లాచెదురు చేయడంతో శ్రీనగర్‌లో నేడు హర్తాళ్ జరిగింది

పోలీసులు జన సమూహాన్ని బెత్తాలతో కొట్టడం ప్రారంభించేసరికి వారు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలిస్తూ వెళ్ళిపోయారు.

ఈ ఉదయం లాల్‌చౌక్‌లో జనం తిరిగి గుమిగూడటానికి ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్తత యేర్పడింది

గతరాత్రి ఎవరో ఒకవ్యక్తి వీధుల వెంట నినాదాలిస్తూ, నల్లజెండాలు ఎగురవేయ వలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశాడని నేడిక్కడ అధికారయుతంగా ప్రకటించబడింది. తానిచ్చే నినాదాలేమిటో చెప్పవలసిందిగా పోలీసులు ప్రశ్నించగా, ఆ వ్యక్తి జారుకున్నాడని డిప్యూటీ కమిషనర్ చెప్పారు అటు పిమ్మట కొందరు లాల్‌చౌక్‌వద్దచేరి నేషనల్‌కాన్ఫరెన్స్ పతాకను దించివేశారు.

రాత్రి పరిస్థితి ప్రశాంతంగానేఉంది.

ఈ ఉదయం కొందరు ప్రజలు 144 వ సెక్షన్‌ను సైతం ధిక్కరించి లాల్ చౌకులో గుమిగూడారు. దానిపై పోలీసులు స్వల్పంగా లాఠీచార్జీ చేయవలసి వచ్చిందని అధికారులు ప్రకటించారు.

ప్రభుత్వ, ప్రయివేటు బస్సులు నేడు ఎక్కడివక్కడ ఆగిపోయాయి.

అధికార ప్రకటన

ఈ సంఘటన గురించి అధికారరీత్యా ఈ విధంగా ప్రకటించారు

"అమీరా కాదల్‌లో వెయ్యిమంది చేరి ఉన్నట్టుండి పోలీసులపై అకస్మాత్తుగా దాడి జరిపారు, బాష్పవాయువు లాఠీచార్జి జరిపినా ఫలితం లేకపోవడంతో కాల్పులు జరుపవలసి వచ్చింది అయిదుగురికి గాయాలు తగిలాయి ఒకరు వెంటనే మరణించారు

బుద్షా చౌక్‌వద్ద ఎనిమిది తొమ్మిది వందల మంది దౌర్జన్య పూరిత ప్రదర్శనలు ప్రారంభించారు ఒక్కుమ్మడిగా అన్ని వైపుల నుండి పోలీసులను చుట్టుముట్టారు రాళ్ళు నిప్పు ముంతలు విసరడం మొదలు పెట్టారు. పోలీసులు ముందు బాష్పవాయువు. లాఠీలు ప్రయోగించారు. ఫలితం లేకపోవడంవలన పోలీసులు కాల్పులు జరిపారు ఇద్దరు మరణించారు.

మూడవ సంఘటన బసంత్ బాగ్ వద్ద సాయంత్రంపూట జరిగింది. సుమారు 500 మంది పోలీసులను ఎదుర్కొన్నారు. పోలీసులు తుపాకులు కాల్చడంతో ఒకరు చనిపోయారు.

కేంద్ర హోమ్ మంత్రి అప్రమత్తత

కేంద్ర హోమ్ మంత్రి శ్రీ నందా శ్రీనగర్ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. అంతకుముందే హోంశాఖామంత్రి శ్రీ విశ్వనాథన్, యితర సీనియర్ ఉద్యోగులు శ్రీనగర్‌కు బయలుదేరి వెళ్ళారు

కాశ్మీర్ నాయకులు శ్రీ జి ఎం సాదిక్, మీర్‌ఖాసిమ్ శ్రీ తరఫ్ మున్నగువారు కాశ్మీర్ రేపు బయలుదేరి వెళతారు అంతకు ముందు వారు నందాను, ఉపాధ్యక్షులు శ్రీ జకీర్ హుస్సేన్‌ను, శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రిని కలుసుకున్నారు.

విశ్వనాథన్ ప్రకటన

ఢిల్లీ నుండి నేడిక్కడకు వచ్చిన కేంద్ర హోమ్‌శాఖా మంత్రి శ్రీ విశ్వనాధన్ ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించి వూరేగింపులు, సభలు జరిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు పోలీసులకు అందుకై తగు ఉత్తర్వులిచ్చామని అన్నారు

ఇప్పుడు కాశ్మీర్‌లో తలెత్తుతున్న ప్రదర్శనలు పాకిస్తాన్ నుండి వచ్చిన ఏజంట్లు రెచ్చగొట్టినవేనని ఆయన అందించారు.

'పాకిస్తాన్ ఏజంట్లు కాశ్మీర్‌లోను, భారతదేశంలోను సాధ్యమైనంత ఎక్కువ విధ్వంసం చేయాలని అనుకుంటున్నారు అందుచేత వీరి గురించి ప్రజలు తగు జాగ్రత్త తీసుకోవాలి శాంతి, భద్రతలు కాపాడటంకోసం ప్రజలు తమ శాయిశక్తుల కృషిచేయాలి

శ్రీనగర్, బరాముల, అనంతనాగ్‌జిల్లాల్లో 144 సెక్షన్ అమలుజరుపబడింది. ఇక్కడ సభలు, వూరేగింపులు ప్రదర్శనలు ముందు అనుమతి లేనిదే నిషేధించబడినాయి

సంప్రదాయరీత్యా రంజాన్ 21 వ రోజున ప్రవక్త శిరోజ సందర్శనకు ప్రజలకు వీలు కల్పిస్తున్నాము అందుచేత ఇప్పుడు ప్రదర్శనలకు కాని రాజకీయ వినాదాలు లేవనెత్తడానికి కాని అవకాశంలేదు.

కాశ్మీర్ ప్రధాని ప్రకటన

ప్రవక్త పవిత్రచిహ్నం అదృశ్యమైనప్పుడు కాశ్మీర్ ప్రభుత్వం ఏమీ చేయలేకపోయిందనీ, అసలు ప్రభుత్వం ఉన్నదీలేనిదీ తెలియకుండా కూలిపోయిందని వెలువడిన ప్రకటనలకు కాశ్మీర్ ప్రధాని షంసుద్దీన్ నేడు తన విచారం వెలిబుచ్చారు ప్రభుత్వం ఆ క్లిష్ట సమయంలో తన విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చుతుందనీ అన్నారు, రాష్ట్ర మంత్రివర్గాన్ని బర్తరఫ్ చేయాలని కొందరు చేస్తున్న ప్రచారాన్ని కూడా ఖండించారు ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని కేవలం వినాదాలు యిచ్చినంత మాత్రాన ఏ విధంగా తోసివేయడం సాధ్యమవుతుందని అన్నారు.

జపాన్‌లో 50 వేల మంది ప్రదర్శన

అమెరికా అణుబాంబర్ల స్థావరానికివ్యతిరేకంగా

టోకియో, జనవరి 26

యోకోటాలో వున్న అమెరికా వైమానికసైన్య కేంద్రాన్ని నేడు 50 వేలమంది ప్రజలు చుట్టుముట్టి అక్కడ అణుబాంబులను తీసుకుపోగల ఎఫ్-105 డి. జెట్ విమానాలను నిలుపుతున్నందుకు అసమ్మతిగా ప్రదర్శనం జరిపారు.

యోకోటా టోకియోకు సమీపంలో వుంది. క్యూషూదీవినుంచి ఇటీవలనే యోకోటాకు అమెరికను సైన్యాధికారులు కొన్ని ఎఫ్ 105 డి జెట్ ఫైటరు విమానాలను బదలాయించారు

దానికి అసమ్మతిగా శాంతిసమితి 50 వేల మందితో ప్రదర్శన జరిపింది.

తుంబారాకెట్ కేంద్రానికి సోవియట్ హెలికాప్టర్

తిరువనంతపురం, జనవరి 25

రాకెట్ ప్రయోగానంతరం తిరిగి భూమి మీదికి వచ్చిపడే అవశేషాలను, పరికరాలను వెదికి పట్టుకొనే నిమిత్తం సోవియట్ రష్యా తుంబా రాకెట్ ప్రయోగ కేంద్రాని కిస్తానన్న హెలికాప్టర్ మూడు నెలల్లోపుగా సరఫరా కావచ్చుని, ఈ కేంద్రానికి చెందిన డా॥ చిట్నీస్ నేడిక్కడ వెల్లడించారు.

ఈ విషయమై భారతదేశం సోవియటు యూనియన్‌ల మధ్య ఇటీవల ఒప్పందం పై సంతకాలు జరిగాయని ఆయన తెలియ జేశారు.

శ్రీ షిలూ ఆవో ముఖ్యమంత్రిగా నాగభూమి కొత్త ప్రభుత్వం

కోహిమా, జనవరి 26

నాగభూమి గవర్నరు శ్రీ విష్ణుసాహే శ్రీ షిలూ ఆవో నాయకత్వానగల మంత్రివర్గంచే నేటి ఉదయం 8 గంటలకు రాజభవనంలో ప్రమాణస్వీకారం చేయించారు.

నూతన ప్రభుత్వంలో, ఆపద్ధర్మ ప్రభుత్వంలో గల ఐదుగురు సభ్యులతోపాటు మరో ఇద్దరు మంత్రులు, ఒక డిప్యూటీమంత్రి నియమించబడ్డారు.

డిప్యూటీమంత్రి శ్రీఎస్.ఎల్.ఒడియో, ముఖ్యమంత్రి శ్రీ షిలూ ఆవోకు హోంశాఖ, ఉద్యోగ నియామకాల విషయంలో సహకరిస్తారు.

మలేషియా ప్రభుత్వ అసత్యా ప్రచారం

ఇండొనీషియా ఖండన

జకార్తా, జనవరి 24

ఉత్తర బోర్నియో సరిహద్దు ప్రాంతంలో కాల్పుల విరమణను గురించి అమెరికా అధ్యక్షుని ప్రతినిధి రాబర్ట్ కెన్నెడీకి, ఇండొనీషియా అధ్యక్షుడు సోకర్నోకు కుదిరిన ఒప్పందానికి మలేషియా ప్రభుత్వం వక్రభాష్యం చెబుతున్నదని ఇండొనీషియా సమాచారశాఖ మంత్రి రుస్లాన్‌అబ్దుల్‌గనీ నేడు విమర్శించారు.

సాయుధ సంఘర్షణలు ఆగిపోవాలనేదే ఈ ఒప్పందం అర్థమనీ, అంతేగాని ఇండొనీషియా సైనిక దళాల స్థానాల్లో మార్పులు జరుగుతాయని కాదనీ ఆయన వివరించారు. ఈ సైనిక దళాలు ఎక్కడ ఉన్నవి అక్కడే ఉంటాయన్నారు.

రాబర్ట్ కెన్నెడీ వివరణ

లండన్, జనవరి 24

మలేషియా తగాదాలో మధ్యవర్తిత్వం జరిపిన రాబర్ట్ కెన్నెడీ నేడు లండన్ చేరుకొన్నారు. మలేషియా సమాఖ్య పట్ల ప్రతిఘటనను సోకర్నో మానుకున్నారని వెలువడిన వార్తలు నిజంకాదని ఆయన పత్రికల వారితో మాట్లాడుతూ తెలిపారు.

ఇండొనీషియా, ఫిలిప్పీన్స్, మలేషియా ప్రభుత్వాలు పరస్పర సంప్రతింపులద్వారా తమ విభేదాలను పరిష్కరించుకోగలవని ఆశిస్తున్నా నన్నారు.

ఫిలిం పరిశ్రమకు ఆంధ్ర ప్రభుత్వ తోడ్పాటు

శ్రీ అక్కినేని నాగేశ్వరరావు హర్షం

హైద్రాబాద్, జనవరి 26

ప్రఖ్యాత సినీ నటుడు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు నేడు రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో ఒక సందేశాన్ని యిస్తూ తన పారిశ్రామిక విస్తరణ పథకంలో ఫిలిం పరిశ్రమను కూడా ఒక భాగంగా ఆంధ్ర ప్రభుత్వం చేర్చినందుకు తన సంతోషాన్ని వెల్లడించారు

దక్షిణ భారతంలోనే ఇదొక పెద్ద ముందంజని ఆయన పేర్కొన్నారు

పారిశ్రామికాభివృద్ధితోపాటు సాంస్కృతిక పునరుజ్జీవనం కూడా అవసరమని శ్రీ నాగేశ్వరరావు అన్నారు.

ఆంధ్ర రాజధానీ నగరమైన భాగ్యనగరం ఆనందంతో తాండవిస్తూ ప్రతిఒక్కరూ దివ్వెలతో వుండేవిధంగా అక్షరాలా 'భాగ్యనగరం'గా రూపొందాలని కళాకారుడుగా ఈ రిపబ్లిక్ దినోత్సవ శుభదినాన ఆకాంక్షించుతున్నానని శ్రీ నాగేశ్వరరావు తన సందేశాన్ని ముగించారు.

జనపనార ధరల స్థిరీకరణకై క్రొత్తపథకం

న్యూఢిల్లీ, జనవరి 24

జనపనార ధరలు పడిపోకుండా నివారించేందుకు ఉద్దేశించిన క్రొత్త పథకం క్రింద జనుము పండించే అస్సాము, పశ్చిమబెంగాల్, బీహారు, ఒరిస్సా, త్రిపుర, ఉత్తర ప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, రాష్ట్రాలలో 19 సెకండరీ మార్కెట్లలోనూ, దాదాపు 300 జనపనార సరఫరా కేంద్రాలలోనూ జనపనార కొనుగోలు చెయ్యడానికి 98 సహకార సంఘాలు అవసరమైన ఏర్పాట్లు చేశాయి సహకార సంఘాలు ఇటువంటి ఏర్పాట్లు చెయ్యడం మూలంగానూ, ఈ పథకం క్రిందఅసంఘటితరంగంలోకివచ్చిజనుము కొనుగోలు చెయ్యడానికి సంసిద్ధం కావడం మూలంగానూ ప్రస్తుత సంవత్సరపు జనుము పంటకాలంలో జనపనార ధరలు స్థిరంగా ఉండడానికి కొంతవరకు కారణభూత మైందని తెలుస్తున్నది.

దేశంలో ఉత్తర ప్రాంతాలలో కొన్ని మార్కెట్లలో జనపనార ధరలు కనీసపు స్థాయికంటె తగ్గిన సందర్భాలలో సహకార సంఘాలు ముందుకువచ్చి జనుము కొనుగోలు చేశాయి.

సూర్యాపేటతాలూకా అఖిలపక్ష సదస్సు

బ్లాక్‌కమ్యూనిస్టు కమిటీచే ప్రచార దళాల నియామకం

గుమ్మడవల్లి, జనవరి 26

అదనపుశిస్తు చట్టానికి వ్యతిరేకంగా నల్లగొండజిల్లా నాగారం బ్లాకు తాళ్ళసింగారంలో జనవరి 22 వ తేది పెద్ద వూరేగింపు జరిగింది. ఈ ఊరేగింపులో స్త్రీలుకూడా పాల్గొన్నారు.

అంతకుముందు ఆ ఉదయంనుండి బ్లాకు కమ్యూనిస్టు కమిటీ సమావేశం జరిగింది.

రాత్రి 8 గంటలకు శ్రీ చిత్తలూరి సోంబులు అధ్యక్షతను బహిరంగసభ జరిగింది. శ్రీ కాకి లక్ష్మారెడ్డి, శ్రీ దీకొండ వెంకన్న, జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ భీమిరెడ్డి నర్సింహారెడ్డిగార్లు ఉపన్యసించారు సభలో 3 వేల మంది ప్రజానీకం పాల్గొన్నారు. ఉపన్యాసాల అనంతరం నెల్లూరు వీరభద్రం దళంచే "అమరజీవి" బుర్రకథ చెప్పబడింది.

సభా కార్యక్రమం ప్రారంభంలో సంగెం, యడ్లపల్లి, కందిగుట్ల, చిల్పకుంట, పాతనకల్లు, కోడూరు గ్రామాల నుండి డప్పు వాయిద్యాలతో ఊరేగింపులు వచ్చిచేరినవి.

జనవరి 31న సూర్యాపేటతాలూకాఅఖిలపక్ష సదస్సుకు జయప్రదంగా జరుపుటకు నిర్ణయించారు. ఇందుకై నాలుగు యాత్రాదళాలను ఏర్పాటు చేశారు. ఈ దళాలు జనవరి 25 నుండి 30 వ తేదీ వరకు గ్రామాల్లో ప్రచారం చేయాలని నిర్ణయించారు అదళాల నాయకులు: (1) శ్రీయుతులు తొట్లమల్లూరు, డి.వెంకన్న, జగన్ మోహన్ రెడ్డి, బి భగవాన్‌రెడ్డి; (2) డి. లక్ష్మయ్య, వి. ప్రకాశ రెడ్డి, టి. గోవయ్య, టి. జనార్దన్, మండల రామయ్య, (3) నల్లు శేఖర్‌రెడ్డి, డి. ముత్తిలింగయ్య, (4) నల్లు ప్రతాప రెడ్డి, యస్. రంగన్న, డి. నంజీవరెడ్డి, కె.బుచ్చిరామరావు, వి. గంగులు, ఈ యాత్రా దళాలు 30 వ తేదీ నాటికి తమ కార్యక్రమం ముగించుకొని 31 వ తేదీ సూర్యాపేట తాలూకా అఖిలపక్షసదస్సుకు చేరుకోగలరు. (వి. వి.)

శ్రీ ఈశ్వరరెడ్డిచే సత్యాగ్రహ నిధి సేకరణ

ప్రొద్దుటూరు, జనవరి 26

పార్లమెంటు సభ్యులు శ్రీ ఈశ్వరరెడ్డి ఈ నెల 22 వ తేదీన జమ్మలమడుగు తాలూకాలోని దేవగుడి గ్రామం వెళ్ళి కమ్యూనిస్టుపార్టీ సభ్యుల్ని సమావేశపరచి నివేదిక నిచ్చారు. వారు సత్యాగ్రహం చేయడానికి తమ పేర్లు నిచ్చారు. ఆ గ్రామ స్థానిక కార్యకర్తలయిన శ్రీ నరసింహారెడ్డి, శంకరరెడ్డిగార్లను వెంటతీసుకొని ఈశ్వరరెడ్డిగారు నిధి వసూళ్ళు ప్రారంభించారు రు.163/- వాగ్దానాలు వచ్చాయి మరుసటిదినం దగ్గరనే వున్న తలివేందుల గ్రామంకూడా వెళ్ళి రు 45/- వాగ్దానాలను సేకరించారు. మొత్తం 208/- వాగ్దానాలకుగాను వెంటనే రు 118/- వసూలయినది ఈ విరాళా లిచ్చినవారిలో ఎక్కువమంది కాంగ్రెసు అభిమానులుండడం గమనార్హం. (వి. వి.)

రష్యా, అమెరికా, చైనా నాయకుల సందేశాలు

భారత రిపబ్లిక్ 14 వ వార్షికోత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు తెల్పుతూ

న్యూఢిల్లీ, జనవరి 26

భారత రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా అమెరికా అధ్యక్షుడు జాన్‌సన్, సోవియట్‌రష్యా అధ్యక్షుడు బ్రెజ్నేవ్, చైనా అధ్యక్షుడు శ్రీ షావ్ చీ, పాకిస్తాన్ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ మున్నగు ప్రపంచ రాజకీయవేత్తలు రాష్ట్రపతి రాధాకృష్ణకు తమ శుభ సందేశాలు పంపారు.

"భారత రిపబ్లిక్ వార్షికోత్సవ సందర్భంగా మీకూ, భారతప్రజలకూ వ్యక్తిగతంగానూ, అమెరికన్ ప్రజల తరఫున హృదయపూర్వకమైన ఆకాంక్షలు, అభినందనలు తెలియ జేస్తున్నాం." అన్నారు అమెరికా అధ్యక్షుడు జాన్సన్.

సోవియట్ అధ్యక్షుడు బ్రెజ్నేవ్ తమ సందేశంలో ఇలా పేర్కొన్నారు:

"భారతదేశం స్వాతంత్ర్యం పొందిన నాటి నుంచి మన ఉభయదేశాలమధ్య మైత్రి, సర్వవిధ సహకారము పెంపొంది బలవత్తరమయ్యాయి. ఈ మైత్రీ సంబంధాలద్వారా రెండుదేశాలు శాంతి కోసం కృషిచేస్తున్నాయి. భవిష్యత్తులో కూడా సోవియట్ యూనియన్, భారతదేశం ప్రజలు ఈ మైత్రీ సంబంధాలను విస్తృతంచేసి, పటిష్టం చేస్తారని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను."

అయూబ్ ఖాన్

భారత రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా పాకిస్తాన్ ప్రభుత్వమూ, ప్రజల తరఫున మీకూ, మీ ప్రభుత్వానికీ, భారత ప్రజలకూ అభినందనలు, శుభాకాంక్షలు తెలియ జేస్తున్నామని అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ తన సందేశంలో పేర్కొన్నారు.

చెకోస్లోవేకియా అధ్యక్షుడు ఆంటోనిన్ నొవోట్నీ, లావోస్ రాజా సావంగ్ వత్తనా, కొరియా రిపబ్లిక్, నైజీరియా, వియత్నాం విప్లవ సమితి అధ్యక్షులు కూడా శుభాకాంక్షలు తెలుపుతూ సందేశాలు పంపారు.

కృశ్చేవ్ సందేశం

"సోవియట్ రష్యాకు, భారతదేశానికి మధ్య మైత్రీ, సహకారమూ, ఇక ముందు కూడా పెంపొంది, బలవత్తరం కాగలదని సోవియట్ ప్రధాని కృశ్చేవ్ భారత ప్రధాని నెహ్రూకు నేడొక తంతిద్వారా తన ఆకాంక్ష వెల్లడించినట్లు సోవియట్ వార్తాసంస్థ "టాస్" ప్రకటించింది.

భారతదేశం, రష్యాలమధ్యగల ఈ మైత్రి ఉభయదేశాల ప్రజల ప్రయోజనాలను కాపాడుతూ, శాంతియుత సహజీవన సూత్రాల విజయంకై జరిగే పోరాటంపై సానుకూలమైన ప్రభావం కలిగించగలదని కృశ్చేవ్ తమ సందేశంలో పేర్కొన్నారు.

చౌ ఎన్ లై సందేశం

చైనా, భారత ప్రజల మధ్య సాంప్రదాయకంగా నెలకొనివున్నమైత్రి దినదినాభివృద్ధి పొందగలదని చైనా ప్రధాని చౌఎన్‌లై ప్రధాని నెహ్రూకుపంపినసందేశంలోతనఆశాభావంప్రకటించినట్లు నవచైనా వార్తాసంస్థ వెల్లడించింది.

నెవిన్ సందేశం

బర్మా ప్రభుత్వ విప్లవ సమితి అధ్యక్షుడు జనరల్ నెవిన్ రాష్ట్రపతి రాధాకృష్ణకు సందేశం పంపుతూ, "మీరు ఆయురారోగ్యాలతోనూ, మీ ప్రజలు సుఖసంపదలతోనూ వర్ధిల్లాలని మేము హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాం" అన్నారు

సింహళ పత్రికల వ్యాసాలు

భారత రిపబ్లిక్ 14 వ వార్షికోత్సవ సందర్భంగా కొలంబోలో గల పెక్కుపత్రికలు, భారతదేశం సాధించిన అభివృద్ధిపై ప్రత్యేక వ్యాసాలతో అనుబంధసంచికలుప్రచురించాయి

ఈ సందర్భంగా కొన్ని పత్రికలు సంపాదకీయాలు కూడా వ్రాశాయి.

సింహళ ప్రధాని శ్రీమతి సిరిమావో బండారనాయకే భారత ప్రధానికి శుభాకాంక్షలు తెల్పుతూ సందేశం పంపారు.

మాస్కో పత్రికలు

మాస్కో పత్రికలు భారత రిపబ్లిక్ 14 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అసంఖ్యాకమైన వ్యాసాలు, ఇంటర్వ్యూలు ప్రచురించినట్లు సోవియట్ వార్తాసంస్థ 'టాస్' తెలియజేసింది

"ప్రావ్దా" పత్రిక తన ఢిల్లీ విలేకరి కుజ్నెంకోవ్, భాక్రానంగల్ జలవిద్యుత్ ప్రాజెక్టుపై పంపిన వ్యాసాన్ని ప్రచురించింది. భాక్రా నవభారత్‌కు మాత్రమే కాక, సోవియట్ రష్యా, భారత ప్రజలమధ్య మైత్రికికూడా చిహ్నమని కుజ్నెంకోవ్ తన వ్యాసంలో అభివర్ణించారు.

సోవియట్ కేంద్ర కార్మిక సంస్థ సందేశం

14 వ భారత రిపబ్లిక్ వార్షిక దినోత్సవం సందర్భంగా అఖిల సోవియట్ కేంద్ర కార్మిక సంస్థ భారత దేశంలో గల నాలుగు కేంద్ర కార్మిక సంఘాలకు నేడొక శుభ సందేశం పంపుతూ, శాంతి, శాంతియుత సహజీవనం, జాతీయ స్వాతంత్ర్యాన్ని పటిష్ఠం చేసుకొనటం, కార్మికుల జీవితాన్ని మెరుగు పరచడం మొదలైన సమస్యలపై జరిగేపోరాటంలో మీరు విజయం పొందాలని సోవియట్ పారిశ్రామిక సంస్థల, ఆఫీసు పనివారల ఆకాంక్షను ప్రకటించింది.

సోవియట్ కేంద్ర కార్మిక సంస్థ ఈ అభినందన సందేశాలను అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, ఐ.యన్.టి.యు.సి., యునైటెడ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ (కలకత్తా) హింద్ మజ్దూర్‌సభ (బొంబాయి) లకు పంపింది.

రంగూన్‌లో గల భారతీయులు అసంఖ్యాకంగా భారత రాయబారి నివాస భవనంలో నేటి ఉదయం సమావేశమై భారత రిపబ్లిక్ 14 వ వార్షికోత్సవం జరుపుకొన్నారు

అఖిల బర్మా భారతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కులదీప్‌సింగ్ ఈ సమావేశంలో రిపబ్లిక్ దినోత్సవ ప్రాధాన్యాన్ని గూర్చి వివరించారు.

రంగూన్‌లో భారత దౌత్య ప్రతినిధి శ్రీ జె. గానేసాల్వెస్ రాష్ట్రపతి రాధాకృష్ణ ఇచ్చిన రిపబ్లిక్‌దినోత్సవ సందేశాన్ని చదివారు

దేశమంతటా రిపబ్లిక్ దినోత్సవాలు

ఢిల్లీలో ఉత్సవాలకు ప్రధాని నెహ్రూ హాజరు

న్యూఢిల్లీ, జనవరి 26

భారతదేశం తన 14వ రిపబ్లిక్ దినోత్సవాన్ని నేడు ఉత్సాహంతోనూ, గంభీరంగానూ జరుపుకొంది.

విదేశాలలోని భారతీయులు, భారతీయ దౌత్యకార్యాలయాలు, మైత్రీవేటు సాంస్కృతిక సంఘాలు జరిపిన ఉత్సవ సభలలో దేశభక్తి యుత ఉత్సాహంతో పాల్గొన్నారు.

సైనిక దళాలు, సాయుధ పోలీసు దళాలు, ఎన్. సి. సి. ఏ. సి.సి. హోంగార్డుదళాలు విద్యార్థులు వేలకొలదిమంది ఈప్రదర్శనలలో పాల్గొన్నారు. వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు, పతాక వందనాలు, దేశ సమైక్యతకు కృషిచేయటానికి ప్రతిజ్ఞ తీసుకోవటం యీ రోజు జరిగిన ఉత్సవాల్లో ప్రాధాన్యత వహించాయి.

వివిధ రాష్ట్ర రాజధానులలో గవర్నర్లు సైనికవందనం స్వీకరించటంతో యీ ఉత్సవాలు జరిగాయి.

రాజధానిలో విపరీతమైన చలినికూడా లెక్క చేయకుండా సైనికదళాల ప్రదర్శనలను, సాంస్కృతిక ప్రదర్శనలను చూడటానికి పది లక్షల మంది ప్రజలు అటుమైళ్ళ ప్రాంతంలో గుమిగూడారు.

రాజపథంలో ప్రత్యేకంగా నిర్మించిన వేదికపై నుంచి రాష్ట్రపతి రాధాకృష్ణన్ జాతీయ వందనం స్వీకరించారు. రాష్ట్రపతి అంగరక్షకుల దళం, వివిధ బ్యాండు దళాలు ఈ ఉత్సవానికి శోభను చేకూర్చాయి.

లార్డు మౌంటుబాటన్, అతని కుమార్తె లేడీ బ్రాబర్నుతో కలసి ప్రధాని నెహ్రూ రెండు గంటలపాటు జరిగిన యీ ప్రదర్శనను తిలకించారు. ప్రధాని ఆరోగ్యం దెబ్బతిన్న తరువాత తిరిగి ప్రజలకు కనబడటం యిదే ప్రథమం.

రాష్ట్రపతి వేదిక ప్రక్కన ప్రధాని నెహ్రూ తన స్థానం అలంకరించబోయే ముందు, ఈ ఉత్సవానికి వచ్చిన లక్షలాది ప్రజలు ప్రధానిని చూడగానే హర్షధ్వానాలు చేశారు.

ఈ ప్రదర్శనానికి ముందు, 1962 సంవత్సరంలో నేఫా, చుషుల్ ప్రాంతంలో చైనా తుపాకులకు బలియైన సుబేదార్ జోగీంద్ర సింగ్, మేజర్ సైతాన్ సింగ్ గార్లకు 'పరమవీర చక్ర' బిరుదులను వారి భార్యలకు రాష్ట్రపతి బహూకరించారు.

ఈ రోజు సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లోని మొగల్ గార్డెన్సులో సుమారు ఆరు వేలమందికి రాష్ట్రపతి రాధాకృష్ణ విందుచేశారు.

జాతీయ అత్యవసర పరిస్థితుల దృష్ట్యా మందుగుండు సామాను కాల్చటం భవనాలను అలంకరించటం వంటివి ఏమీ జరగలేదు.

ఈ సందర్భంగా రాష్ట్రపతిని భారత ప్రజలను అభినందిస్తూ 25 దేశాల అధిపతులనుండి సందేశాలు వచ్చాయి. ఆఫ్ఘన్ రాజు జహీర్‌షా యుగోస్లోవియా అధ్యక్షుడు టిటో, టర్కీఅధ్యక్షుడు, రుమేనియా, హంగెరీ, ఫిలిప్పీన్సు అధ్యక్షులు యీ సందేశాలు పంపినవారిలో ఉన్నారు.

ఎముకలు కొరికే చలి వేస్తున్నప్పటికి శ్రీనగర్‌లో కాశ్మీరీలు రిపబ్లిక్ దినోత్సవాన్ని వేడుకగా జరుపుకున్నారు. బక్షీ స్టేడియం వద్ద జరిగిన ప్రదర్శనంలో రాష్ట్ర గృహనిర్మాణాల శాఖమంత్రి శ్రీ అయూబ్‌ఖాన్ సైనికవందనం స్వీకరించారు.

శ్రీనగర్‌లోనూ, కాశ్మీర్ లోయలోను నేడు పరిస్థితులు ప్రశాంతంగా ఉన్నాయి. జమ్మూలో జరిగిన ప్రదర్శనలో సదర్-ఇ-రియాసత్ కరణ్‌సింగ్ వందన స్వీకారం చేశారు.

దేశాభివృద్ధికి, శాంతి నెలకొల్పటానికి కృత్రిమ అడ్డుగోడలను బలహీనతలను తొలగించి ప్రేమ, ఒండొరుల మధ్య విశ్వాసం కలిగించే వాతావరణాన్ని ఏర్పరచటానికి కృషి చేయాలని మహారాష్ట్ర గవర్నరు శ్రీమతి విజయలక్ష్మి పండిట్ బొంబాయిలో జరిగిన పెద్దబహిరంగసభలో ప్రసంగిస్తూఉద్బోధించారు

మద్రాసులోని మెరినా బీచ్‌లో జరిగిన ప్రదర్శనానికి పదివేలమందికిపైగా ప్రజలుహాజరయ్యారు.

మద్రాసు గవర్నరు శ్రీ విష్ణురాం మేధీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందన స్వీకారం చేశారు. సైనిక వందనం తరువాత సాంస్కృతిక ప్రదర్శనలు కూడా జరిగాయి బాలల థియేటర్‌లో యీ ఉత్సవ సందర్భంగా బాలల చిత్రోత్సవానికికూడా ప్రారంభోత్సవం జరిగింది.

కలకత్తాలో సంయుక్త సైనికదళాల ప్రదర్శనం నేటి ఉదయం జరిగింది. గవర్నరు శ్రీమతి పద్మజానాయుడు వందన స్వీకారం చేశారు.

అజ్ఞానాన్ని, పేదరికాన్ని రూపుమాపటానికి కృషి చేస్తామని దుర్గాపూర్‌లోని ఉక్కు మిల్లు కార్మికులు, ప్రజలు నేడిక్కడ జరిగిన సభలో ప్రతిజ్ఞ చేశారు.

గాంగ్‌టాక్‌లో మంచు విపరీతంగా కురుస్తున్నప్పటికీ, రిపబ్లిక్ డే ఉత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. రెసిడెన్సీ ప్రాంతంలో జరిగిన సభలో తాత్కాలిక రాజకీయాధికారి శ్రీ మల్‌హోత్రా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.

గాంగ్‌టాక్ వద్ద కొత్తగా నిర్మించిన ఉక్కు బ్రిడ్జికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీ ఎస్. విశ్వనాథం నేడు ప్రారంభోత్సవం చేశారు. బ్రిడ్జిమీదుగా మొదటి బండి పోతున్నప్పుడు కార్మికులు, జవాన్లు "భారత్ మాతకీ జై" అంటూ హర్షధ్వానాలు చేశారు.

త్రిపురలోని అగర్తలాలో జనవరి23వతేదీ నుండి ప్రారంభమైన నేతాజీ 67 వ దినోత్సవాలు నేటితో పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా నేడు చీఫ్ కమీషనరు శ్రీ ఎస్. పి. ముఖర్జీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సైనిక వందనాన్ని స్వీకరించారు.

రంగూన్, ఖాట్మండూ, మాస్కో, మరి ఇతర దేశాల రాజధానులలోని భారతీయ దౌత్య కార్యాలయాలలో రిపబ్లిక్ దినోత్సవాలు జరిపినట్లు వార్తలందాయి. రాష్ట్రపతి రాధాకృష్ణ సందేశాన్ని చదివి వినిపించారు. భారత ప్రభుత్వం వివిధ రంగాలలో సాధించిన అభివృద్ధిని గురించి అనేక వ్యాసాలను, ఇంటర్వ్యూలను మాస్కో పత్రికలు ప్రకటించాయి.

తూర్పు పాకిస్తాన్‌లోని పరిస్థితుల దృష్ట్యా భారత దౌత్య కార్యాలయము వారు ఢాకాలోని ఉత్సవాలను రద్దుచేశారు దౌత్యకార్యాలయంలో మాత్రం చిన్న ఉత్సవం జరిపారు.

కృశ్చేవ్‌పై మరోసారి ఆల్బేనియా నిందలు

పెకింగ్, జనవరి 26

అల్బేనియాతో జరిగిన సోవియట్ ఆర్థిక ఒప్పందా లన్నింటినీ రద్దుచేశాడనీ, ఋణాలన్నీ నిలిపేశాడనీ, సైనిక దిగ్బంధం చేశాడనీ కృశ్చేవ్‌ను నిందిస్తూ కొత్తగా అల్బేనియా చేసిన సుదీర్ఘమైన నేరారోపణను చైనా వార్తాసంస్థ నేడు ప్రకటించింది.

జనవరి 18 న జరి-ఇ-పాపులిట్ అనే అల్బేనియన్ అధికారపత్రిక సంపాదకీయంలో చేసిన ఈ నిందలన్నింటినీ నవచైనా వార్తాసంస్థ ప్రచారంలో పెట్టింది

'సర్వతోముఖంగా' ఆల్బేనియాకు "ఎంతో సాయం"చేసిన చైనానూ, రష్యానూ పోలుస్తూ ఆ సంపాదకీయం వ్రాయబడింది.

చిత్తూరు జిల్లా కమ్యూనిస్టు సమితి సమావేశం

చిత్తూరు, జనవరి 23

చిత్తూరు జిల్లా కమ్యూనిస్టు సమితి సమావేశం తిరుపతిలో ఫిబ్రవరి నెల 4 వ తేదీన జరుగుతుందనీ సమావేశం మధ్యాహ్నం 3 గం॥కు ప్రారంభ మవుతుందనీ కార్యదర్శి శ్రీ వజ్రవేలు శెట్టి వ్రాస్తున్నారు. సత్యాగ్రహం ఎజెండాలోని ప్రధాన విషయం.

జాతీయోద్యమసంప్రదాయాల ఒరవడిలో సోషలిజం స్థాపనకై నడుం బిగించండి

విద్యార్థి ఫెడరేషన్ మహాసభలో శ్రీ హిరేన్ దాస్ గుప్తా ప్రసంగం

గుంటూరు, జనవరి 26

జాతీయోద్యమంలో విశేష త్యాగాలుచేసి, గర్వించదగ్గ చరిత్రను సృష్టించిన విద్యార్థులు, దేశస్వాతంత్ర్యాన్ని పరిరక్షిస్తూ సోషలిస్టు గమ్యంవైపు భారతావనిని తీసుకువెళ్లడంలో యువక విద్యార్థిలోకం సమాజాగ్రభాగాన నిలబడి తమపైనున్న బృహత్ కర్తవ్యాన్ని నిర్వహించాలని 29 వ ప్రదేశ్ విద్యార్థి మహాసభలో అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ హిరేన్‌దాస్‌గుప్త ఉద్బోధించారు.

ఇక్కడ జరుగుతున్న విద్యార్థి ఫెడరేషన్ మహాసభలో శ్రీ హిరేన్ ప్రారంభోపన్యాసం చేస్తూ, ఇంకా యిలా అన్నారు:

"రిపబ్లిక్ దినోత్సవంనాడు ఈ మహాసభ జరగడం, దానిని ప్రారంభించే అవకాశం నాకు కల్గడం ఎంతో సంతోషంగా ఉంది. జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలు కొత్త పుంతలు తొక్కుతున్న ఈ రోజులలో ఈ మహాసభకు ప్రత్యేక ప్రాముఖ్యమున్నది.

"దేశరాజకీయ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఘనత విద్యార్థి ఉద్యమానికి ఉంది ఆర్థిక, రాజకీయ పరాధీనతను తొలగించుకొని తమ శక్తిసామర్థ్యాలను జాతి కుపయోగపడాలని, ఆవిధంగా దేశ పురోభివృద్ధికి తోడ్పడాల నేదే విద్యార్థుల లక్ష్యం. దేశ జనాభాలో విద్యార్థుల అవిభాజ్యం జీవితపోరాటంలో పాల్గొనడం ద్వారానే వారు సమాజ సమస్యలను అర్థం చేసుకో గలరు

"నేడు, భారత దేశంలో అక్షరాస్యుల సంఖ్య 25 శాతం మాత్రమే కార్మిక, కర్షకులు తమ జీవితం గడపటమే భారంగా ఉన్నప్పటికీ తమ బిడ్డలను అంతో ఇంతో చదివిస్తున్నారు. అలాంటి ప్రజల కష్టసుఖాల్లో భాగం పంచుకున్ననాడే విద్యార్థులు నిజంగా జీవితసత్యాలను అర్థంచేసుకోగల్గుతారు. సమస్యలను పరిష్కరించగల్గుతారు.

"రాజకీయ విభేదాలతో నిమిత్తంలేకుండా మాతృభూమి సేవాతత్పరులై, దాని అభివృద్ధికి కృషిచేయడంద్వారా, మిగతా అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడేలా విద్యార్థులు పాటుపడాలి. ఆ విధంగా విద్యార్థులు అగ్రభాగాన ఉండి కృషి చేస్తున్నారు కూడా. సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలో బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధిస్తూ, సోషలిజం నిర్మించటంద్వారా భారతదేశాన్ని భూతలస్వర్గం చేయాలని యువతరం ఉవ్విళ్లూరుతూంది. మానవజాతి మారణహోమానికి పనికివచ్చే మారణాయుధాలకు వెచ్చించే ధనాన్ని సాంఘిక పునర్నిర్మాణానికి వెచ్చించినట్లయితే అది సాధ్యమే. అందుచేత మానవజాతినే మట్టుపెట్టే ప్రపంచ యుద్ధాన్ని అరికట్టి, విశ్వశాంతిని పరిరక్షించవలసిన మహత్తర బాధ్యత మిగతా ప్రజానీకంతోపాటు విద్యార్థిలోకానికికూడాఉంది. దానిలో భాగంగానే మన తటస్థ విదేశాంగవిధానాన్ని బలపరచి,మరింతపరిపుష్టంచేయడానికి,విశ్వశాంతిని కాపాడే ఏదవ్వనైనా బలపరచడానికి విద్యార్థిలోకం సదా సంసిద్ధంగా వుంది. కనుకనే మాస్కోలో జరిగిన అణ్వస్త్రపరీక్షల పాక్షిక నిషేధ ఒప్పందాన్ని విద్యార్థులంతా బలపరచటమే కాక, అది శాంతికాముక శక్తుల విజయంగాకూడ పేర్కొంటున్నాం. భవిష్యత్తులో సామ్రాజ్యవాదుల మెడలు వంచి, సంపూర్ణ సమగ్ర నిరాయుధీకరణ సాధించేందుకు ఇది తోడ్పడుతుంది. ప్రజాబలానికి సామ్రాజ్య వాదులు లొంగక తప్పదు

రాజకీయాలు - విద్యార్థులు

"విద్యార్థులకు రాజకీయాలతో నిమిత్తం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. ప్రపంచ యుద్ధమే సంభవిస్తే వారు, వీరని భేదం లేకుండా అంతా యుద్ధాగ్ని జ్వాలలకు మిడతల లాగా మాడిపోతారు. కాని మేం బ్రతకాలని, భవిష్యత్‌ను తీర్చిదిద్దుకొని మా జీవితాలను సుఖమయం చేసుకోవాలని కోరుతున్నాం. అనవసర మారణహోమానికి ఆహుతికారాదని కోరుకుంటున్నాం. అందుచేత భారతీయ విద్యార్థి లోకం విద్యా సముపార్జనతోపాటు, శాంతి పరిరక్షణము కూడ ప్రధాన సమస్యగా పరిగణిస్తుంది.

"ప్రణాళికా బద్ధ విధానాన్ని, తటస్థ విదేశాంగ విధానాన్ని విడనాడాలనే, శక్తులు నేడు తీవ్రంగా విజృంభిస్తున్నాయి. ఈ ప్రణాళికాభివృద్ధి మరింత శరవేగంతో ముందుకు పోవాలని, ఊగిసలాటలు లేని తటస్థ విధానాన్ని భారతదేశం అవలంబించాలని, ఆ విధంగా దేశ ప్రయోజనాలను సాధించవలసిన సమయంలో నేడు మనమున్నాం. దేశాన్ని అంధకార బందురంలో ఉంచి, తమ లాభాలను మరింత పెంచుకోవాలని పెట్టుబడిదారులు ఎంతకైనా తెగిస్తున్నారు. అటువంటి క్లిష్ట పరిస్థితులలో దేశాన్ని, దేశప్రయోజనాలను రక్షించ వలసిన గురుతర బాధ్యత విద్యార్థి లోకంపై లేదా? కనుకనే విద్యార్థులు రాజకీయాలకు దూరంగా, సమాజసమస్యలకు ఎడంగా ఉండలేరు.

"విద్యా విధానంలో రోజు రోజుకొత్త విధానాలను ప్రవేశపెట్టడంవల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. దాని అర్థం విద్యాభివృద్ధి ఏ మాత్రం జరగలేదని అర్థం కాదు. కొంతవరకు జరిగినమాట వాస్తవం విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, విద్య అందరికి అందుబాటులో ఉండాలని, జీతాలను తగ్గించాలని డిటెన్షన్ విధానం రద్దుచేయాలని, నిరుద్యోగాన్ని నివారించాలని విద్యార్థిలోకం మొదటి నుండి కోరుతోంది. వాటిని వెంటనే పరిష్కరించాలి. విద్యా సమస్యలను తక్షణ జాతీయ సమస్యలుగా గుర్తించాలి. దీని కందరూ పాటు పడాలి.

'మనదేశంలో కులమత విభేదాలు తగ్గకపోగా పెరుగుతున్నాయేమో అనిపిస్తుంది. వీటికి వ్యతిరేకంగా పోరాడవలసిన విద్యార్థులు కొన్ని ప్రాంతాలలో వీటికి గురవడం చాల విచారకరం. సిగ్గుచేటుకూడ. దీనికి కలకత్తా మతకలహాలే తార్కాణం. కలకత్తాలో మొన్న జరిగిన మతకలహాలలో విద్యార్థులు వహించిన పాత్ర విద్యార్థిలోకానికే తలవంపుగా ఉంది. మనిషిని మనిషి దోచుకోవాలనే స్వార్థపరులు ఇలాంటి ఉన్మత్తతను ఉపయోగించుకొని మతకలహాలు రేపుతున్నారు. ప్రస్తుతం బోధించే విద్యావిధానంకూడా దీనికి కారణమవుతుంది. సోషలిజం లక్ష్యాలను నేటి విద్యావిధానంలో ప్రకటించక పోవడం దురదృష్టకరం.

"అందుచేత శాస్త్రీయ సోషలిజం లక్ష్యాలను విద్యార్థిఫెడరేషన్ ప్రచారం చేస్తున్నది మనిషిని మనిషి దోచుకునే పరిస్థితిని అంతం చేయడానికి, కులమత తత్వాలను నిరోధించడానికి ఆర్థిక స్వాతంత్ర్యం సాధించడానికి ఈ సోషలిస్టు లక్ష్యాలను ప్రచారం చేయవలసిన అవశ్యకత ఉంది. కనుక ప్రచారం చేస్తున్నాం.

స్వాతంత్ర్యోద్యమంలోను, భాషా రాష్ట్రాల సాధనలోను, నైజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ప్రముఖపాత్ర వహించిన ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్, తన ఉజ్వల సంప్రదాయాల కనుగుణంగా ఈ జాతీయ లక్ష్యాల సాధనంలో కూడ నడుం బిగించి పోరాడగలదని ఆశిస్తున్నాను.

ఇటీవల విజయవాడలో ఒకపోటీ సమావేశం జరిగిందని ఇక్కడకు వచ్చిన తరువాత తెలిసింది.

అలాంటి మహాసభ జరుగుతున్నందనే విషయం కాని, జరిగిన తరువాత కాని ఎవరూ కేంద్ర కార్యాలయానికి తెలుపలేదు. విద్యార్థి ఫెడరేషన్ సంస్థ అనేది ఒకటే. కేంద్ర అనుబంధ సంస్థగా జరిగే ఈ మహాసభకు అన్ని విధాల విద్యార్థులు, విద్యార్థి శ్రేయోభిలాషులు తమ సహాయ సానుభూతులను అందచేస్తూ ఐక్య విద్యార్థి ఉద్యమాన్ని కాపాడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. అని శ్రీ హిరేన్ తన ఉపన్యాసాన్ని ముగించారు

అధ్యక్షోపన్యాసం

మహాసభకధ్యక్షత వహించిన శ్రీ మోహిత్ సేన్ తన ప్రసంగంలో ఇలా అన్నారు.

"మిత్రులారా 29 వ మహాసభ రిపబ్లిక్ దినోత్సవంనాడు జరగడం ముదావహం.

పంజాబ్‌లోని రావీనది ఒడ్డున మొదటి సారిగా సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపివ్వటం జరిగింది ఆనాడు కాంగ్రెసులోని యువతరం మూలంగానే ఈ నినాదలక్ష్యాన్ని చేపట్టడం జరిగింది

ఈ శంఖారావాన్నివ్వటానికి కృషిసల్పిన వారిలో నెహ్రూ, బోస్, కమ్యూనిస్టులు సోషలిస్టులు, రాడికల్సు తదితరులున్నారు అదే విధంగా సోషలిజం వ్యవస్థాపనకై సాగే పోరాటంలో నేటి యువతరం ముందుండాలి. జాతీయోద్యమంలోఅగ్రగామిగాఉండి, స్వాతంత్ర్యం సంపాదించిన ఆ యువతరం లాగానే సోషలిజాన్ని స్థాపించడంలో ఈ యువతరం కృతకృత్యులవుతుందనటంలో నాకెలాంటి సందేహములేదు

"45 సంవత్సరాలనాడు ప్రపంచంలో ఒకేఒక సోషలిస్టు దేశం ఉంటే నేడు 14 సోషలిస్టు దేశాలు వెలిశాయి. సోషలిజం, కమ్యూనిజ సాధనంలో ఇవితిరకులేస్తూవరుగిడుతున్నాయి. ప్రపంచ పరిస్థితిలో అనేక మార్పులు వచ్చాయి ఆఫ్రికాఖండంలో సామ్రాజ్య వాదానికి అంతిమ క్రియలు జరపడానికి అక్కడ ప్రజలు కృతనిశ్చయులైనారు. అలానే దక్షిణ అమెరికా దేశాలతో సామ్రాజ్యవాద రాజకీయ, ఆర్థిక పెత్తనాన్ని కూకటి వేళ్ళతో పెకలించి సోషలిస్టు పథాన్ని క్యూబా చేపట్టింది. ఇంకా అనేక దేశాలలో జాతీయోద్యమ జ్వాలలు చెలరేగటంతోపాటు సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కొరకు ప్రజలు మహాప్రస్థానం సాగిస్తున్నారు.

"అలాగే ఆంధ్రలో కూడ అనేక స్థాయిలలో అనేక పోరాటాలు జరిగాయి. నేడు కూడ అధిక ధరలకు, బంజర్ల పంపకానికి, అదనపుభూమి శిస్తు చట్టం రద్దుకు రైతులు, కార్మికులు సత్యాగ్రహ పోరాటానికి సమాయత్త మవుతున్నాయి

"అమెరికాలో నీగ్రో ప్రజలు సమాన హక్కులకై పోరాటం సలుపుతున్నారు దక్షిణ కొరియా, దక్షిణ వియత్నాం ప్రజల స్వాతంత్ర్యోద్యమాలను వెన్నుపోటు పొడవటానికి అమెరికా తన సైన్యాలను మరింత ఎక్కువగా పంపుతూంది, ఆకలి, దారిద్ర్యానికి వ్యతిరేకంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై ఉవ్వెత్తున్న లెగుస్తున్న ఈ మహోన్నత ఉద్యమాలను ఆపటం అణచటం ఎవరి తరంకాదు.

'భారతదేశంలో పేదరికం తాండవిస్తూంది కలవారు మరింత కూడబెట్టుకో గల్గుతున్నారు. జాతీయాదాయంలో 85 శాతందేశంలోని 5 శాతం వ్యక్తుల చేతుల్లోకి పోతూంది. ఈ దోపిడీ ఇంకా చాలదన్నట్టు దేశంలోని అభివృద్ధి నిరోధక శక్తులు మనదేశం తిరోగమన పంథా చేపట్టాలని కాకి గోల చేస్తున్నారు. ఈ శక్తులను దృఢంగా వ్యతిరేకిస్తూ సామాన్య పౌరుని జీవితం బాగుపడేలా మనం కృషి చేయాలి.

దీనికి మార్గం సోషలిజం వినా మరొకటి లేదు. ఈ లక్ష్యసాధనలో విద్యార్థులు కూడ పాల్గొనాలి. విద్యార్థి సమస్యల పరిష్కార సాధనకు దేశ లక్ష్యమైన సోషలిజం స్థాపనకు మీ సంఘాన్ని పటుతర మొనర్చుకొని ఐక్య విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించి లక్ష్యసాధనలో మీరు విజయం పొందగలరని ఆశిస్తున్నాను" అని మోహిత్ సేన్ అన్నారు.

శ్రీ మద్దుకూరి ప్రసంగం

దేశ భవిష్యత్తును తీర్చిదిద్దవలసిన విద్యార్థులు తమ విద్యా సముపార్జనతోపాటు, ప్రజా సమస్యలను అర్థం చేసుకోవాలని, సాంఘిక దురన్యాయాలను, సంకుచిత భావాలను విడనాడి ఉన్నత సమాజ స్థాపనకై దీక్షా కంకణ ధారులవ్వాలని శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు ప్రబోధించారు

ఆయన తన ప్రసంగంలో ఇంకా ఇలా అన్నారు

"దేశంలోని అన్ని పార్టీలు సోషలిజాన్నే తమలక్ష్యంగా ప్రకటించాయి. గతంలో భారత స్వాతంత్ర్యం ప్రధాన లక్ష్యంగా గల పోరాటాన్ని దృఢ దీక్షతో కొనసాగించాం. అదే విధంగా నేడు సోషలిజం స్థాపనే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని కృతనిశ్చయంతో పోరాడవలసిన సమయం ఆసన్న మయింది

"జాతీయోద్యమ దశ నాటికంటె విద్యార్థి ఉద్యమం నేడు కొంత కుంటు పడింది ఇది చాల విచారకరం. దేశ ప్రజలందరికి సుఖమైన భవిష్యత్తు లభింపజేసే మతాయేది అని విద్యార్థులు తర్కించుకోవాలి అధ్యయనం చేయాలి ఎందుచేతనంటే సోషలిజం లక్ష్యానికి వ్యతిరేకంగా పనిచేసే శక్తులు ఉండటమేగాక సోషలిజం నిర్వచనలో అనేక భేదాభిప్రాయాలు పొడచూపుతున్నాయి అందుచేత, ఏదిసరియైన సోషలిజమో గుర్తించవలసినఆవశ్యకత ముఖ్యంగా విజ్ఞానార్జన చేస్తున్న విద్యార్థులకుందాలి ఆ విధంగా సోషలిజం లక్ష్యానికై సాగే పోరాటంలో మీరు అగ్రగాములుగా నిలబడాలి.

"పోతూపోతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మన దేశంలో కుల, మత వైషమ్యాలను రెచ్చగొట్టి మరీ వెళ్ళారు 16 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరంకూడ మొన్న కలకత్తాలో మత కలహాలు రేగటం, దానికి విద్యార్థులు కూడ గురికావటం దేశానికి మాయనిమచ్చ భారతదేశ సమైక్యతకు అది అవరోధం దానిని అధిగమించేందుకు విద్యార్థులు సుదృఢంగా పోరాడాలి.

'వరకట్న సమస్య నేటి సమాజాన్నిపట్టి పీడిస్తూంది. ముఖ్యంగా ఇది విద్యార్థులనుండే ఉత్పన్నమవుతూంది. అందుచేత కుల, మత విభేదాలతోపాటు కట్న పిశాచిని విద్యార్థులు పారద్రోలాలి"అని ఆయన అన్నారు.

ఆహ్వానసంఘ అధ్యక్షుని ఉపన్యాసం

అంతకు ముందు ప్రతినిధులకు స్వాగతం చెపుతూ ఆహ్వానసంఘ అధ్యక్షుడు శ్రీ జోషి ఇలా ప్రసంగించారు:

"విద్యా, విజ్ఞానాలకు కేంద్రంగాను, స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో ముందు భాగాన ఉండి చరిత్రలో ఖ్యాతిగడించిన గుంటూరు పట్టణంలో ప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ 29 వ మహాసభలు జరపడానికిగాను ఆహ్వానిస్తున్నందుకు మేమెంతో గర్విస్తున్నాం.

"అలాగే డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగాను, ఆంధ్రరాష్ట్రంకొరకు సాగిన పోరాటంలోను గుంటూరు విద్యార్థులు ఎల్లప్పుడూ అగ్ర భాగానే ఉన్నారు. విద్యార్థి ఫెడరేషన్ ప్రథమ మహాసభ జరిగిన ఖ్యాతికూడ గుంటూరుదే. వీటన్నిటికి తోడు నేడు రిపబ్లిక్ దినోత్సవం అందుచేత ప్రతినిధులుగా ఈ మహాసభలో పాల్గొనే మీకు ఆహ్వానిస్తున్నందుకు మాకు చాల ఆనందంగా ఉందనటంలో బహుశ అతిశయోక్తి ఏమీ లేదనుకొంటున్నాను.

"స్వాతంత్ర్యానంతరం జాతీయావసరాల కనుగుణంగా విద్యావిధానాన్ని ప్రవేశ పెట్టడంలో ప్రభుత్వం విఫలమయింది. ఇక విద్యార్థుల నెదుర్కొంటున్న సమస్యలు ఎన్నో చెప్పనవసరంలేదు. అందుచేత వీటన్నిటి పరిష్కారానికి విద్యార్థిలోకం సమైక్యంగా ఉండి, మీ లక్ష్యసాధనకై జరిగే కృషిలో కృతకృత్యులవుతారని ఆశిస్తున్నాము.

"మీ సమస్యలతోపాటు, భారతదేశ భాగ్యోన్నతికి, సోషలిజం స్థాపనకు కృతనిశ్చయంతో మీరు కృషిసల్పుతారని, దానికిగాను ఈ విద్యార్థి మహాసభలు అటు విద్యార్థిలోకానికి, ఇటు సమాజానికి ఆదర్శప్రాయంగా ఉండాలని నేను మనఃపూర్వకంగా కాంక్షిస్తున్నాను."

"మీ చర్చలు సమగ్రంగా సాగాలని, మీ సంఘం పటిష్ఠ మవ్వాలని, ఐక్యవిద్యార్థి ఉద్యమాన్ని నిర్మించడంలో మీరు జయప్రదం కావాలని నేను కోరుతున్నాను." అని శ్రీ జోషి తన ప్రసంగాన్ని ముగించారు.

మధ్య తూర్పు రైల్వే మండలాన్ని ఏర్పాటు చేయవలసిందిగా రైల్వేల మంత్రి శ్రీ దాసప్పను కోరడానికి ఆంధ్రనుండి శ్రీ యస్. సంజీవరాయణం, శ్రీ జె. రామలింగయ్యగార్లు ఢిల్లీ వెళ్ళారు.

జాతీయస్వాతంత్ర్యం దేశప్రజలందరి ఉమ్మడి సొత్తు

దీనిని దోపిడీవర్గాలనుండి రక్షించుకోవాలని మద్దుకూరి చంద్రశేఖరరావుగారి ఉద్బోధ

విజయవాడ, జనవరి 26

రిపబ్లిక్‌దినోత్సవ సందర్భంలో విశాలాంధ్ర కార్యాలయంలో ఉదయం జాతీయపతాకావిష్కరణ, సాయంత్రం నాటిక ప్రదర్శనలుజరిగాయి

విశాలాంధ్ర సంపాదకులు శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావుగారు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తూ బ్రిటిష్ సామ్రాజ్యవాదులక్రింద రెండువందల సంవత్సరాల బానిసత్వం అనుభవించిన తరువాత భారతదేశం స్వాతంత్ర్యాన్ని సాధించుకుందనీ, అందుకు ఏ కొద్దిమంది స్వదేశ సంస్థానాధీశులు జమీందారులో మినహా మిగిలిన భారత ప్రజలందరూ త్యాగాలు చేశారనీ అందుచే ఈ స్వాతంత్ర్యం ఏ ఒక వర్గానిదో, తరగతిదో కాక ప్రజలందరిదీ నని అన్నారు కాంగ్రెస్‌సంస్థ ఒక్కటే దేశ స్వాతంత్ర్యాన్ని సంపాదించిందని చెప్పటం కద్దనీ, ఈ పోరాటంలో కాంగ్రెస్ ప్రధాన పాత్ర వహించగా జాతీయవిముక్తికొరకుటెర్రరిస్టు ఉద్యమం, కార్మిక కర్షక ఉద్యమాలు నిర్వహించిన పాత్రకూడా గణనీయమైనదని అన్నారు జాతీయ పోరాటంలో పై వర్గాల వారు సంచాలకత్వం వహిస్తే మద్దతు యిస్తే క్రింది వర్గాలన్నీ అందులో పాల్గొని ఆభారాన్ని వహించాయని అన్నారు. స్వాతంత్ర్య సంపాదనానంతరం అంతవరకు జాతీయోద్యమంలోని ధనాఢ్యవర్గాలు కాంగ్రెస్ అధికారవర్గంలోచేరి ఈనాడు జాతీయ సంపదలో ఎక్కువభాగాన్ని కాజేస్తున్నాయని అన్నారు ఇటీవల మనదేశ సరిహద్దు సమస్యపై సోషలిస్టు దేశమైన చైనాసాయుధ సంఘర్షణకు దిగడంతో దేశంలోని ప్రతీపవర్గాలన్నీ కమ్యూనిస్టు పార్టీని దేశభక్తియుతవర్గాలనుండి ప్రజలనుండి వేరుచేసి దెబ్బకొట్టడానికి యత్నించాయనీ,కాని కమ్యూనిస్టు పార్టీ దేశభక్తిలోను దేశరక్షణ కృషిలోను తానెంత మాత్రం తీసిపోదని నిరూపించుకొని ఆ కుట్రను భగ్నం చేసిందని అన్నారు. దేశంలో ఏర్పడిన అత్యవసర పరిస్థితిని అవకాశంగా తీసుకొని కార్మిక, కర్షక, మధ్యతరగతి ప్రజలపై విపరీతమైన భారాన్ని నెట్టడంకోసం ప్రభుత్వం దేశంలోని అభివృద్ధినిరోధకవర్గమంతా యత్నించిందనీ, కాని ఈ విషయంలో కూడా కమ్యూనిస్టుపార్టీ ముందునిలబడిమహావిజ్ఞాపనకార్యక్రమంద్వారా ఆ కుట్రను ప్రతిఘటించిందనీ,నిర్బంధపొదుపు, బంగారు కంట్రోలు ఉత్తరువు మున్నగు సమస్యలపై ప్రభుత్వాన్ని వెనకంజవేసేటట్టు తగు ఉద్యమం నిర్మించగల్గిందనీ అన్నారు. అధిక శిస్తు చట్టానికి వ్యతిరేకంగాను, బంజర్ల తక్షణ పంపకం జరగాలనీ కోరుతూ నేడు పెద్ద ఎత్తున ఉద్యమం ప్రారంభమవుతూందనీ, ఈ విధంగా కార్మిక, కర్షక, మధ్యతరగతి ప్రజల హక్కుల కోసం కమ్యూనిస్టుపార్టీ ఇతర అభివృద్ధికరవర్గాల తోడ్పాటుతో ముందంజవేస్తూందని అన్నారు ఈ ఉద్యమాన్ని అందరూ జయప్రదం చేయాలన్నారు.

సాయంత్రం 6½ గంటలకు విశాలాంధ్ర కల్చరల్ కమిటీ ఆధ్వర్యాన వైజ్ఞానిక కార్యక్రమాలు నిర్వహించబడినాయి.

విశాలాంధ్ర వైజ్ఞానిక దళంవారు "దేశభక్తి" "శాంతి" గేయాలు పాడారు. రామపులు దంపతులు 'తెలుగుతల్లి' గీతం వినిపించారు.

శ్రీ పరకాల పట్టాభి రామారావుగారు రిపబ్లిక్ దినోత్సవ ప్రాముఖ్యతను గురించి మాట్లాడారు

శ్రీ చిత్రకళా మందిర్ అండ్ ఫ్రెండ్స్ మ్యూజికల్ అసోసియేషన్ వారు బృందవాద్యం వినిపించారు. శ్రీ సిట్టిం శత్రుఘ్నరావు రచించిన "పశ్చాత్తాపం" నాటిక ప్రదర్శించారు.

స్వతంత్రఆర్టు ప్రింటర్సుపనివారు శ్రీ గొల్లపూడి మారుతీరావురచించిన "ఎగ" నాటికా, బి. వి. శివరావు "కళాజీవి" అనే ఏకపాత్రాభినయం ప్రదర్శించారు. నాటికలో జి. కృష్ణారావు, కె. శ్రీరంగాచారి, బి. సీతారాం, కె. సుబ్బారావు ఆయా పాత్రలను నిర్వహించారు.

మానేజీరియల్ స్టాఫ్ కమిటీ కార్యదర్శి శ్రీ యస్. ఆనందరావుగారు వందనసమర్పణ చేశారు.

తీర్మాన పాఠం

(2 వ పేజీ తరువాయి)

స్వామ్యమూ పురోభివృద్ధీ కావాలనేవాళ్ళందరూ ఏకం కావడమే నేటి తక్షణ అవసరం.

ప్రజాతంత్ర దేశభక్త శక్తులలో విభేదాలు కల్పించడానికి విచ్ఛిన్నం చేయడానికి అభివృద్ధినిరోధకులు కమ్యూనిస్టు వ్యతిరేకతనూ, కమ్యూనిస్టు వ్యతిరేక సిద్ధాంత ఆయుధాన్నీ, ఉపయోగిస్తారు. ప్రజాతంత్ర శక్తుల సమైక్యత నిర్మించడానికీ, ఆ తరవాత రాజకీయ, ఆర్థికజీవితంలో అభివృద్ధి నిరోధకులతో పోరాడటానికి కమ్యూనిస్టు వ్యతిరేకతను ఓడించవలసివుంది.

భువనేశ్వర్‌లో కనిపించిన కాంగ్రెసులోని వర్ధమాన వామపక్ష శక్తులను భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యవర్గం విలువైనవిగా పరిగణిస్తూ, కాంగ్రెస్‌లోని అభ్యుదయ శక్తులు కాంగ్రెస్ బయటి అభ్యుదయ శక్తులతోసమైక్యమయ్యే సమయం వస్తుందని యెదురు చూస్తున్నది. స్వరాజ్యానంతరం యే నాడూ ఈ సమైక్యతకు యింతగొప్ప అవకాశాలు గానీ, గత్యంతర హీనమైన యింత అవసరం గానీ లేదు.

బ్రిటిష్ మంత్రి ప్రత[illegible]

(2 వ పేజీ తరువాయి)

నిషేధించేటందుకై ప్ర[illegible]చిన చర్యలకు మనము సమ్మతమే.

తమ దేశమూ, తమ మిత్ర దేశాలూ అనుసరించిన, అనుసరిస్తున్న విధానాలను తప్పుగా వ్యాఖ్యానంచేయ బడిందంటూ బ్రిటిష్ ప్రధాని ఇల్లా అన్నారు:

"వలస వ్యవస్థను గురించీ, జర్మన్ ఫెడరల్ రిపబ్లిక్ (పశ్చిమ జర్మనీ) అనుసరిస్తున్న విధానం గురించీ దక్షిణ వియత్నాం, దక్షిణ కొరియా ప్రజలకు అమెరికా ఇస్తున్న సాయం గురించీ మీ లేఖలో వ్రాసినవి పుదాహరణలుగా చూపుతున్నా."

వానిని గురించి నే నిప్పుడు వాగ్వాదానికి దిగదలచుకో లేదు. కాని, కనీసం ఇప్పుడేనా చర్విత చర్వణం మానే స్తే బాగుంటుంది."

సంపూర్ణ సర్వాయుధ విసర్జనే సుస్థిర శాంతికి మార్గమన్న కృశ్చేవ్ అభిప్రాయంతో తానూ ఏకీభవిస్తున్నా నంటూ బ్రిటిష్ ప్రధాని ఇల్లాగ అన్నారు.

"క్రమాధికంగా పరస్పర విశ్వాసం పెంచుకుంటూ, దానిలో వచ్చే సమస్యలను పరిష్కరించుకొంటూ మెల్లమెల్లగా అడుగువేస్తేనే ముందుకు పోగలుగుతామని అనుభవరీత్యా గ్రహించాము.

"ఒకరు రెండోవారిమీద ఆకస్మికదాడి తలపెట్టడంలేదని ధృవీకరించుకొనేటందుకు ఉభయపక్షాలూ అనుసరించవలసినపద్ధతులమీద ఒప్పందానికి గట్టిగా ప్రయత్నించడం అవసరమని మేము భావిస్తున్నది అందుకోసమే.

"మీ ప్రతిపాదనను భగ్నపరచడం నా పుద్దేశంకాదు దానిమీద నిర్మించుకురావడమే నా అభిప్రాయం" అంటూ బ్రిటిష్ ప్రధాని డిసెంబరు 31 వ తేదీన కృశ్చేవ్ వ్రాసిన లేఖలో కొన్ని లోపా లున్నాయన్నారు.

ఫలానా ప్రాంతం నాకు రావాలనడంలో "న్యాయమైన' కోరికా, "న్యాయరహితమైన" కోరికఅని విభజించడం కృశ్చేవ్ లేఖలోని లోపాలలో ఒకటంటూ అయన ఇల్లా అన్నారు.

నోటిఫికేషన్

కేశనకుర్రు పంచాయితీ

తూర్పు గోదావరిజిల్లా కేశనకుర్రు పంచాయితీకి 1963-64 సం॥రమునకు లైటింగు సామానులు సప్లయిచేయుటకు టెండర్లు ది 11-1-64 వ తేదీ సాయంకాలము 4-00 గంటల వరకూ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుచే తీసుకొనబడును అదే తేదీ సాయంత్రము 4-30 గంటలకు టెండరుదార్ల సమక్షములో తెరుచబడును, ప్రతి టెండరుదారు టెండరుతోపాటు రు. 25/-లు ధరావత్తు చెల్లించవలెను. మిగిలిన టెండరు వివరములు ఆఫీసుపని వేళలలో పొందవచ్చును.

ఎమ్. వెంకటరావు, బి.ఏ.,
ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు.

ఆంధ్రప్రదేశ్ ఫారెస్టు డిపార్టుమెంటు

వేలము నోటీసు

యావన్మందికి యిందుమూలముగా తెలియ జేయడం యేమనగా:

చిత్తూరు టౌన్, కొంగారెడ్డిపల్లి 2-8-3 నెంబరు గల యింటిలో యుండు గవర్నమెంటు కాండువుడ్ నేల డిపోలో సుమారు (11)పదకొండు మెట్రిక్ టన్నుల పైనలు క్లీన్ష కాండువుడ్ 1964 సంవత్సరం ఫిబ్రవరినెల 10 వ తేదీ, సోమవారం పుదయం 11 గంటలకు శ్రీ చిత్తూరుజిల్లా పడమటి అటవీశాఖాధికారిచే బహిరంగముగా వేలము వేయబడును. వివరములను తెలిసికొన గోరువారు శ్రీ చిత్తూరుజిల్లా పడమటి అటవీశాఖాధికారిని నేరుగా లేక పుత్తరముల ద్వారాగాని వ్రాసి తెలిసికొనవచ్చును.

(సం) డి. యస్. గంగాఖేడ్కర్,
చిత్తూరుజిల్లా పడమటి అటవీ శాఖాధికారి,
చిత్తూరు, 20-1-64.

ఆంధ్రప్రదేశ్ జైళ్ళడిపార్టుమెంటు

టెండరు నోటీసు

ఈ క్రింద సుదహరింపబడిన జైళ్ళకు ది 1-4-1964 నుండి 31-3-65 వరకు ఆహార పదార్థములు, యితరకిరాణా సరకులు సప్లయిచేయుటకు సీలువేయబడిన టెండర్లు, సదరు జైళ్ళకు యెదురుగా వ్రాయబడిన తేదీలలోగా అంగీకరింపబడును.

వరుస నెంబరు	జైలుపేరు	టెండరు అంగీకరించుటకు ఆఖరుతేదీ
1.	సెంట్రల్‌జైలు, రాజమండ్రి	25-2-1964
2	ప్రిజనర్స్ ఓపెన్ ఎయిర్‌పర్మ్యుక్యాంపు, ఖాబోలు, నల్గొండజిల్లా	26-2-1964
3.	జిల్లాజైలు, మహబూబ్‌నగర్	26-2-1964
4.	జిల్లాజైలు, సంగారెడ్డి	26-2-1964
5.	సెంట్రలుజైలు, వరంగల్లు	28-2-1964
6.	గ్రేడ్ II సబ్‌జైలు, గుంటూరు	26-2-1964
7.	జూనియర్ సర్టిఫైడుస్కూలు, (బాలుర) ఏలూరు	26-2-1964
8.	స్పెషల్ సబ్‌జైలు, నెల్లూరు	26-2-1964
9.	జిల్లాజైలు, కరీంనగర్	28-2-1964
10	జిల్లాజైలు, నల్గొండ	26-2-1964
11.	సెంట్రల్‌జైలు హైదరాబాదు, జిల్లాజైలు సికింద్రాబాదు, జూనియర్ మరియు సీనియర్ సర్టిఫైడు స్కూల్సు (బాలుర) హైదరాబాదు, బాలికల సర్టిఫైడుస్కూలు, బాలికల రిమాండు హోము మరియు బాలుర ఆఫ్టర్‌కేర్ హోము, హైదరాబాదు.	29-2-1964
12	సెంట్రల్‌జైలు విశాఖపట్టణము, బోర్స్టల్‌స్కూలు విశాఖపట్టణము	29-2-1964
13.	జిల్లాజైలు, నిజామాబాదు	26-2-1964
14	రిసెప్షన్ హోము, విజయవాడ	26-2-1964

(పై తేదీలు మాన్యుఫాక్చరీ సెక్షనుకుకూడా అన్వయించును).

2 హైదరాబాదు, సికింద్రాబాదులలోని అన్ని జైళ్ళకు, సంస్థలకు సరకులు సప్లయి చేయుటకు హైదరాబాదు సెంట్రలుజైలు సూపరింటెండెంటువారు కామన్ టెండర్లు (Common Tend rs) అంగీకరించెదరు

3 సెంట్రలుజైలు విశాఖపట్టణము, బోర్స్టల్‌స్కూలు విశాఖపట్టణము రెండింటికి విశాఖపట్టణము సెంట్రలుజైలు సూపరింటెండెంటువారు కామన్ టెండర్లు అంగీకరించెదరు.

4. పూర్తి వివరములు సదరు జైలుసూపరింటెండెంట్లకు వ్రాసుకొని పొందవలయును.

యస్. యం. హస్సన్,
ఆంధ్రప్రదేశ్ జైళ్ళ ఇన్‌స్పెక్టర్ జనరల్, హైదరాబాదు.

సంపాదకవర్గం: కాట్రగడ్డ రాజగోపాలరావు (అధ్యక్షులు) ఏటుకూరు బలరామమూర్తి, తుమ్మల వెంకటరామయ్య. విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్, కాట్రగడ్డ రాజగోపాలరావు. స్వతంత్ర ఆర్టు ప్రింటర్స్, విజయవాడ-4.